అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శుక్రవారం 13-12-2024
సంపుటి : 10 సంచిక : 294 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



18 ఏండ్ల కుర్రాడు గుకేశ్ దొమ్మరాజు చదరంగంలో చరిత్ర సృష్టించాడు. 11 ఏండ్ల క్రితం భారత్ చేజారిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ కిరీటాన్ని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చాడు. చెస్ మాంత్రికుడు, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌పై గుకేశ్ దొమ్మరాజు చారిత్రక విజయం సాధించాడు.

చదరంగ రారాజు గుకేశ్ దొమ్మరాజు

18 ఏండ్లకే వరల్డ్ చెస్ కిరీటం సొంతం

డింగ్ లిరెన్‌పై గుకేశ్ చారిత్రక విజయం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ 2025

వివరాలు 12లో

జమిలీకి క్యాబినెట్ ఆమోదం



ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు

రాజ్యాంగ విరుద్ధమంటున్న ప్రతిపక్షాలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'ఒకే దేశం...ఒకే ఎన్నిక'కు సంబంధించిన ముసాయిదా బిల్లుకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశమైంది. ఈ ముసాయిదా బిల్లును ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఆ తరువాత సంబంధిత పార్లమెంటరీ కమిటీకి పంపే అవకాశం ఉంది. ఈ కమిటీ ద్వారా వివిధ రాష్ట్రాల శాసనసభల స్వీకర్లను ...11లో



ప్రార్థనా స్థలాలపై సర్వేలు ఆపండి

కొత్త వ్యాజ్యాలు స్వీకరించొద్దు

మధ్యంతర ఆదేశాలు వద్దు : దిగువ కోర్టులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ప్రార్థనా స్థలాల యాజమాన్యం, హక్కులను సవాలు చేస్తూ దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించవద్దని సుప్రీంకోర్టు గురువారం దేశంలోని న్యాయస్థానాలన్నింటినీ ఆదేశించింది. 'తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ కొత్తగా వ్యాజ్యాలు నమోదు చేయవద్దు. ఎలాంటి ఆదేశాలు జారీ చేయవద్దు. ఇప్పటికే పెండింగులో ఉన్న పిటిషన్లకు సంబంధించి మధ్యంతర ఉత్తర్వులు లేదా తుది ఆదేశాలు ఇవ్వకూడదు. సర్వేలు జరపాల్సిందిగా ఆదేశించకూడదు' అని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు వారణాసిలోని జ్ఞానవాపి వివాదం, మధురలోని కృష్ణ జన్మభూమి వివాదం సహా పలు ప్రార్థనా స్థలాలకు కూడా ...11లో

రైతుకు బేడీలు

పోలీసుల తీరుపై సీఎం సీరియస్

సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల అన్నదాతకు గుండెపోటు

గతంలోనే గాంధీలో వైద్య పరీక్షలు చేయించిన జైలు సిబ్బంది

ఇంటి వద్ద ఉన్నపుడే అనారోగ్యం

బేడీలతో ఆస్పత్రికి తరలించిన పోలీసులు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి, సంగారెడ్డి

ఫార్మా సిటీ భూ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్‌పై జరిగిన దాడి కేసులో అరెస్టయి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న లగచర్ల రైతుకు గుండెపోటు వచ్చింది. రైతు హీర్యా నాయక్ జైల్లో అనారోగ్యం పాలవడంతో వైద్య పరీక్షలు చేస్తుండగా గుండెపోటు వచ్చిందన్న విషయం గుర్తించారు. దాంతో జైలు సిబ్బంది బుధవారం రాత్రి హుటాహుటిన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మూడు రోజుల ముందే ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లిన జైలు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించి తీసుకువచ్చారు. మళ్లీ బుధవారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు ...11లో

అన్యాయం

లగచర్ల దాడి కేసులో సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతుకు ఛాతీనొప్పి వస్తే కనీస మానవత్వం లేకుండా బేడీలు వేసి తీసుకెళ్లడం దారుణం. రైతు హీర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలి. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- గొల్లపల్లి జయరాజు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

సీఎం క్రూర మనస్తత్వానికి నిదర్శనం

రైతులకు బేడీలు వేసిన ఘటనపై కేటీఆర్

హైకోర్టు సుమోటోగా స్వీకరించాలి 11లో..



అంత అవసరమేంటీ!

కరుడుగట్టిన నేరస్తుని మాదిరి సంకెళ్లా...?

తక్షణమే విచారణ చేసి నివేదిక ఇవ్వండి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



రిమాండ్ ఖైదీ లగచర్ల రైతు హీర్యా నాయక్‌కు గుండెపోటు వస్తే అతనికి ఖైదీకి వేసిన మాదిరిగా బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయం మీడియాలో రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఘటనపై అధికారుల ద్వారా సమాచారం తెలుసుకొని జైలు అధికారులపై సీరియస్ అయ్యారు. రిమాండ్ ఖైదీకి బేడీలు వేయాల్సిన అవసరం ఏముందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. నిందితునికి గుండెపోటు వచ్చి చావు బతుకుల మధ్య ఉంటే కనీసం రైతు అని కూడా చూడకుండా, కరుడుగట్టిన నేరస్తుని మాదిరి సంకెళ్లు వేయడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. జైలు సిబ్బంది తీరు పట్ల సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

దండకారణ్యంలో మళ్లీ పేలిన తూటా

అబూజ్‌మడ్‌లో 12 మంది మావోయిస్టుల మృతి

నారాయణపూర్-బీజాపూర్ జిల్లాల సరిహద్దులో ఘటన



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవుల్లో మళ్లీ తూటా పేలింది. అటు దంతేవాడ జిల్లా ఇటు బీజాపూర్ జిల్లా సరిహద్దులోని అబూజ్‌మడ్ దండకారణ్యం రేఖ వాయ గ్రామ సమీపంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు దంతేవాడ ఎస్పీ గౌరవరై తెలిపారు. అయితే 15న కేంద్రహోం శాఖమంత్రి అమిత్‌షా బస్తర్ పర్యటనకు ముందే ఈ కాల్పులు జరగటం చర్చనీయాంశంగా మారింది.

ఎస్పీ గురువారం మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున నారాయణపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులోని దక్షిణ అబూజ్‌మడ్ అడవుల్లో ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన 40 నుంచి 50 మంది పెద్ద క్యాడర్ మావోయిస్టుల ఉనికి ఉన్నట్టు సమాచారం అందింది. దీంతో దంతెవాడ, నారాయణ పూర్, కొండగావ్, బస్తర్ జిల్లాలకు చెందిన సైనికులు, డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలు అడవిని చుట్టుముట్టాయి. ఈ క్రమంలో బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరంగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 12మంది మావోయిస్టులు మృతి చెందినట్టు ఎస్పీ ధ్రువీకరించారు. కాంగ్రెస్ హయాంలో మరణించిన మావోయిస్టుల సంఖ్య కంటే, బీజేపీ ప్రభుత్వ హయాంలో కేవలం ఒక ఏడాదిలోనే 220 మంది మావోయిస్టులు హతమయ్యారు.

అమిత్‌షా పర్యటనకు ముందు ఎదురు కాల్పులు

కేంద్ర హోంమంత్రి అమిత్ షా 15న బస్తర్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా భద్రతా బలగాలను దింపారు. అయితే మాడ్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వేయి మందికి పైగా సైనికులను ఆపరేషన్ కోసం రప్పించారు. మావోయిస్టులు సమావేశమైన ప్రాంతాన్ని చుట్టుముట్టారు. మావోయిస్టులకు, భద్రతా బలగాలకు జరిగిన ఎదురు కాల్పు లతో ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైందని స్థానికులు తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం మంత్రి విజయ్ శర్మ మాట్లాడుతూ మావోయిస్టులను నియంత్రించే చర్యలు కొనసాగుతాయని చెప్పారు.



దేశాన్ని అమ్మనీయం

పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

అదానీ ముడుపుల వ్యవహారంపై జేపీసీకి పట్టు

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుపై ప్రివిలేజ్ నోటీస్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

'దేశాన్ని అమ్మనీయం'(దేశ్ బిక్నే నహీ దేంగే) అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీల నినాదాలతో పార్లమెంట్ ఆవరణ దద్దరిల్లింది. అదానీ ముడుపుల వ్యవహారంపై చర్చకు పట్టుబడుతూ ఇండియా బ్లాక్ పార్టీలు గురువారం కూడా వినూత్నంగా ఆందోళన చేపట్టాయి. 'దేశ్ బిక్నే నహీ దేంగే' అని హిందీలో ఒక్కో అక్షరంతో రాసి ఉన్న ఒక్కో ప్లకార్డు చేతబూని నిరసన వ్యక్తం చేశారు. సభకు వెళ్లే ప్రధాన గేటు మకర ద్వారం, సంసద్ భవన్ (ఓల్డ్ పార్లమెంట్ భవనం) ముందు ప్రతిపక్ష ఎంపీలంతా మానవహారం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, శివసేన, డీఎంకే, ఎన్‌సీపీ, ఆప్, కేరళ కాంగ్రెస్, జేఎంఎం, ఐయూఎంఎల్ తదితర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ (జేపీసీ)తో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సుముఖంగా లేని కేంద్ర ప్రభుత్వం, ప్రజల దృష్టి మరల్చేలా వ్యవహరిస్తోందని, ఉభయ సభలను ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉభయ సభలు వాయిదా

పార్లమెంట్ ఉభయ సభలు గురువారంనాడూ వాయిదాల పర్వం తొక్కాయి. సభలు ప్రారంభమైన క్షణం నుంచి అధికార, ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలతో గందరగోళం నెలకొంది. దీంతో లోక్‌సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు. ఆ తరువాత మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అమెరికా వ్యాపారవేత్త జార్జ్ సోరస్‌తో కాంగ్రెస్ పార్టీకి లింకు ఉన్నట్టు బీజేపీ ఆరోపించగా, అదానీ అంశంపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఇరు వైపుల సభ్యుల నినాదాలతో సభ హోరెత్తింది. ప్రశ్నోత్తరాల సమయం పూర్తి అయిన తరువాత, జీరో అవర్‌లో ప్రతిష్టంభన మొదలైంది. కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాట్లాడుతూ.. ఓ వ్యాపారవేత్తకు, బీజేపీకి లింకులున్నట్టు ఆరోపించారు. అయితే ఆ వ్యాపారవేత్త పేరును రికార్డుల్లో చేర్చడం లేదని స్పీకర్ చైర్‌లో ఉన్న ...11లో

రహదారుల అభివృద్ధికి సహకరించండి

ట్రిబుల్ ఆర్‌కు సాంకేతిక, ఆర్థిక అనుమతులివ్వండి

హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి

హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసల విస్తరణకు డీపీఆర్ ఆమోదించండి : జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి (159 కిలో మీటర్ల) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులను వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో సీఎం రేవంత్ రెడ్డి గురువారం రాత్రి సమావేశమయ్యారు. 2017లోనే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని 161 ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని సీఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్‌తో అనుసంధానించే ఎన్‌హెచ్-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024-25 బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే పనుల డీపీఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్-63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి ...12లో

అసెంబ్లీ సమావేశాల్లోనే వేతనాల పెంపు ప్రకటించాలి

24 రోజుల సమ్మె కాలం బకాయిలు చెల్లించాలి

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సునీత, జయలక్ష్మి

ధర్నాచౌక్‌లో అంగన్వాడీల భారీ ధర్నా

నవతెలంగాణ-ముషీరాబాద్

అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ వేతనాలను రూ.18 వేలకు పెంచుతున్నట్టు శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రభుత్వం ప్రకటించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సునీత, జయలక్ష్మి అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద అంగన్వాడీలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలను పిల్లలకు రూ.1.15 పైసల నుంచి ...11లో



వికారాబాద్‌లో మాజీ మహిళా మంత్రుల అరెస్టు

ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినుల పరామర్శకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

చంగముల్ పీఎస్‌కు సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

పోలీస్ స్టేషన్‌లోకి మీడియాను అనుమతించని పోలీసులు

నవాబుపేట పీఎస్‌కు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

అవసరమైతే మీడియాను కూడా అరెస్ట్ చేస్తారేమో..? ఎమ్మెల్యే సబిత

10లో..



ప్రపంచవ్యాప్తంగా 54 మంది జర్నలిస్టులు మృతి

ఈ ఏడాదిలో మరణాలపై రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ నివేదిక



పారిస్: ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాదిలో 54 మంది జర్నలిస్టులు తమ విధులను నిర్వహిస్తున్నప్పుడు లేదా వారి వృత్తి కారణంగా మృతి చెందారు. వారిలో మూడో వంతు ఇజ్రాయిల్ సైన్యం చేత చంపబడ్డారని గురువారం రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ (ఆరెస్ఎఫ్) ప్రచురించిన వార్షిక నివేదికలో పేర్కొంది. పత్రికా స్వేచ్ఛ, ఎన్జీఓల సమాచారం ప్రకారం ఈ సంవత్సరంలో 18 మంది జర్నలిస్టుల మరణాలకు ఇజ్రాయిల్ సాయుధ దళాలు కారణమ ...11లో

కొట్టినందుకు చింతిస్తున్నా..

మీ ఇంట్లో ఎవరైనా దూరితే అంగీకరిస్తారా

ఆడియోలో నటుడు మోహన్ బాబు

జర్నలిస్టుపై దాడి ఘటనలో హత్యాయత్నం కేసు



నవతెలంగాణ-సిటీబ్యూరో/ బడంగ్‌పేట్

జర్నలిస్టును కొట్టిన మాట నిజమే.. కానీ ఏ సందర్భంలో కొట్టానో ఆలోచించాలని, అయినప్పటికీ అలా కొట్టినందుకు చింతిస్తున్నానని సినీ నటుడు మోహన్‌బాబు అన్నారు. గురువారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆయన 11 నిమిషాల ఆడియో విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ.. "జర్నలిస్టును కొట్టాలని తాను దైవసాక్షిగా అనుకోలేదు. ఫ్యామిలీ విషయాల్లో ఇతరులు ఎవరైనా జోక్యం చేసుకోవచ్చా..? ఈ విషయాన్ని గురించి ప్రజలు, రాజకీయ ...10లో

పైపైకి గుడ్డు ధర

మధ్యాహ్న భోజనంలో గుడ్డు బంద్ !

- ప్రభుత్వమిచ్చేది రూ.5.. మార్కెట్లో ధర రూ.7
- ఏడు నెలలుగా బిల్లులు రాని పరిస్థితి
- నిరసనగా నార్కట్‌పల్లి మండలంలో గుడ్డు బంద్ చేసిన నిర్వాహకులు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేస్తూ, విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంతోపాటు బడి బయట పిల్లలు పాఠశాలలకు వచ్చేలా చేయడం మధ్యాహ్న భోజన పథకం లక్ష్యం. విద్యార్థులకు విద్యతోపాటు మధ్యాహ్నం నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందించాలని ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. నిర్వహణ బాధ్యతలను స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించింది. అయితే, నానాటికీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆ భోజన ఖర్చుకు సంబంధించి మెనూ మాత్రం పెంచడం లేదు. మధ్యాహ్న భోజనంలో వారానికి మూడ్రోజులు విద్యార్థులకు గుడ్లు పెట్టాల్సి ఉంది. ప్రస్తుతం కూరగాయలు, గుడ్ల ధరలు పెద్దఎత్తున పెరిగాయి. గుడ్డు రూ.7కు చేరింది. ప్రభుత్వం గుడ్డుకు కట్టిచ్చేది మాత్రం రూ.5. అంటే, అదనంగా నిర్వాహకులపై రూ.2 భారం పడుతోంది. ఆ బిల్లు కూడా ఏడు నెలలుగా ఇవ్వకపోవడంతో భోజనంలో గుడ్డు బంద్ అయ్యింది.





ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 3143 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో లక్ష 76,659 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో మొత్తం 1483 పాఠశాలల్లో.. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 229, ప్రాథమికోన్నత పాఠశాలలు 126, ప్రాథమిక పాఠశాలలు 1128 ఉన్నాయి. 70 వేల 18 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 700, ప్రాథమికోన్నత పాఠశాలలు 81, ఉన్నత పాఠశాలలు 217 ఉన్నాయి. విద్యార్థులు 66,999 మంది ఉన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో మొత్తం పాఠశాలలు 662 ఉండగా అందులో 39642 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థులందరికీ వారానికి మూడ్రోజులు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం కోసం గుడ్డును అందిస్తున్నారు.

పెరుగుతున్న గుడ్డు ధర

గుడ్డు ధర రోజు రోజుకూ పెరిగిపోతోంది. పౌల్ట్రీ ఫారమ్స్‌లో గుడ్డు రూ.6.50 పైసలు ఉండగా, బహిరంగ మార్కెట్లో రూ.7కు అమ్ముతున్నారు. ప్రతిరోజూ పౌల్ట్రీ ఫామ్స్‌లోనే రూ.10 నుంచి 20 పైసలు పెరుగుతోంది. మార్కెట్లో రిటైల్‌గా కిరణా షాపుల్లో రూ.8కి కూడా అమ్ముతున్నారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వారానికి మూడుసార్లు గుడ్డు పెట్టేందుకు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.5 ఇస్తోంది. కానీ మార్కెట్లో గుడ్డు ధర రూ.7 నుంచి 8 రూపాయలుంది. దీంతో నిర్వాహకులు అదనంగా రెండ్రూపాయలు కలిపి గుడ్డు పెట్టాల్సి వస్తోంది.



ఏడు నెలలుగా ఆగిన బిల్లులు

కూరగాయల బిల్లుతోపాటు కోడిగుడ్ల బిల్లును ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తోంది. అయితే, ఏడు మాసాలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు కోడిగుడ్ల బిల్లు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. మధ్యాహ్న కార్మికుల ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే కావడంతో.. అప్పులు చేసి విద్యార్థులకు పౌష్టికాహారం పెడుతున్నారు. కిరాణా షాపుల్లో ఉద్దెర ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే బిల్లు ఇవ్వకపోగా.. ప్రస్తుతం ధర కూడా భారీగా పెరగడంతో దాదాపు పది రోజులుగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో గుడ్లు బంద్ చేశారు.

బిల్లులు చెల్లించకపోతే.. ఎలా పెట్టాలి
బత్తిని సరిత, మధ్యాహ్న భోజన కార్మికురాలు

ప్రతి విద్యార్థికీ మధ్యాహ్న భోజనంలో వారానికి మూడుసార్లు గుడ్లను వడ్డించాల్సి ఉంది. ప్రభుత్వం మార్కెట్ ధర ప్రకారం గుడ్డు ధరను ఏజెన్సీలకు చెల్లించడం లేదు. ప్రభుత్వం ఇచ్చేదానికి అదనంగా ప్రతి విద్యార్థికీ రెండు రూపాయలు మధ్యాహ్న భోజన కార్మికులు భరించాల్సి వస్తోంది. నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 266 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం ప్రభుత్వం చెల్లించే బిల్లుకు అదనంగా ప్రతి రోజూ 660 రూపాయలు మేము భరిస్తున్నాం. ఒకవైపు ప్రభుత్వం సకాలంలో బిల్లు చెల్లించకపోవడం, మరోవైపు రోజురోజుకూ పెరుగుతున్న గుడ్ల ధరతో అప్పుల పాలయ్యాం. దీంతో ప్రభుత్వానికి నిరసన తెలియజేసేందుకు పది రోజుల నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టడం బంద్ చేశాం. ఇకనైనా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో, మార్కెట్ ధరలకు అనుగుణంగా బిల్లులు చెల్లించాలి.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం ప్రజావాణి ప్రత్యేక చొరవతో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రీ సభ్య కమిటీ ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్నచిన్న తప్పుల(స్టాప్‌లో బస్సు ఆపలేదు..సెల్‌ఫోన్ మాట్లాడటం)ను చూసి ఆర్టీసీ యాజమాన్యం వారిని సర్వీస్ నుంచి తొలగించడంపై కార్మికులు సీఎం ప్రజావాణి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించగా..రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని తెలిపారు. ఆ కమిటీకి చైర్మెన్‌గా కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, మెంబర్ కన్వీనర్‌గా ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్, సభ్యులుగా సెర్ప్ సీఈఓ దివ్య ఉంటారని తెలుపుతూ రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కమిటీ వేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీబీ కస్టడీలో ఏఈఈ నిఖేశ్ కుమార్

- కోట్లాది రూపాయల అక్రమార్జనపై ఆరా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కోట్లాది రూపాయల ఆదాయానికి మించి ఆర్జించిన నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిఖేశ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలనే ఆదాయా నికి మించి ఆస్తుల కేసులో నిఖేశ్‌కుమార్ ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఆ సమయంలో నిఖేశ్‌కుమార్ ఆస్తుల సోదాల్లో బయటపడ్డ స్థిర, చరాస్తుల విలువను 17 కోట్ల 76 లక్షల రూపాయలుగా చూపారు. అయితే, దీని ప్రస్తుత మార్కెట్ విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని అధి కారులు అంచనా వేస్తున్నారు. అయితే, కోట్లాది రూపాయల అక్ర మాస్తులను నిఖేశ్ గడించిన తీరును బయటపెట్టడానికి గానూ అతన్ని తమ కస్టడీకి ఇవ్వాలంటూ ఏసీబీ కోర్టును దర్యాప్తు అధికారులు అర్జించారు. దీనిపై స్పందించిన కోర్టు నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చంచల్‌గూడ జైలు నుంచి నిఖేశ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని బంజా రాహిల్స్‌లోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఏఈఈ హోదాలో వందల కోట్ల రూపా యలను ఏవిధంగా గడించారనే విషయంపై అధికారులు దృష్టిని సారించి ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా నిఖేశ్ అక్రమార్జన వెనుక నీటి ఓపారుదల శాఖకు చెందిన కొందరు ఉన్నతాధికారుల హస్తం కూడా ఉన్నట్టు, వారికి కూడా ఈ అక్రమార్జనలో భాగం ఉన్నట్టు ఏసీబీ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఆ కోణంలో కూడా నిఖేశ్ కుమార్‌పై ప్రశ్నలు సంధిస్తున్నట్టు తెలుస్తున్నది.

ధరణి సేవలు తాత్కాలికంగా నిలిపివేత

- 16 నుంచి తిరిగి ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డేటాబేస్ వెర్షన్ అప్‌డేట్ కారణంగా ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా ఆగిపోయాయి. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ పోర్టల్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసింది. నాలుగు రోజుల అనంతరం ఈ నెల 16 నుంచి తిరిగి ధరణి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

అదానీ వ్యవహారంపై మోడీ సమాధానం చెప్పాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్

అదానీ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారపాయన సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టినా బీజేపీ ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో నిర్వహించనున్న సీపీఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతోపాటు మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, నాయకులు కె.కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, చంద్రగిరి ఉదయకుమార్, ఏఐవైఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు మనస్ కుమార్, సూర్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం పాల్గొన్నారు.

ఒకరికి బదులు మరొకరు రాసిన పరీక్ష

- ఇద్దరికీ కలిసి రూ.10,000 జరిమానా

నవతెలంగాణ-ఆర్మూర్

ఓపెన్ 10వ తరగతి పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడంతో రూ.10వేలు జరిమానా విధించినట్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.రామకృష్ణ గురువారం తీర్పునిచ్చారు. 2017 ఏప్రిల్ 17వ తేదీ టీఎస్ మోడల్ స్కూల్‌లో ఎండీ ఫయాజుద్దీన్‌కు బదులు ఎండీ ముమీత్ పరీక్ష రాస్తున్నట్టు డ్యూటీ సూపరింటెండెంట్‌కు తెలియగా.. ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఆ పరీక్ష ప్రతులను ఓపెన్ స్కూల్ హైదరాబాద్ డైరెక్టర్‌కు సైతం పంపారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేసు నమోదు కాగా విచారణలో భాగంగా ఇద్దరికీ జరిమానా విధించినట్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీర్పు వెల్లడించారు.

గంజాయి చాక్లెట్స్ విక్రయదారుని అరెస్ట్

- 4.957 చాక్లెట్ల పట్టివేత



నవతెలంగాణ-బోడుప్పల్

బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్టీఎఫ్ సీఐ సుభాష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన పండరీ అక్కడి నుంచి గంజాయి చాక్లెట్‌లు తీసుకొచ్చాడు. వాటిని బోడుప్పల్ గౌతంనగర్‌లోని పలు కంపెనీల్లో పనిచేసే వారికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా సుమారు 4,957 గంజాయి చాక్లెట్‌లు లభించాయి. బీహార్ నుంచి ఎవరికీ అనుమానం రాకుండా చాక్లెట్ల రూపంలో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. అనంతరం అతన్ని ఘటకేసర్ అబ్కారీ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అఖిల్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సుధాకర్, రవి, కిషన్‌రావు, సుధీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి డాన్ అంగూర్ బాయి అరెస్టు

- పది కేసుల్లో నిందితురాలు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ధూల్‌పేట్‌లో గంజాయి డాన్‌గా పిలువబడుతున్న అంగూర్ బాయ్‌ని కార్వాన్ ప్రాంతంలో ఎస్టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గంజాయి అమ్మకాల్లో రూ. కోట్లకు పడుగెత్తిన అంగూర్ బాయ్‌పై ధూల్‌పేట్‌లో 3, మంగల్‌హట్‌లో 4, ఆసిఫ్‌నగర్, గౌరారం ఎక్సైజ్, పోలీస్ స్టేషన్లలో పది కేసుల్లో ముద్దయిగా ఉంది. ఎక్సైజ్, పోలీసులు ఎన్నిమార్లు నిఘా పెట్టిన అంగూర్ బాయ్ తప్పించుకొని తిరుగుతోంది. ఇప్పటికే 13 కేసుల్లో నిందితురాలుగా జైలుకు వెళ్లి వచ్చింది. ఆమె కుటుంబానికి చెందిన 15 మందిపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. ధూల్‌పేట్‌లో గంజాయి హెూల్‌సేల్, రిటేల్ అమ్మకాల్లో ఆమె అరితేరారు. ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా అంగూర్ బాయ్‌ని అరెస్ట్ చేసిన ఎస్టీఎఫ్, ఎక్సైజ్ పోలీసులను అబ్కారి శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

రుణమాఫీ పూర్తి చేసే వరకూ పోరాడాలి

- తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-తల్లాడ

రుణమాఫీ పూర్తి చేసే వరకు పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ముందుగా సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం కార్యాలయంలోని యూడీసీ స్టాలిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల రుణమాఫీలో 50 శాతం కూడా జిల్లాలో రైతుల రుణాలు మాఫీ చేయలేదన్నారు. జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రక్రియ పూర్తనట్టుగా ప్రకటన చేయడం హాస్యాస్పదమన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ అనుసంధానంతో జరిగిన తప్పులు, ఇంటి పేర్లు, రైతుల పేర్లు, ఆధార్ కార్డులో ఉన్న పేరు సరిపోల్చలేదని టెక్నికల్ సమస్యల పేరుతో వేలాది మంది రైతుల రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. బ్యాంకులో రుణం పొందినప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం కలిగి, ప్రస్తుతం పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకూ రుణమాఫీ చేయలేదని తెలిపారు.

రైతు మరణించి ఉంటే అలాంటి వారికి కూడా రుణమాఫీ వర్తించలేదన్నారు. రుణమాఫీలో సమస్యలకు బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారుల తప్పిదంగా ప్రభుత్వం వారిపై మోపి సమస్య నుంచి తప్పుకోవాలని చూస్తుందని ఆరోపించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి ఇంటి బాట పట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, నాయకులు శీలం పకీరమ్మ, పులి వెంకట నరసయ్య, కళ్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, మొన్నేపల్లి అర్జున్‌రావు, పులి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

- జూబ్లీహిల్స్‌లో ఘనంగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ప్రపంచవ్యాప్తంగా చాలా పెద్దఎత్తున జరుపుకునే పండుగ క్రిస్మస్ అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్‌నగర్ డివిజన్‌లోని ఎస్పీఆర్ హిల్స్ జీహెచ్ఎంసీ గ్రౌండ్స్‌లో బుధవారం రాత్రి కార్పొరేటర్ సీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి.. వేడుకలు నిర్వహిస్తున్న సీఎస్ రెడ్డికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తరపున క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి రాగానే అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపు 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. ఈ ప్రభుత్వం మరిన్ని మంచి పనులు చేసే విధంగా మీ దీవెనలు ఉండాలని పాస్టర్లను కోరారు. ప్రతి చర్చిలో ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు అసాద్, సాయినాథ్ యాదవ్, పాస్టర్ ప్రవీణ్ కుమార్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర క్యాబినెట్‌లో మాదిగలకు చోటు కల్పించాలి

కళాకారులను గుర్తించడంలో తమకేమీ అభ్యంతరం లేదు

- కానీ, అందులో మహిళలకేదీ స్థానం ?
- తెలంగాణ అమరుల శిల్పాన్ని చెక్కిన యాదగిరికి ఎమ్మెల్సీ ఇవ్వాలి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ - బంజారా హిల్స్

రాష్ట్రంలో మంత్రివర్గంలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ సాక్షిగా ఈనెల 27న హైదరాబాద్ సచివాలయం దగ్గర ఉన్న అంబేద్కర్ భారీ విగ్రహం వద్ద వర్గీకరణను వ్యతిరేకిస్తున్న వారి సావు డప్పును మోగిస్తామన్నారు. వేయి గొంతుకలు, లక్ష డప్పులతో ధూం ధాం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా వివక్షను ఎదుర్కొంటున్న మాదిగ జాతికి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాట్లాడే పెద్ద దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు పదవులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుటుంబ పాలన ఉంటుందని, ఆ పార్టీ ఎప్పుడూ మాదిగ జాతికి ఆపన్న హస్తం ఇవ్వలేదు.. ఇవ్వదని ఆరోపించారు. అగ్రవర్ణ కులాల్లో ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చి.. రాష్ట్రంలో జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మాదిగలకు ఎందుకు చోటివ్వలేదని ప్రశ్నించారు.

కళాకారులను గుర్తించి వారి సేవలను కొనియాడి కోటి రూపాయలు, 300 గజాలు ఇవ్వడంలో తమకేమీ అభ్యంతరం లేదన్నారు. అయితే, తెలంగాణ ఉద్యమంలో పాత్ర పోషించిన మాదిగలు ఎందరో ఉన్నారని.. తెలంగాణ అమరుల శిల్పాన్ని చెక్కిన యాదగిరి ఇంకా బయటే ఉన్నారని చెప్పారు. ఆ శిల్పాన్ని మొక్కిన వారందరూ పదవులు చేపట్టి చట్టసభల్లో ఉంటే ఆయనకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని కోరారు. గద్దర్‌తోపాటు ప్రతి ఒక్కరినీ గుర్తించినందుకు స్వాగతిస్తూనే "ధూం ధాం" అంటే తెలంగాణ అనే రసమయి బాలకిషన్ ఎందుకు గుర్తు రాలేదు? రసమయి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అనుకుంటే గోరటి వెంకన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కాదా? రసమయి మాదిగ సామాజిక తరగతి అవ్వడం వల్లే పక్కన పెట్టారా? అని ప్రశ్నించారు. తొమ్మిది మందిలో ఒక్క మహిళ కూడా లేకపోవడం శోచనీయమన్నారు. వీరనారి ఐలమ్మ, టిఎస్.సదా లక్ష్మి, విమలక్క, ప్రతాప్ కిషోర్, కేశవ్ రావు జాదవ్, ముత్యాల సత్యనారాయణ, గిద్దె రాములు, ఎందరో దళితులు, బీసీలు, బహుజనులు ఉన్నారని వారి పేర్లను త్వరలోనే ప్రకటించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పోరాటయోధుల రూపంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలి

తెలంగాణ తల్లి విగ్రహం పోరాటయోధుల రూపంలో ఉండాలని మందకృష్ణ అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం తనలాగే ఉంటుందని గతంలో కల్వకుంట్ల కవిత చెప్పుకున్నారని, అది ఇష్టం లేని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుత తెలంగాణ తల్లి విగ్రహం వారి అమ్మలా ఉందని చెప్పుకోవడం దురదృష్టకరం అని అన్నారు. ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్టు వారు మార్చుకుంటూ పోవడం అధికార దుర్వినియోగమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాగాయకులు ఏపూరి సోమన్న, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎస్‌వై.అశోక్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ, కళాకారులు గిద్దె రాంనరసయ్య, నలిగంటి శరత్ చమర్, రామంచ భరత్, మల్లేపాక అనిల్, గజ్జల అశోక్, డప్పు రమేష్, డప్పు రామస్వామి, మహాజన సురేష్, డప్పు స్వామి, కేశపాక రామచందర్ మాదిగ, బచ్చలకూర స్వామి మాదిగ, రామ్ చందర్ మాదిగ, పరమేష్ మాదిగ పాల్గొన్నారు.



లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారుల కోసమే

రద్దు కోసం కార్మిక వర్గం పోరాడాలి
సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్

సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా "లేబర్ కోడ్‌లు-కార్మిక వర్గ కర్తవ్యం"పై సెమినార్

నవతెలంగాణ-పటాన్ చెరు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారుల కోసమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ అన్నారు. జనవరిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను పురస్కరించుకొని గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని ఐలాభవన్‌లో "లేబర్ కోడ్‌లు- కార్మిక వర్గ కర్తవ్యం" అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం వెనుక కార్పొరేట్లు, పెట్టుబడిదారుల లాభాలు దాగున్నాయని, వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల వల్ల భవిష్యత్తులో కార్మికులు తమ హక్కులను కోల్పోతారని, పరిశ్రమలను ఎప్పుడైనా మూసుకోవచ్చని, కార్మికులను ఇష్టానుసారంగా తొలగించవచ్చని, కార్మిక హక్కులపై ఎటువంటి పర్యవేక్షణ చేసే అధికారులు, సిబ్బంది ఉండరని తెలిపారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాలు కూడా వర్తించవని విమర్శించారు. వీటివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రోజుకు రూ.174 ఉండాలని మోడీ ప్రతిపాదించారని, దీంతో కుటుంబ జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్మికులకు నష్టాన్ని చేకూర్చే లేబర్ కోడ్‌లను తిప్పికొడితేనే భవిష్యత్తు అని, దానికోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ పోరాటం స్ఫూర్తితో కార్మికులూ లేబర్ కోడ్‌లపై ఉద్యమించాలని తెలిపారు. అనంతరం సీపీఐ(ఎం) మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, సీపీఐ(ఎం) నాయకులు పాండురంగారెడ్డి మాట్లాడారు. ఈ సెమినార్‌లో సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వరరావు, శాంత కుమార్, అనంత రావు, వాజిద్ అలీ, సంతోష్ కుమార్ గౌడ్, శ్రీకాంత్, మనోహర్, మురళి, శేషగిరి, శ్రీధర్, తిరుపతి, హరినాథ్, సురేష్, రామకృష్ణ, రాఘవేంద్ర, మల్లేష్, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

టెట్ షెడ్యూల్ విడుదల చేయాలి

డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) రాతపరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటి నుంచి 20 వరకు టెట్ పరీక్షలను నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో విద్యాశాఖ ప్రకటించిందని తెలిపారు. అందుకు తగ్గట్టుగా పేపర్-1, పేపర్-2 రాతపరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. అభ్యర్థులకు పూర్తిగా సన్నద్ధం కావడానికి వీలవుతుందని పేర్కొన్నారు. టెట్ పరీక్షల నిర్వహణ సమయంలో ఇతర పరీక్షలు ఉంటే ఆ తేదీలను మినహాయించి షెడ్యూల్‌ను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేరళ, తమిళనాడు పరస్పర సహకారం

కేరళ సీఎం పినరయి విజయన్

తమిళనాడు, కేరళ రాష్ట్రాలు సహకార సమాఖ్య విధానానికి నిజమైన ఉదాహరణగా నిలుస్తున్నాయని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. వైకోమ్ బీచ్‌లో గురువారం జరిగిన తంతై పెరియార్ మెమోరియల్, పెరియార్ లైబ్రరీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విజయన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకారం అనేది మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కొనసాగుతోందని అన్నారు. ఆర్థిక స్వయంప్రతిపత్తితో సహా రాష్ట్రాల హక్కులపై నిరంతరం ఆక్రమణలు జరుగుతున్న ఈ దశలో మిగతా రాష్ట్రాల మధ్య కూడా ఇలాంటి సహకారం విస్తరించాలని విజయన్ అన్నారు. వైకోమ్ సత్యాగ్రహంలో సరిహద్దులు దాటి సహజీవనం, సహకారాన్ని చూశాం. కేరళ, తమిళనాడులు ఆ సహజీవనాన్ని, సహకారాన్ని కొనసాగిస్తున్నాయని అన్నారు.



వైకోమ్ : వ్యక్తుల ఆత్మగౌరవం కోసం పెరియార్ నిలబడితే, రాష్ట్రాలు.. వారి ఆత్మగౌరవం కోసం నిలబడాలని కాలం కోరుతోంది. కాలం కోరుకునే విధంగా కేరళ, తమిళనాడులు పరస్పర సహకారాన్ని ముందుకు తీసుకుపోతాయనడంలో సందేహం లేదు అని ఆయన అన్నారు. పెరియార్ స్మారక పునరుద్ధరణలో కూడా అదే స్ఫూర్తి ప్రస్ఫుటంగా కనిపిస్తుందని, రానున్న కాలంలో రెండు రాష్ట్రాలు మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు.

పెరియార్ అలియాస్ ఈవి రామస్వామి నాయక్కర్ భారతదేశమంతటా సంఘ సంస్కర్తలలో ముందంజలో ఉన్నారు. శ్రీ నారాయణుడిని కేరళీయులందరూ గురువుగా పిలుచుకున్నట్టే, ఈవీఆర్‌ని తమిళులందరూ గౌరవంగా పెరియార్ అని పిలుస్తారు. వైకోమ్ మహాదేవ దేవాలయం చుట్టుపక్కల ఉన్న మార్గాల్లో నడవడానికి అవార్ల హక్కు కోసం జరిగిన సత్యాగ్రహంలో పెరియార్ కీలకపాత్ర పోషించారు. పెరియార్, ఇతర నాయకులు ఉద్యమ స్ఫూర్తిని నిరాకరించడాన్ని మలయాళీలకే కాదు, దేశ ప్రజల సమస్యగా భావించారు. ఏప్రిల్ 13, 1924న పెరియార్ వైకోమ్ సత్యాగ్రహానికి నాయకత్వం వహించారు. దాంతో వైకోంలో జనసముద్రం పోటెత్తింది. ట్రావెన్‌కోర్ పరిపాలన సూచనల మేరకు అతన్ని అరెస్టు చేసి ఆరుకుట్టి జైలులో ఉంచారు. విషయం తెలిసిన వెంటనే భార్య నాగమ్మ వైకోంకు వచ్చింది. మహిళల భాగస్వామ్యంతో సత్యాగ్రహం ప్రాముఖ్యతపై పెద్దఎత్తున ప్రచారం చేశారు. స్త్రీల వివాహ వయస్సును పెంచడం, భర్తను ఎంపిక చేసుకునేందుకు, విడాకులు తీసుకోవడానికి అనుమతించడం వంటివి పెరియార్ జోక్యంతో సాధించిన చారిత్రాత్మక విజయాలు. పెరియార్ యొక్క అన్ని నిశ్చితార్థాలలో నాగమ్మ సమానంగా పాల్గొనేవారు. ఆరుకుట్టి జైలు నుంచి విడుదలైన పెరియార్ మళ్లీ సత్యాగ్రహంలో చురుకుగా పాల్గొనడంతో ప్రభుత్వం ఆయనను బహిష్కరించింది. పెరియార్ ట్రావెన్‌కోర్ పాలకుల ఆజ్ఞను ఉల్లంఘించడంతో ఆయనను మళ్లీ జైలులో పెట్టారు. ఆ తర్వాత రాజు వర్ధంతి సందర్భంగా పెరియార్ ఇతర సత్యాగ్రహులు విడుదలయ్యారు. ఈ విధంగా వైకోమ్ సత్యాగ్రహానికి పెరియార్ నిస్వార్థ నాయకత్వాన్ని అందించారని విజయన్ వివరించారు.

పెరియార్ లైబ్రరీ జాతికి అంకితం

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎం. స్టాలిన్ వైకోమ్ తంతై పెరియార్ మెమోరియల్. పెరియార్ లైబ్రరీని జాతికి అంకితం చేశారు. ఇరు రాష్ట్రాల మంత్రులతో సహా నాయకులు, సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైకోమ్ అవార్డు గ్రహీత కన్నడ రచయిత దేవనూర మహాదేవన్ ను తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సత్కరించారు. ముఖ్య అతిథిగా ద్రవిడ కజక అధ్యక్షుడు కె.వీరమణి హాజర య్యారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల మంత్రులు, నాయకులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా, వైకోమ్ సత్యాగ్రహ నాయకుడు తంతై పెరియార్ జ్ఞాపకార్థం తమిళనాడు ప్రభుత్వం వైకోంలోని తంతై పెరియార్ మెమోరియల్ లైబ్రరీని స్థాపించింది. వైకోమ్ సత్యాగ్రహ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా, గత ఏడాది వైకోమ్‌లో పర్యటించిన తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, వైకోమ్ నగరంలోని తంతై పెరియార్ మెమోరియల్, లైబ్రరీ పునరుద్ధ రణకు రూ.8.14 కోట్లు మంజూరు చేశారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం.. మనుధర్మాన్ని వ్యతిరేకిద్దాం

ఆహార భద్రత కల్పన నుంచి తప్పించుకోజూస్తున్న కేంద్రం

- కేరళ వామపక్ష ప్రభుత్వానికి అండగా నిలుద్దాం: అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



రాజ్యాంగాన్ని రక్షించుకుందాం..మనుధర్మాన్ని వ్యతిరేకిద్దామంటూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన జరుగుతున్న రాష్ట్ర కమిటీ సమావేశాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాజ్యాంగం అమలుల్లోకొచ్చి 75 ఏండ్లు నిండిన సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడుకుందాం మనుధర్మాన్ని వ్యతిరేకిద్దాం నినాదంతో దేశవ్యాప్తంగా దళిత, గిరిజన వాడల్లో విస్తృతంగా సదస్సులు సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి అధికారంలోకొచ్చిన తర్వాత ఆహార భద్రత చట్టాన్ని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేసే చర్యలను వేగవంతం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధార్ కార్డు లింక్ పేరుతో ఉపాధి జాబ్ కార్డులను ఏడు లక్షలు, తెల్ల రేషన్ కార్డులు ఐదు లక్షల 80 వేలు తొలగించారని చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లు, సామాజిక న్యాయం అమలకు ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రయివేట్ రంగంలోని ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్, షీస్ వర్కర్స్ వంటి రిక్రూట్ మెంట్‌లో రిజర్వేషన్లు అమలకు సిద్ధపడటం లేదని చెప్పారు. ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తున్న వామపక్ష కేరళ ప్రభుత్వానికి ఆర్థిక సహకారాన్ని నిరాకరించడం ద్వారా దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఇది రాష్ట్రాల ఫెడరల్ హక్కులను హరించడమేనన్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వ రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం అండగా నిలబడడానికి దేశవ్యాప్తంగా సంఘీభావ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పని పద్మ, పొన్నం వెంకటేశ్వరరావు, అల్వాల వీరన్న, ములకలపల్లి రాములు, జగన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు పెద్ది వెంకట్రాములు, రాళ్ల బండి శశిధర్, ఎం. ఆంజనేయులు, గోపాల్ సమ్మయ్య, సాంబశివ, లంక రాఘవులు, రమేష్ పాల్గొన్నారు.

29న కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణం

- జనవరి 19 నుంచి మార్చి 23 వరకు మల్లన్న జాతర
- ఆలయ అభివృద్ధి పనులు, ఏర్పాట్లపై మంత్రి కొండా సురేఖ సమీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణాన్ని ఈ నెల 29 వైభవంగా నిర్వహించాలని అధికారులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. జనవరి 19 నుంచి మార్చి 23 వరకు(పదివారాలు) జాతర నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి కల్యాణానికి ఆహ్వానిస్తామని తెలిపారు. గురువారం సచివాలయం నుంచి దేవాదాయ, సిద్ధిపేట అధికారులతో కొమురవెల్లి మల్లన్న దేవాలయ అభివృద్ధి పనులు, కల్యాణం, జాతరలకు జరుగుతున్న ఏర్పాట్లపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రూ. 46 కోట్ల ఎస్డీఎఫ్, దేవాదాయ శాఖ నిధులతో జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, సిద్ధిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, సిద్ధిపేట పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, సిద్ధిపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) అబ్దుల్ హమీద్, ఆర్డీఓ, కొమురవెల్లి ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయాలని పోలీస్, విద్యుత్, వైద్యారోగ్యం, ఆర్టీసీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులను మంత్రి సురేఖ ఆదేశించారు. దేవాలయ అభివృద్ధి పనులు, అమ్మవార్లు బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలకు కిరీటాల తయారీ పనులపై ఆరా తీశారు. దేవాలయంలో రోజువారీగా వాడే పూలను తదనంతరం పడేయకుండా అగర్ బత్తీలు తయారుచేసే సాంకేతికతను వాడుకుని దేవాలయ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. చలువ పందిళ్లు, నడిచే మార్గాల్లో మ్యాట్లు, వృద్ధులు, వికలాంగులు, గర్భిణులకు బ్యాటరీ వాహనాలు తదితర ఏర్పాట్లు



చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధించాలని ఆదేశించారు. ప్రసాదం తయారీలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలన్నారు. జాతర సమయంలో ఒగ్గుకథ, ఇతర జానపద కళారూపాలను ప్రదర్శించేలా సాంస్కృతిక శాఖకు ఆదేశాలివ్వాలని కలెక్టర్‌కు సూచించారు

కనీస వేతనాల సలహా మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కనీస వేతనాల సలహా మండలిలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అందులో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీకే ప్రాతినిధ్యం కల్పించడాన్ని తప్పుబట్టింది. గురువారం ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక సంఘాల తరఫున ఐదుగురు, యాజమాన్యాల తరుపున ఐదుగురు, ఇద్దరు స్వతంత్రులతో కార్మిక శాఖ కమిటీ వేసిందనీ, ఆ బోర్డులో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పించడం సరిగాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో కనీస వేతనాల సవరణ కోసం సీఐటీయూ పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడు దఫాలుగా వేసిన సలహామండలిలో సీఐటీయూ ప్రాతి నిధ్యం ఉండేదని తెలిపారు. కనీస వేతనాల సమస్య పట్ల గత ప్రభుత్వమైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా యాజ మాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శిం చారు. అందులో భాగంగానే కనీస వేతనాల సలహా మండ లిలో సీఐటీయూకి ప్రాతినిధ్యం లేకుండా చేసిందని పేర్కొ న్నారు. కార్మికుల సమస్యలపై నికరంగా పోరాడుతున్న వారిని ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం శోచనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పున:పరిశీలించి అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు.

అవినీతి చెద

దిగజారుతున్న భారత్ పరిస్థితి | పొరుగు దేశాల కంటే దారుణం

గత సంవత్సరపు అవినీతి సూచికలో మన దేశం ఏకంగా 17 స్థానాలు కోల్పోయింది. దేశాన్ని, రాష్ట్రాలను పాలించిన ప్రతి పార్టీ తాను అవినీతిని చాలా వరకూ నిర్మూలించానని గొప్పలు చెప్పుకుంటుంది. అయితే అవినీతి సూచికలో భారత్ ర్యాంక్ భారీగా పతనమవడాన్ని గమనిస్తే అనేక ప్రశ్నలు ఉదయిస్తాయి. అవినీతికి వ్యతిరేకంగా దేశంలో 2012లో ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు అదే ప్రధానాంశంగా నిలిచింది. పరిపాలనలో పెచ్చరిల్లిన అవినీతి జాడ్యంపై చర్చోపచర్చలు సాగాయి. మరి గడచిన పుష్కర కాలంలో దేశంలో అవినీతి తగ్గిపోయిందా అంటే లేదనే చెప్పాల్సి ఉంటుంది. పొరుగు దేశాలైన చైనా, భూటాన్, సింగపూర్, మలేసియా ఈ సమస్యను ఎదుర్కోవడంలో మంచి విజయాలు సాధిస్తే మనం ఎందుకు విఫలమవుతున్నాము?

అరికట్టడంలో వైఫల్యం



అన్ని శాఖలూ అవినీతిమయమే

భారత్‌లో అవినీతిపై గత సంవత్సరం టీఐ సంస్థ ఓ అధ్యయనం నిర్వహించింది. ఇందుగలడందు లేదన్నట్లు దాదాపు అన్ని ప్రభుత్వ శాఖలు...పోలీస్, రెవెన్యూ,దిగువ స్థాయిలోని న్యాయ వ్యవస్థ, విద్య, ఇంజినీరింగ్... ఇలా అన్ని శాఖలూ అవినీతి నిలయాలుగా మారాయని టీఐ స్పష్టం చేసింది. దేశంలో ఆర్థిక వ్యవస్థ విస్తరించ బడుతుంటే జాతీయ రహదారులు, విద్యుత్ ప్లాంట్లు, విమానాశ్రయాల ఆధునీకరణ, కొత్త ఓడరేవులు, భారీ గృహనిర్మాణ పథకాలు, పట్టణీకరణ ప్రాజెక్టులు...ఇలా అనేక మౌలిక సదుపాయాలు చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఈ ప్రాజెక్టులలో భారీగా అవినీతి చోటుచేసుకుంటోంది.

వైఫల్యానికి కారణమేమిటి?

అవినీతిని అరికట్టడంలో భారత్ ఎందుకు విఫలమవుతోంది? ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ పార్టీలు కోట్లాది రూపాయలు ఖర్చు పెడతాయి. రాజకీయ పార్టీలకు ప్రైవేటు రంగం విరాళాలు అందిస్తుంది. ఇక్కడే క్విడ్ ప్రోకో మొదలవుతుంది. తమకు భారీగా విరాళాలు ముట్టజెప్పే కంపెనీలు, సంస్థలకు పాలకులు వివిధ కాంట్రాక్టులు కట్టబెడుతుంటారు. సెంటర్ ఆఫ్ మీడియా స్టడీస్ అంచనా ప్రకారం 2019 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీలు కలిసి రూ.50,000 కోట్లు ఖర్చు చేశాయి. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఈ వ్యయం లక్ష కోట్లకు చేరిందని అంచనా. ఇదంతా రాజకీయ నాయకులు సంపాదించిన అవినీతి సొమ్మే. సామాన్యులు తమ అవసరాల కోసం అధికారులు, ప్రభుత్వ సిబ్బందికి లంచాలు, చిన్న చిన్న బహుమతులు సమర్పించుకోవడం సర్వసాధారణమై పోయింది. ఈ జాబితాలో ఏసీలు, మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్ వినియోగ వస్తువులు ఉంటున్నాయి. బడా బాబులు కాంట్రాక్టులు పొందేందుకు అధికార గణానికి భారీగానే సొమ్ము ముట్టజెబుతుంటారు. అందుకే అధికారుల దృష్టంతా కాంట్రాక్టులు, ప్రాజెక్టుల పైనే ఉంటుంది. పెద్ద ఎత్తున లంచాలు అందుకునే అవకాశం వాటిలోనే ఉంటుంది మరి. పైగా పట్టుబడే అవకాశాలు పెద్దగా ఉండవు. అభివృద్ధికి ప్రైవేటు పెట్టుబడులు అవసరమే. అయితే ఈ తరహా పెట్టుబడులు అవినీతిని ప్రోత్సహిస్తాయి. ఈ పరిణామాలన్నీ అవినీతిని పెంచి పోషిస్తున్నాయి.

ఏ దేశ చరిత్ర చూసినా...

న్యూఢిల్లీ : సంపన్న దేశాలతో పాటు వర్ధమాన దేశాలు కూడా అవినీతి సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నాయి. అమెరికాలోని పలు రైల్‌రోడ్డు ప్రాజెక్టుల్లో అవినీతి చోటుచేసుకుంది. నిషిద్ధ కాలంలో అమెరికా పోలీసు వ్యవస్థకు అవినీతి చెద పట్టింది. 1970వ దశకంలో హాంగ్‌కాంగ్‌లో 'టీ మనీ' ముడుపుల వ్యవస్థ ఉండేది. సొమ్ము ముట్టజెబితేనే ప్రాథమిక సేవలు అందుబాటులోకి వచ్చేవి. టెలిఫోన్లను ఒక చోటు నుండి మరో చోటికి మార్చడంతో మొదలుకొని అగ్నిప్రమాదం జరిగినప్పుడు సిబ్బంది రావడం వరకూ... ప్రతి సేవకూ అధికారులకు ఆమ్యామ్యాలు సమర్పించాల్సిందే. ఇక జపాన్‌లో లాక్‌హెడ్ విమాన కాంట్రాక్టులు పొందేందుకు భారీగా డబ్బు ముట్టజెప్పారు. ఈ కుంభకోణం అప్పటి ప్రధాని కాకీ తనాకా అరెస్టుకు దారితీసింది. ఆయన నాలుగు సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. జర్మనీ రక్షణ మంత్రి పైన, నెదర్లాండ్స్ రాకుమారుడి పైన వచ్చిన అవినీతి ఆరోపణలు వారి రాజకీయ జీవితాన్ని బాగా దెబ్బతీశాయి. అప్పటి నుండి చాలా దేశాలు రక్షణ చర్యలు చేపట్టి తమ సమాజాలకు అవినీతి చీడ అంటకుండా జాగ్రత్త పడ్డాయి.

దిగజారుడే

వివిధ దేశాల్లో అవినీతి ఏ మేరకు ఉన్నదనే విషయాన్ని గుర్తించేందుకు ప్రామాణికమైన పద్ధతి అంటూ ఏదీ లేదు. అయితే ప్రపంచంలో ప్రధానంగా రెండు సంస్థలు అవినీతిపై సమాచారాన్ని ప్రచురిస్తున్నాయి. అవే ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ (టీఐ), ప్రపంచబ్యాంక్. ప్రపంచబ్యాంక్ తన పరిపాలనా సూచికలో భాగంగా అవినీతి సమాచారాన్ని అందిస్తోంది. 2023లో అవినీతి సూచికలో భారత్ స్థానం 93 (మొత్తం దేశాలు 180). 2018లో ఈ ర్యాంక్ 85గా ఉండేది. 2016లో మన దేశం 79వ ర్యాంకులో ఉంది. అంటే ప్రతి సంవత్సరం అవినీతిలో భారత్ ర్యాంక్ దిగజారుతోందే తప్ప మెరుగుపడుతోంది లేదు. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమిటంటే గత కొన్ని సంవత్సరాల కాలంలో దేశంలో అవినీతి పెరగడమో లేదా ఇతర దేశాలు తమ పరిస్థితిని మెరుగుపరచుకోవడమో జరిగింది.

ఫలితమివ్వని ఉద్యమం

అవినీతిని అదుపు చేయడంలో వైఫల్యం చెందడం మరో కోణం నుండి కూడా ఆందోళన కలిగిస్తోంది. 2012-13లో అవినీతిపై పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ప్రజా బాహుళ్యం కలిగిన శక్తివంతులైన నేతలు అందులో భాగస్వాములయ్యారు. రాజకీయాలలో సమూల మార్పులు చేపట్టాల్సిన అవసరాన్ని ప్రజలకు నొక్కి చెప్పారు. అవినీతి కేసుల విచారణ కోసం లోకాయుక్తతో పాటు లోక్‌పాల్ తరహా వ్యవస్థ ఉండాలన్న చర్చ జరిగింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కర్నాటకలో మినహా మరెక్కడా లోకాయుక్త లేదు.



కాటేస్తున్న వాయు కాలుష్యం

ఏటా 15 లక్షల మంది బలి

న్యూఢిల్లీ : వాయు కాలుష్యం... ప్రజానీకాన్ని ఊపిరాడకుండా ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఏటా లక్షలాది మంది ప్రాణాలను హరిస్తోంది. మరెంత మందినో ఆస్పత్రుల పాలు చేస్తోంది. 2009-2019 మధ్య కాలంలో ఏటా పదిహేను లక్షల మందిని వాయు కాలుష్యం కాటేసిందని లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ జరిపిన అధ్యయనం తెలిపింది. హర్యానాలోని అశోకా యూనివర్సిటీ, న్యూఢిల్లీలోని సెంటర్ ఫర్ క్రానిక్ డిసీజ్ కంట్రోల్ పరిశోధకులు ఈ అధ్యయనంలో భాగస్వాములయ్యారు. దేశంలోని మొత్తం 140 కోట్ల జనాభా అత్యంత ప్రమాదకరమైన పీఎం2.5 కాలుష్య స్థాయి కలిగిన ప్రాంతాలలోనే నివసిస్తున్నారని వారు స్పష్టం చేశారు. ఈ స్థాయిలో ఉన్న గాలిని పీలిస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. గుండె జబ్బులు, ఆస్థమా, తక్కువ బరువుతో జన్మించడం వంటి ఇబ్బందులు కలుగుతాయి. కంటిచూపు కూడా దెబ్బతినవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన కాలుష్య స్థాయి కంటే ఇది అధికం.

దేశ జనాభాలో సుమారు 82 శాతం మంది వార్షిక సగటు పీఎం2.5 స్థాయిలు కలిగిన ప్రాంతాలలోనే నివసిస్తున్నారని, ఇది ఇండియన్ నేషనల్ యాంబియంట్ ఎయిర్ క్వాలిటీ స్టాండర్డ్స్ (క్యూబిక్ మీటరుకు 40 మైక్రాన్లు) చేసిన సిఫార్సు కంటే ఎక్కువని పరిశోధక బృందం తెలిపింది. క్యూబిక్ మీటరుకు పది మైక్రాన్ల పీఎం2.5 కాలుష్యంలో వార్షిక పెరుగుదల ఉన్నట్లయితే ఏటా మృత్యువాత పడే వారి సంఖ్య 8.6 శాతం పెరుగుతుందని కూడా పరిశోధకులు చెప్పారు.

కాలుష్యం కారణంగా దీర్ఘకాల ఇబ్బందులు తప్పవు : పరిశోధక బృందం

వాయు కాలుష్యం కారణంగా దీర్ఘ కాల ఇబ్బందులు తప్పవని, దేశంలో సంభవిస్తున్న మరణాలు భయాందోళనలు కలిగిస్తున్నాయని పరిశోధక బృందం తెలిపింది. దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రజలు పీఎం2.5 కాలుష్యానికి గురవుతున్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో అత్యల్ప వార్షిక స్థాయి (2019లో క్యూబిక్ మీటరుకు 11.2 మైక్రాన్లు), అత్యధిక వార్షిక స్థాయి (2016లో ఉత్తం ప్రదేశ్‌లోని ఘజియా బాద్‌లోనూ, రాజధాని న్యూఢిల్లీలోనూ క్యూబిక్ మీటరుకు 119 మైక్రాన్లు) నమోదైందని పరిశోధకులు వివరించారు.

సంపాదకీయం

సిరియాలో అనిశ్చితి!



డిసెంబరు ఎనిమిదో తేదీన అధ్యక్షుడు అసాద్ పదవి నుంచి తప్పుకొని రష్యాలో ఆశ్రయం పొందటం, టర్కీ మద్దతు ఉన్న హయత్ తహ్రిర్ అల్ షామ్(హెచ్‌టిఎస్) సాయుధ బృందం అధికారాన్ని చేపట్టడంతో దశాబ్దాలుగా అంతర్యుద్ధంలో ఉన్న సిరియాలో మరో అధ్యాయం మొదలైంది. ఇప్పటికే చీలిపోయిన విస్తరిలా తలా ఒక ప్రాంతాన్ని అదుపులో ఉంచుకున్న శక్తుల పాత్ర ఏమిటో స్పష్టంగాక ముందే ఇజ్రాయిల్ మరోసారి దాడులకు తెగబడింది. అక్కడ అసలేం జరుగుతోందో వివరాలు బయటి ప్రపంచానికి తెలియటం లేదు. రకరకాల వ్యాఖ్యానాలు, వార్తలు వెలువడుతూ గందరగోళంలోకి నెడుతు న్నాయి. పొంతన లేని ఈ సమాచారంలో ఏది నిజమో, ఏది కాదో వెంటనే నిర్ధారించటం కష్టం. కొత్తగా ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వాన్ని నాలుగు రోజులు గడిచిన తరువాత కూడా ఏ దేశమూ గుర్తించ లేదు. పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యంలో భాగమైన సిరియాతో సరిహద్దులు కలిగి ఉన్న టర్కీ, ఆర్మీనియా, ఇరాన్, ఇరాక్, సిరియాలలో కర్దులు అనే తెగ నివసించే ప్రాంతాలతో కలిపి మధ్యలో కర్దిస్తాన్ ఏర్పాటు చేయాలన్నది అమెరికా దీర్ఘకాలిక ఎత్తుగడ. దాన్ని కేంద్రంగా చేసుకొని ఆ ప్రాంతం మీద పూర్తి అదుపు కలిగి ఉండాలని చూస్తున్నది. కర్దుల ప్రాంతాలలో కొన్ని న్యాయమైన సమస్యలున్న మాట నిజం. వాటికి స్వయంపాలిత ప్రాంతాల ఏర్పాటుతో సహా ఆయా దేశాల పరిధిలో పరిష్కారం చూడాలన్నది ఒక అభిప్రాయం. ఎట్టి పరిస్థితుల్లో ప్రత్యేక దేశ ఏర్పాటు కాకూడదని ఆయా దేశాలు, ఏది ఏమైనా తమకు ఒక మాతృభూమి ఉండాలని కర్దులు దశాబ్దాల తరబడి సాయుధ పోరాటం చేస్తున్నారు, అణచివేతకు గురవుతున్నారు.

> సిరియాలో తన పథకాన్ని అమలుచేసేందుకు కర్దులతో పాటు ఐఎస్, అల్‌ఖైదా వంటి తీవ్రవాద సంస్థలను అమెరికా ప్రోత్సహిస్తున్నది, వందల కోట్ల డాలర్లు, ఆయుధాలను కుమ్మరిస్తున్నది. ఆక్రమంలోనే సిరియాలో చమురు, గ్యాస్ నిల్వలు, పంటలు పండే ప్రాంతాలను ఫ్రీ సిరియన్ ఆర్మీ సాయుధుల పేరుతో అమెరికా ఆక్రమించటమే గాక అక్కడ మిలిటరీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన హెటిఎస్ సాయుధులు టర్కీ మద్దతుతో ఎప్పటి నుంచో కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్నారు.

సిరియాలో తన పథకాన్ని అమలుచేసేందుకు కర్దులతో పాటు ఐఎస్, ఆల్‌ఖైదా వంటి తీవ్రవాద సంస్థలను అమెరికా ప్రోత్సహిస్తున్నది, వందల కోట్ల డాలర్లు, ఆయుధాలను కుమ్మరిస్తున్నది. ఆక్రమంలోనే సిరియాలో చమురు, గ్యాస్ నిల్వలు, పంటలు పండే ప్రాంతాలను ఫ్రీ సిరియన్ ఆర్మీ సాయుధుల పేరుతో అమెరికా ఆక్రమించటమే గాక అక్కడ మిలిటరీ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసింది. తాజాగా అధికారంలోకి వచ్చిన హెటిఎస్ సాయుధులు టర్కీ మద్దతుతో ఎప్పటి నుంచో కొన్ని ప్రాంతాలను ఆక్రమించుకున్నారు. మరోవైపు గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. ఇటీవలి వరకు అధికారంలో ఉన్న అసద్ ప్రభుత్వ మిలిటరీ, మద్దతు ఇచ్చే సాయుధ బృందాల ఆధీనంలో రాజధాని డెమాస్కస్, తదితర ప్రాంతాలు ఉన్నాయి. అసద్‌కు రష్యా, ఇరాన్ దేశాలతో పాటు హిజబుల్లా సాయుధ సంస్థ మద్దతు ఉన్న సంగతి తెలిసిందే. హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించింది, దాని నేత జొలానీని గతంలో అరెస్టు చేసి జైల్లో పెట్టింది. అతను గతంలో ఆల్‌ఖైదాలో ఉన్నమాట ఎంత నిజమో తరువాత దానితో విబేధించింది కూడా అంతే నిజం. అనేక ఛాందసవాద బృందాలను అంతమొందించినట్లు కూడా చెబుతారు. అమెరికా మద్దతు ఉన్న కర్దు తిరుగుబాటుదార్లు, ఐఎస్ తీవ్రవాదులను టర్కీ వ్యతిరేకిస్తున్నది. సిరియాలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన తప్ప ఇంకా అది కుదురుకోలేదు. ఇప్పటి వరకు అసద్ ప్రభుత్వాన్ని కూలదోయాలనే ఏకైక అజెండాతో పని చేసిన సంస్థలు ఇప్పుడు అధికారం కోసం కుమ్ములాడు కుంటాయా? పాలన సజావుగా సాగేందుకు అవకాశమిస్తాయా అన్నది మిలియన్ డాలర్ ప్రశ్న. లిబియాలో తమను వ్యతిరేకించిన గడాఫీ సర్కార్‌ను కూలదోసేందుకు నాటో కూటమి అనేక సంస్థలను ప్రోత్సహించింది. ఇప్పుడవి తమలో తాము కుమ్ములాడు కుంటున్నాయి. సిరియాలో కూడా అదే జరుగుతుందా ?

అసద్ రాజీనామా చేసి ప్రవాసం వెళ్లటం వెనుక ఒక అవగాహన ఉందంటూ కొందరు చెబుతున్నారు. ఆ కారణంగానే మిలిటరీ ఎలాంటి ప్రతిఘటన లేకుండా రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకొనేందుకు వీలు కల్పించిందని అంటున్నారు. తాము మద్దతిస్తున్న సాయుధ సంస్థలకు సిరియాను స్వాధీనం చేసుకొనే సత్తాలేనందున అమెరికా కూడా చూసీచూడనట్లు ఉందనేది మరొక అభిప్రాయం. అయితే అదే వాస్తవమైతే తాజాగా సిరియా మీద వందలాది వైమానిక దాడులు జరుపుతున్న ఇజ్రాయిల్ చర్య వెనుక అమెరికా హస్తం లేకుండా ఉంటుందా? సిరియాలో విజయం సాధించింది టర్కీ అని, రానున్న రోజుల్లో దాని పలుకుబడి అక్కడ కొనసాగుతుందంటు న్నారు. ఈ పరిణామాన్ని అమెరికా అంగీకరిస్తుందా ? టర్కీతో రష్యాకు కొన్ని సమస్యలున్నప్పటికీ అమెరికా ఆంక్షలను ధిక్కరించి ఎస్ 400 క్షిపణి రక్షణ వ్యవస్థలను టర్కీ కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు సిరియా ద్వారా హిజబుల్లా మిలిటెంట్లకు ఇరాన్ అందిస్తున్న ఆయుధసాయం కొనసాగుతుందా? వీటన్నింటినీ చూసినపుడు రానున్న రోజుల్లో సిరియాలో ఏం జరగనుందన్నది పెద్ద ప్రశ్న.


సీఎం గారూ.. ఆ ఉద్యోగుల్ని ఆదుకోండి...

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో గత పదిహేనేండ్లుగా సుమారు ఇరవైవేల మంది వివిధ హోదాల్లో పని చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబాన్ని కూడా పోషించుకోలేక పస్తులుంటున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనమివ్వాలని ఎన్ని వినతిపత్రాలిచ్చినా గత సర్కార్ పట్టించుకోలేదు. అప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న పీసీసీ అధ్యక్షుడు, రేవంత్‌రెడ్డి 'మేం అధికారంలో వచ్చాక మీ సమస్యలు పరిష్కరిస్తాం' అని హామీనిచ్చారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయింది. కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు నిర్వహించుకుంటున్నది. కానీ ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగుల బతుకుల్లో మాత్రం వెలుగులు నింపడం లేదు. అందుకే వారు ఆవేదనతో మళ్లీ పోరుబాట పట్టారు. క్లస్టర్ రిసోర్స్, యం.ఐ.యస్ కో ఆర్డినేటర్‌లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఐ.ఈ.ఆర్. పిలు, జిల్లా స్థాయిలో ఏ.పి.ఓలు సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, డి.ఎల్.ఎం.టి మెసెంజర్లు, పాఠశాల స్థాయిలో ఆర్ట్, క్రాఫ్ట్, వర్క్ ఎడ్యుకేషన్ పార్టు టైం ఇన్‌స్ట్రక్టర్, కేజీబీవీ యు.ఆర్.ఎస్‌లలో స్పెషల్ ఆఫీసర్, సి.ఆర్.టి లు, స్కావెంజర్స్ మెసెంజర్‌లు ఎంతోకాలంగా ప్రభుత్వానికి వారి హోదాలతో నిమిత్తం లేకుండా అన్ని పనులు చేసుకుంటూ వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు సీఆర్పీలను స్కూల్ అసిస్టెంట్లకు సమానమైన విద్యార్హతతో నియమించారు. డిగ్రీ , బిఈడి, బిటెక్, పూర్తిచేసిన వారు సీఆర్పీలుగా విధుల్లో వున్నారు. వీరికి నెలకు వేతనం రూ.19,350 మాత్రమే. అదే విధంగా కేజీబీవీ, యంఆర్సీలో టీచింగ్, నాన్ టీచింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు ఎంఐఎస్ సమన్వయకర్తలు ఐఆర్పీలు, ఎంఆర్పీ మెసెంజర్లకు తదితరులు కూడా పనిచేస్తున్నారు. వీరిలో యం.ఐ.యస్ కో ఆర్డినేటర్‌ది సూపరింటెండెంట్ హోదాతో సమానం. వీరంతా తక్కువ వేతనాలతో ప్రభుత్వానికి ఎక్కువ సేవలంది స్తున్నారు. వీరు కూడా తమను క్రమబద్ధీకరిం చాలని ఎంతోకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యా శాఖ నిర్వహించే పనులతో పాటు ప్రభుత్వం నిర్వహించే ఇతర కార్యక్రమాలకు కూడా వీరు సేవలందిస్తున్నారు. కొంత మందిని స్పెషలాఫీసర్లుగా నియమించారు. వీరు టీచర్లకు మండల విద్యా వనరుల కేంద్రానికి, జిల్లా విద్యాధికారి కార్యాలయానికి సమాచారం చేరవేస్తారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఆధీనంలో వీరు పని చేస్తున్నారు.

అన్ని జిల్లాల్లో వీరు క్లస్టర్ పరిధిలోని విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని నమోదు చేసి అధికారులకు నివేదికలు అందజేయడం, ప్రతిరోజు ఒక పాఠశాలను సందర్శించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉపాధ్యాయుల విద్యార్థులు హాజరుతో పాటు మధ్యాహ్న భోజన వివరాలను పరిశీలించడం ప్రధానంగా చేస్తారు. అలాగే బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించడం, పాఠశాల నుంచి విద్యార్థుల వివరాలను సేకరించి యుడైస్ ప్లస్‌లో నమోదు చేయడం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా నిర్వహించే కార్యక్రమాలు పాఠశాలల్లో అమలయ్యేలా చేయడం, ఏకోపాధ్యాయ పాఠశాలలో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే ఆ క్లస్టర్ పరిధిలోని సీఆర్పీ ఆ పాఠశాలను నడిపించడం, ప్రతినెలా పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం ఏర్పాటు చేసేలా చూడటం, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో వీరిది కీలకపాత్ర. కానీ వీరికి ఉద్యోగ భద్రత లేదు, సమాన పనికి సమాన వేతనమూ లేదు. ఉపాధ్యాయులకు కావలసిన అన్ని అర్హతలున్నా పట్టించుకోవడం లేదు. సీఎం గారూ..ఇప్పటికైనా వీరు ప్రభుత్వానికి అందిస్తున్న సేవలు, వీరి కుటుంబాల పరిస్థితిని చూసి ఇప్పటికైనా వీరికి ఉద్యోగ భద్రత కల్పించి, సమస్యలు పరిష్కరించేలా చూడాలని కోరుతున్నారు.

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

బ్రాహ్మణిజాన్ని తగ్గించిన బ్రిటీషు చట్టాలు



డాక్టర్ దేవరాజు మహారాజు

భారతదేశంలో ఒకనాటి సమాజ జీవనం ఎంత దుర్భరంగా ఉండేదో తెలుసుకుంటే వళ్లు గగుర్పొడుస్తుంది. నాటి సమాజంలో మార్పులు తీసుకురావడానికి అనాటి బ్రిటీషు ప్రభుత్వం చేసిన చట్టాలు ఎంతవరకు ఉపయోగ పడ్డాయి? భయంకరంగా వేళ్లూనుకుని ఉన్న మనువాద భావజాలాన్ని అవి ఎలా తగ్గించగలిగాయి? ఒకసారి అవలోకనం చేసుకోవడానికి నేనిక్కడ కొన్ని ముఖ్యమైన విషయాలు పొందుపరుస్తున్నాను - 'సతీ సహగమనం' అనే దురాచారాన్ని పాటించడం నాటి సమాజంలో తప్పనిసరిగా ఉండేది. భర్త చనిపోతే, భర్త చితిపై భార్యను తోసి సజీవంగా కాల్చేసేవారు. భార్య వయసులో ఎంత చిన్నదయినా పట్టించుకునేవారు కాదు. వయసు మళ్లిన పురుషులకు (ముసలి వాళ్లకు) చిన్నవయసు ఆడపిల్లల్ని ఇచ్చి పెండ్లి చేయడం వాడుకలో ఉండేది. ఆ వృద్ధుడు గనక చనిపోతే, భార్య అయినందువల్ల ఎంత చిన్న పిల్లయినా, యువతి అయినా సతీసహగమనం చేయాల్సిందే : మంటల్లో కాలుతున్న ఆడపిల్ల (భార్య) పెడబొబ్బలు పెడుతూ బయటికి రావడానికి ప్రయత్నిస్తే, పెద్ద పెద్ద కర్రలతో ఆమెను నిర్దాక్షిణ్యంగా మంటల్లోకి - కాలి బూడిదయ్యే దాకా మళ్లీ మళ్లీ తోసేసేవారు. దీన్ని సనాతన ధర్మంగా గొప్పగా చెప్పుకునేవారు మనుషులుగా సిగ్గుపడాలి కదా?

నాటి ఈ దురాచారాన్ని అడ్డుకోవడానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం సతీసహగమన నిషేధ చట్టం (1829) అమలు చేసింది. అలాగే హిందూ వివాహ వయసు చట్టం (1891) తెచ్చింది. వీటి వల్ల సతీ సహగమనం ఆగినా, బాల్యంలోనే బాలబాలికలకు వివాహాలు చేయడమనే దురాచారం కొనసాగుతూ వచ్చింది. కాబట్టి, ఒక వంద సంవత్సరాల తర్వాత, వారు మళ్లీ బాల్యవివాహాల చట్టం (1929) కూడా తేవాల్సి వచ్చింది. వాటి ఫలితంగా సమాజంలో చాలా వరకు మార్పు వచ్చింది. యుక్తవయసు వచ్చిన తర్వాతే వివాహాలు జరగడం ప్రారంభమైంది.

తొలి సంతానాన్ని గంగకు అర్పించే ఆచారం నాటి సమాజంలో ఉండేది. పసికూనల్ని గంగ (నీళ్లలో వేసి చంపడం అధర్మమవుతుందే తప్ప, ఎలా ధర్మమవుతుందీ? నీటి (గంగ)లో కొట్టుకుపోతున్న పసిపాపల్ని తెచ్చి పెంచుకోవడం హిందూపురాణాల్లో చూస్తుంటాం. భారతంలో కుంతీపుత్రుడు గంగపాలయిన వాడేకదా? ఈ దురా చారాన్ని రూపుమాపడానికి బ్రిటీషు ప్రభుత్వం-శిశు హత్యానిషేధ చట్టం(1804) తీసుకొచ్చింది. దీన్నే ఆడపిల్లను గంగలో పడేసే ఆచార నిషేధ చట్టం అని కూడా అన్నారు. సత్యస్థాపన కోసం క్రైస్తవ మత న్యాయస్థానాలు విధించిన శిక్షలు అనుభవించి ప్రాణత్యాగాలు చేసిన వైజ్ఞానికులు యూరోప్ దేశాలలో కొంతమంది ఉన్నారు. వాళ్లు వేళ్ల మీద లెక్కించగలిగిన కొద్దిమందే- అయినా, వారి త్యాగానికి అర్థం ఉంది. మరి ఇక్కడ? ఈ బ్రాహ్మణిజ ఆధిపత్యపు వికృతానందం కోసం ఏండ్లకేండ్లు లక్షల మంది మహిళలు సజీవంగా అగ్నికి ఆహుతై దగ్ధమయ్యారు. ఏ సత్యమూ ఇక్కడ ఆవిష్కరింపబడలేదు. పైగా ఆ మహిళల త్యాగానికి విలువ కూడా లేకుండాపోయింది.



> శూద్రులకు, విద్యాహక్కు, సంపద హక్కు వంటివి ఏవీ బ్రాహ్మణవాద ఆధిపత్య సమాజంలో ఉండేవి కావు. పారపాటున ఏ శూద్రుడైనా వేద పఠనం చదువుకోవటానికి ప్రయత్నిస్తే నాలుక కోసేవారు. చాటుగా ఏ శూద్రుడైనా వింటే అతని చెవిలో సీసం పోసేవారు. కష్టపడి శూద్రులు ధనార్జన చేసినా, వాటి మీద హక్కు బ్రాహ్మణుడికే ఉండేది. ఈ పద్ధతిని మార్చడానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం బానిస నిషేధ చట్టం తెచ్చింది (1813) శూద్రులకు వారి సంపద మీద వారికి హక్కునిస్తూ అస్తిహక్కు చట్టం (1875) తెచ్చింది. మనుధర్మ శాస్త్ర ప్రకారం - ఎస్సీ,ఎస్టీ, బీసీ రెడ్డి, వెలమ, కమ్మ, కాపు, మిగతా అన్ని కులాల వారు బ్రాహ్మణుడికి బానిసలే!

పెండ్లయిన ప్రతి శూద్రవధువు బ్రాహ్మణుడితో మొదటిమూడు రాత్రులు గడపాలనడం ఆనాడు బ్రాహ్మ ణిజం అమలుపరిచిన దుర్మార్గమైన ఆచారం. బ్రాహ్మణుల అహంకారం, ఆధిపత్యం ఇలా ప్రతివిషయంలోనూ కని పించేది. దీన్ని అడ్డుకోవడానికి నాటి బ్రిటీషు ప్రభుత్వం ఒక చట్టం తెచ్చింది. శూద్ర వధువు బ్రాహ్మణుడితో మొదటి మూడురాత్రులు గడిపే ఆచార నిషేధ చట్టం (1819)తో పరిస్థితులు మారుతూ వచ్చాయి. శూద్ర మహిళలు తమ ఆత్మగౌరవం నిలుపుకోగలిగారు. లైంగిక సంబంధాల్లో నీతి బలపడింది.

పెద్ద పెద్ద కట్టడాల పునాదుల్లో 'చరక పూజ' పేరుతో అక్కడ... ఒక శూద్రుడిని సజీవంగా కాల్చేయడం ఉండేది. అలా ఒక్కొక్కటిగా 1837- 1852 సంవత్సరాల మధ్య కాలంలో- అనేక సందర్భాల్లో జరిపే నర బలుల్ని బ్రిటీషు ప్రభుత్వం చట్టాలు చేసి అడ్డుకుంది. నరబలులు తగ్గాయి కానీ, జంతుబలులు కొనసాగుతూ వచ్చాయి. ఇప్పటికీ కొన్నిప్రాంతాల్లో, కొన్ని సందర్భాల్లో ఇవి కొనసాగుతూనే ఉన్నాయి. యజ్ఞం, యాగాల పేరుతో పశువుల్ని బలివ్వడమనేది పూర్వం సనాతన హిందూ ధర్మకర్తలు ప్రారంభించారు. దానికి 'బలి' అని ఒక గొప్పపేరు పెట్టుకున్నారు గానీ, జంతువుల్ని చంపుకు తినడమే అక్కడ జరిగింది. ఇంద్రుడు, వరుణుడు అంటూ లేని దేవుళ్ల పేరు చెప్పి, తిని మదిర తాగి తందనాలాడడమే యజ్ఞులు చేయడమంటే-పైగా ఆ యజ్ఞయాగాలతో రాజ్యంలో శాంతి స్థాపించబడుతుందనీ, వాతావరణం శుభ్రపడుతుందనీ, కోరుకున్న కోర్కెలు తీరతాయనీ, సమాజం ఉద్ధరించబడు తుందని సనాతనవాదులు అబద్ధాలు ప్రచారం చేశారు.

శూద్రులకు, విద్యాహక్కు, సంపద హక్కు వంటివి ఏవీ బ్రాహ్మణవాద ఆధిపత్య సమాజంలో ఉండేవి కావు. పారపాటున ఏ శూద్రుడైనా వేద పఠనం చదువుకోవటానికి ప్రయత్నిస్తే నాలుక కోసేవారు. చాటుగా ఏ శూద్రుడైనా వింటే అతని చెవిలో సీసం పోసేవారు. కష్టపడి శూద్రులు ధనార్జన చేసినా, వాటి మీద హక్కు బ్రాహ్మణుడికే ఉండేది. ఈ పద్ధతిని మార్చడానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం బానిస నిషేధ చట్టం తెచ్చింది (1813) శూద్రులకు వారి సంపద మీద వారికి హక్కునిస్తూ అస్తిహక్కు చట్టం (1875) తెచ్చింది. మనుధర్మ శాస్త్ర ప్రకారం - ఎస్సీ,ఎస్టీ, బీసీ రెడ్డి, వెలమ, కమ్మ, కాపు, మిగతా అన్ని కులాల వారు బ్రాహ్మణుడికి బానిసలే!

ఇకపోతే స్త్రీలందరూ శూద్రుల కిందే లెక్క! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య స్త్రీలకు మినహాయింపు ఏమీ లేదు. వారు కూడా శూద్రులే. శూద్రులకు విద్యాహక్కు, ఆస్తిహక్కు లేనట్లుగానే, స్త్రీలకు కూడా విద్యాహక్కు ఆస్తిహక్కూ లేదు. బ్రిటీషు వారి చట్టాలు అమలులోకి వచ్చిన తర్వాతనే, అన్ని వర్గాల్లోని మహిళలకు, శూద్రులకు, దళితులకు, ఆదివాసీలకు ఈ విషయాల్లో కొంత స్వేచ్ఛ లభించింది. సమాజంలో అతి కొద్ది శాతంగా ఉన్న పురుష బాహ్మణులకు మాత్రమే విద్యకు అర్హత ఉండేది. క్షత్రియ, వైశ్య వర్గాలు బ్రాహ్మణుల వద్దనే విద్యను అభ్యసించాల్సి వచ్చేది. ఆ విధంగా తమ ఆధిపత్యం కొనసాగించుకున్నారు. బ్రిటిషు ప్రభుత్వం హిందూ స్త్రీ ఆస్తి హక్కు చట్టం (1837) తెచ్చింది. దానితో స్త్రీలు-పురుషుడి ఆస్తిలో భాగం కాదు, ఆత్మగౌరవం గల వ్యక్తులుగా సమాజంలో భాగమని చెప్పినట్లయ్యింది. ఆంగ్ల విద్యా పద్ధతి చట్టం (1835) అందరికీ ప్రభుత్వ ఉద్యోగ చట్టం (1833) వంటివి రావడం (సమాజ స్వరూపం త్వరితగతిన మారుతూ వచ్చింది.

ఇక నేరాల విషయానికి వస్తే, చేసిన నేరాలు ఒకటే అయినా, మనుషుల కులాల్ని వర్గాల్ని బట్టి శిక్ష లుండేవి. మనుస్మృతి రాసుకుంది బ్రాహ్మణార్యులే కాబట్టి, వారికి వారు తీవ్రమైనా శిక్షలు రాసుకోలేరుకదా? అందువల్ల బ్రాహ్మణులకు శిక్షలుండేవి కావు. ఉన్నా అతి తేలికపాటి శిక్షలు మాత్రమే ఉండేవి. శూద్రులకు, దళితులకు, ఆదివాసీలకు కఠినమైన శిక్షలుండేవి. ఈ పరిస్థితి మార్చడానికి బ్రిటీషు ప్రభుత్వం సమాన శిక్ష చట్టం (1817) అమలు చేసింది. అప్పటి నుండి నేరస్థుల పట్ల వివక్ష లేకుండా ఒనే రకం నేరానికి - ఒకే రకం శిక్ష విధించడం జరుగుతూ వచ్చింది. అంతకు ముందు బ్రాహ్మణుడు ఏ తప్పు చేసినా ఏ శిక్షా ఉండేది కాదు. సమాన శిక్ష చట్టం - మనుషులంతా సమానులే అని చెప్పినట్లయ్యింది. నిమ్న కులాలతో సహా అందరికీ విద్యాహక్కు చట్టం (1813) రావడంతో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి.

బ్రాహ్మణారులు ప్రచారం చేసి, పాటించిన మరొక దురాచారం అస్పృశ్యత! దీనితో వారు మనుషుల్ని బాగా విభజించగలిగారు. మనుషుల ఆకారాలు ఒకటే. శరీర ధర్మరీత్యా మనుషుల లక్షణాలన్నీ ఒకటే. పుట్టుక చావూ ఒకటే బ్రాహ్మణులకు, బహుజనులకూ మధ్య తేడాలున్నట్లు- ఏ వైజ్ఞానిక శాస్త్రం చెప్పలేదు. అందరిదీ ఒకే జాతి- హోమోసేపియన్లనే చెప్పింది... ఈ కృత్రిమ విభజనను చెరిపేయడానికి బ్రిటీష్ ప్రభుత్వం - బానిస నిషేధ చట్టం (1813) తీసుకొచ్చింది. సమానశిక్ష చట్టం (1817) తీసుకొచ్చింది. ఆధిపత్యం కోసం బ్రాహ్మణవాదం చేసిన గిమిక్కును తిప్పికొట్టింది. ఎవరి ఇంట్లో ఏ కార్యక్రమం జరిగినా బ్రాహ్మణ పురోహితుడిని ఆహ్వానించి, అతనికి శక్తికి మించి దక్షిణలివ్వడం ఇష్టమున్నా లేకపోయినా పూజలో భాగంగా అతడి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడం- వగైరా ఇప్పటికీ జరుగుతోంది. అన్ని మూఢనమ్మకాల వలె ఇది ఒక మూఢనమ్మకమే-ఇలా చేయాలని ఎవరు ప్రచారం చేశారూ? తమ స్వలాభం కోసం, తమ అధిపత్యం కోసం బ్రాహ్మణులే విధివిధానాలు రూపొందించి, బల వంతంగా బహుజనులతో చేయిస్తున్నారు. దేవుడే ఒక అబద్ధమయితే.... ఆ అబద్ధాన్ని ఒక బూచిగా చూపిస్తూ పూట గడుపుకుంటున్నదెవరో ఆలోచిస్తే నిజం తెలుస్తుంది. బ్రాహ్మణిజపు ఉక్కు పిడికిలిలోంచి బయటపడినవారికే జీవితంలో ప్రశాంతత లభిస్తుంది. నేటి యువతరం ఆ పనిలోనే ఉన్నారు.

> మనమిక్కడ బ్రాహ్మణవాదానికి సంబంధించి చర్చిస్తున్నాం కాబట్టి - చెరువు నీళ్లు తాగినందుకు.. గర్భిణులు, బాలింతలు, వద్ధులు, పిల్లలు అని చూడకుండా నిర్దాక్షిణంగా కొట్టి చంపడం బ్రాహ్మణవాద దుశ్చర్యల్లో ఒకటిగా మనం గుర్తుపెట్టుకోవాలి. అస్పృశ్యులను ఊరి బయటకు తరిమి మూతికి ముంత, నడుముకు చీపురు కట్టించి, చెప్పులు చేత పట్టించి ఉట్టి కాళ్లతో నడిపించిన ఘనత బ్రాహ్మణవాదానిదే-ఈ బ్రాహ్మణవాద విధానాలు ఎవరో కూర్చుని రాసినవి కావు. తమ అధిపత్యం కొనసాగించుకోవడానికి వేలఏండ్లలో కొందరు కాలక్రమంలో చేర్చుతూ వచ్చారు. అన్నింటినీ కలిపి 'మనువు' అనేవాడు రాశాడనీ - దాన్నే 'మనుధర్మ శాస్త్ర'మని, 'మనుస్మృతి' అనీ ప్రచారం చేశారు.

అన్యమతస్థులకు ఆస్తిహక్కు చట్టం (1856) చేసిన నాటి బ్రిటీషు ప్రభుత్వం 1830-37 సంవత్సరాల మధ్యకాలంలో థగ్గులను అణచివేసే చట్టాలు కూడా చేసింది. మనమిక్కడ బ్రాహ్మణవాదానికి సంబంధించి చర్చిస్తున్నాం కాబట్టి - చెరువు నీళ్లు తాగినందుకు.. గర్భిణులు, బాలింతలు, వద్ధులు, పిల్లలు అని చూడకుండా నిర్దాక్షిణంగా కొట్టి చంపడం బ్రాహ్మణవాద దుశ్చర్యల్లో ఒకటిగా మనం గుర్తుపెట్టుకోవాలి. అస్పృశ్యులను ఊరి బయటకు తరిమి మూతికి ముంత, నడుముకు చీపురు కట్టించి, చెప్పులు చేత పట్టించి ఉట్టి కాళ్లతో నడిపించిన ఘనత బ్రాహ్మణవాదానిదే-ఈ బ్రాహ్మణవాద విధానాలు ఎవరో కూర్చుని రాసినవి కావు. తమ అధిపత్యం కొనసాగించుకోవడానికి వేలఏండ్లలో కొందరు కాలక్రమంలో చేర్చుతూ వచ్చారు. అన్నింటినీ కలిపి 'మనువు' అనేవాడు రాశాడనీ - దాన్నే 'మనుధర్మ శాస్త్ర'మని, 'మనుస్మృతి' అనీ ప్రచారం చేశారు.

ఇప్పుడు మనకున్న రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, దాని స్థానంలో ఈ మనుస్మృతిని నిలబెట్టాలని ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆరెస్సెస్- బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ పదేండ్లలో దేశాన్ని వేలఏండ్ల క్రితానికి తోసేసి, సమాజాన్ని వెనక్కి నడిపించే ఈ ప్రభుత్వ కుట్రని ఈ దేశప్రజలు ఛేదించాలి! ఎక్కడికక్కడ తిరస్కరిస్తూ ఉండాలి! హిందూమతమనే కాదు, అసలు ఏ మతంలోనూ ఎవరికి ఒరిగింది ఏమీలేదు. అందువల్ల మతాలను పక్కనపెట్టి, మానవీయ విలువలకు ప్రాధానమిచ్చే ప్రభుత్వాల్ని మనం ఏర్పాటు చేసుకోవాలి. కులాలు, మతాలు, ప్రాంతాల పేరుతో నీచమైన రాజకీయాలు చేసే మూర్ఖుల భరతం పడితే గాని, సమాజ ఆరోగ్యం బాగుపడదు!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

అసమాన ధైర్యశాలి, అడవితల్లి ముద్దుబిడ్డ... కామ్రేడ్ చంద్రరావు

ఇటీవలే కామ్రేడ్ భీష్మారావు 39వ వర్ధంతి జరిగింది. డిసెంబర్ 13 కామ్రేడ్ చంద్రరావు వర్ధంతి. 1985వ సంవత్సరంలో జరిగిన ఈ ఘటనలు ఎందుకో ఇప్పటికీ తడారని జ్ఞాపకాలుగానే ఉన్నాయి.



బి.హైమావతి
9490098023

అప్పుడు నా వయసు 30 సంవత్సరాలు. ఆ ఘటనలో వీరమరణం పొందిన నా జీవిత భాగస్వామి కామ్రేడ్ భీష్మారావు వయసు 36. నెల రోజుల తర్వాత జీడిగుప్ప అడవిలో ఆ ప్రాంతానికి వెళ్లి, దారపల్లి వాగు పక్కన, అమరుల రక్తంతో తడిచిన మట్టిని పట్టుకొని, భావోద్వేగంతో ప్రతిజ్ఞ చేసిన రోజు నాకు మరువలేని జ్ఞాపకం. ఈరోజు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా బాధ్యతల్లో ఉన్న నా ఉద్యమ ప్రస్థానం ఆనాడు చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో మొదలైందే.

భద్రాచలం డివిజన్‌లోని ఆదివాసీల పక్షాన నిలబడి ఎర్రజెండా నీడలో వెట్టిచాకిరి, మేకల పుల్లరి, కాంట్రాక్టర్ల దోపిడీ, అటవీ, పోలీసు, రెవెన్యూ అధికారుల దారుణమైన దోపిడీ, నిర్బంధాలు, దాష్టీకాలకు వ్యతిరేకంగా ఆనాడు జరిగిన పోరాటాలను చూస్తుంటే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు గుర్తుకొస్తాడు.

కామ్రేడ్ బిసిఆర్ 18 సంవత్సరాల వయస్సులో దేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటం చూసి ఉత్తేజితులై ప్రజా పోరాటాల్లో పాల్గొంటూ వచ్చారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన ప్రజలపై జరుగుతున్న దోపిడీ, అణచివేతలను చూసి చలించిపోయి ఈ ప్రజల కోసం పూర్తికాలం పనిచేయాలని అనుకున్నారు. ఆ రోజుల్లో కమ్యూనిస్టు పార్టీలో పని చేయటం అంటే కత్తి మీద సాములాంటిది. శత్రువుల దాడుల మధ్య పనిచేయవలసి వచ్చేది. వాగులు, వంకలు, సెలయేర్లతో నిండి ఉన్న భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఎటు వెళ్లాలన్నా కార్యకర్తలు కాలినడకన వెళ్లేవారు. ఒక జత బట్టలతో నాలుగు ఐదు రోజులు గ్రామాల్లోనే గడిపిన సందర్భాలున్నాయి. గ్రామాల్లో బియ్యం కూడా దొరికేవి కావు. కేవలం దుంపలు, అంబలి తాగి ఉండేవారు.

1975లో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించినపుడు కా॥ టివిఆర్ చంద్రం, కా॥ చంద్రరావు పదహారు నెలలపాటు అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు. ఎమర్జెన్సీ అనంతరం కా॥టివిఆర్ రాష్ట్ర కేంద్రం విజయవాడకు వెళ్లారు. ఎమర్జెన్సీ కాలం నుండే పార్టీ కార్యదర్శిగా బిసిఆర్ పనిచేశారు. ఇటువంటి కఠినతరమైన పరిస్థితుల్లో భద్రాచలం నియోజకవర్గంలో 1978 నాటికి బిఎస్ రామయ్య, యలమంచి సీతారామయ్య, మార్త శ్రీరామ్మూర్తి లాంటి అనేకమంది తన సహచరులతో కలిసి భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం గెలుచుకునేంత బలమైన పార్టీని నిర్మించారు.

ఈ పరిస్థితుల్లో భద్రాచలం డివిజన్ టింబర్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ స్థాపించి అధ్యక్ష కార్యదర్శులుగా బండారు చంద్రరావు, బత్తుల భీష్మారావు అనేక మిలిటెంట్ ఉద్యమాలను నడిపారు. ఫారెస్టు, పోలీసువారు భద్రాచలం పేపర్‌బోర్డు యాజ మాన్యం, కాంగ్రెస్‌వారు కలిసి అనేక కేసులలో ఇరికించేవారు. ఆయన నాయకత్వంలో అనేకమంది కార్యకర్తలు ఆకర్షితులయ్యారు. పార్టీలతో నిమిత్తం లేకుండా పేద ప్రజలు ఈ పోరాటాలలో పాల్గొన్నారు. గ్రామాలకు గ్రామాలు వేలాదిగా ప్రజలు పార్టీవైపు ఆకర్షితులయ్యారు. సీపీఐ(ఎం) పెద్ద పార్టీగా అవతరించింది. దీంతో కాంగ్రెస్ పార్టీ కక్ష కట్టి అనేకసార్లు హత్య ప్రయత్నాలకు పాల్పడింది, దాడులు చేసింది. అప్పటికే మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల అటవీ ప్రాంతంతో కలగలిసి ఉన్న ఈ ప్రాంతంలో పట్టు సాధించాలని చూస్తున్న పీపుల్స్‌వార్ గ్రూపు కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై మార్క్సిస్టు పార్టీని ఉమ్మడి శత్రువుగా చేసుకున్నాయి. దాడులలో ఒకరికొకరు సహకరించుకున్నాయి. 'మార్క్సిస్టు పార్టీని వదిలేసి ఇంకా ఏ పార్టీలోనైనా చేరండి.. లేకపోతే చంపుతాం' అని పీపుల్స్‌వార్ గ్రూప్ నక్సలైట్స్ 1980 నుండి బెదిరింపులు మొదలుపెట్టారు. అన్ని మండలాల్లో దాడులు చేశారు. బిసిఆర్‌ను చంపుతామని కబురు పెట్టడం,



బెదిరింపు లేఖలు రాయడం చేశారు. "మీరు మా ప్రాణాలు తీస్తే మా ప్రజలు మిమ్మల్ని తరిమికొడతారు" అని ప్రజా చైతన్యం పట్ల విశ్వాసంతో వారిని హెచ్చరికలను లెక్కజేయలేదు కామ్రేడ్ చందద్రావు. 1982లో చందద్రావు గారి సోదరుల కుటుంబాలపై గోళ్లగట్ట గ్రామంలో దాడి చేసి "మీ తమ్ముడిని అదుపులో పెట్టండి లేదా చంపుతామని" వారిని చేతులు విరగ్గొట్టి బెదిరించి వెళ్లారు. ఇలాగే కుంజా బొజ్జి, శ్యామల వెంకటరెడ్డి, యలమంచి సీతారా మయ్య, పులి రామయ్య, చింతూరు వెంకట్రావు, స్వరాజ్యేశ్వ రమ్మ, పాయం సీతమ్మ వంటి అనేకమంది నాయకులకు హెచ్చరికలు చేశారు.

చివరికి 1985 నవంబర్ 5న జీడిగుప్ప గ్రామంలో దారికాసి అప్పటికే నాలుగు రోజులుగా పర్యటనలో ఉన్న పార్టీ నాయకులను దట్టమైన అటవీ ప్రాంతం జీడిగుప్పలో జీపును అడ్డగించి కత్తులు, గొడ్డళ్లతో హతమార్చారు. బత్తుల భీష్మారావు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. బండారు చంద్రరావు చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి డిసెంబర్ 13న హైదరాబాదులోని హాస్పిటల్‌లో మరణించారు. ఎమ్మెల్యే కుంజా బొజ్జి కోలుకున్నారు. వారి మరణాలను చూసిన భద్రాచలం నియోజకవర్గం ప్రజలు పెద్ద ఎత్తున సమీకృతులై హత్యా రాజకీయాలను తిప్పికొట్టారు. విల్లంబులు ధరించి గ్రామాలను కాపాడుకున్నారు. కొన్నేండ్ల పాటు గ్రామాల్లోకి, ప్రజల మధ్యకి రాలేక నక్సల్స్ దాక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. 1988లో గిరిజన నాయకుడు పులి రామయ్యను దారుణంగా నరికి చంపారు. 1996లో శ్యామల వెంకటరెడ్డిగారిని హత్య చేశారు. భద్రాచలం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలను హత్యలు చేసినా పార్టీని లేకుండా చేయటం వాళ్ల తరం కాలేదు. కార్యకర్తలు, నాయకులతో పాటు చనిపోయిన కుటుంబాలకు చెందిన భార్య బిడ్డలు కూడా కదిలి ఈ ఉద్యమాన్ని కాపాడటానికి నడుం కట్టారు. అందుకే ప్రజలు వెనకడుగు వేయకుండా పార్టీ వెనక నిలబడ్డారు.

అనేక డజన్ల కొద్దీ స్థానిక సంఘాలను నిర్మించడం కామ్రేడ్ బీసీ ప్రత్యేకత. ప్రజా సంఘాలను స్వతంత్రంగా ప్రజాతంత్ర పద్ధతిలో నడిపించేవారు. అంగన్వాడీ సంఘం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలుత పురుడు పోసుకున్నది భద్రాచలంలోనే. పార్టీ శాఖలను సక్రమంగా నడపడంలోను, మారుమూల గ్రామాలకు కూడా ప్రజాశక్తి పత్రికను అందుబాటులో ఉంచేందుకు కృషి చేసింది. కార్యకర్తల కుటుంబాల సభ్యులతో అత్యంత ప్రేమపూర్వక సాన్నిహిత్య సంబంధాలు నాయకులకు ఉండేవి.

ఇలాంటి దాడులు, ఆందోళనకర పరిస్థితుల్లో కూడా ఎన్నికల రంగంలో పార్టీ విజయ పరంపర కొనసాగించింది. 1978-83లో ముర్ల ఎర్రయ్యరెడ్డి, 1985-89, 1994లలో మూడుసార్లు కా॥కుంజా బొజ్జి, ఆ తర్వాత సున్నం రాజయ్య మూడు సార్లు మొత్తం ఎనిమిది దఫాలుగా ఎన్నికయ్యారు. పోలవరం ముంపు పేరుతో భద్రాచలం నియోజకవర్గం రెండు ముక్కలయ్యేవరకూ పార్టీని ప్రజలు గెలిపించుకున్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా సాధించుకుంటున్న అభివృద్ధి వనరుల్ని ఎమ్మెల్యేల సహాయంతో మరింత ముందుకు తీసుకెళ్లారు. నియోజకవర్గంలో విద్యా, వైద్యం, తాగు నీరు, సాగునీరు, రహదారుల వంటి అనేక ప్రాథమిక సౌకర్యాల కోసం అహర్నిశలూ కృషిచేస్తూ గ్రామాలను ప్రగతిపథంలో నడిపించారు. అమరవీరుల మార్గదర్శకత్వంలో ఆదర్శ ప్రజాప్రతినిధులుగా సేవలందించారు. డా॥మిడియం బాబూరావు భద్రాచలం పార్లమెంటు సభ్యులుగా అటవీ హక్కుల చట్టం రూపకల్పనలో 14వ లోక్‌సభలో కీలకమైన పాత్ర పోషించారు.

నేడు కమ్యూనిస్టులుగా మనం గర్వించదగ్గ విజయాలు ఉన్నాయి. పార్టీ కృషితో ప్రజలకు అనేక ఉపశమనాలు సాధించాము. 2004లో 64 మంది లెఫ్ట్ పార్టీల ఎంపిల మద్దతుతో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం లెఫ్ట్ ఒత్తిడితో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, దేశవ్యాప్తంగా రైతుల రుణాల మాఫీ, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, మధ్యాహ్న భోజన పథకం లాంటి సౌకర్యాలకు నేడు బీజేపీ సర్కార్ నుండి ప్రమాదం ఏర్పడింది. ఈ హక్కులు కాపాడుకుంటూ బీజేపీ మతోన్మాదానికి వ్యతిరేకంగా, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు అంకితమై పనిచేయడమే మన నాయకులకు మనమర్పించే నివాళి.

ఆనాడు వాళ్ల హత్యకు గురైనపుడు.. నాతో సహా నాలాంటి యువతీ యువకులందరూ చేసిన ప్రతిజ్ఞ గుర్తు చేసి ముగిస్తాను.

"జీవన స్రవంతి, విప్లవం, ప్రగతి, ఏ దేశంలో కానీ.... ఏ కాలంలో కానీ... నాయకుల మరణాలతో ఆగిపోయేవి కావు. కార్యక్రమంలో వారి వారసులే సమాజాన్ని విప్లవపదంలో మునుముందుకు గొనిపోతారు. రగులుకున్న ఆ అగ్ని కణాల జీవన పోరాటమే సాక్షిగా మునుముందుకే సాగుతామని ప్రతిజ్ఞ చేస్తున్నాం"..

(నేడు కామ్రేడ్ బండారు చంద్రరావు 39వ వర్ధంతి)



ఉచిత ప్రయాణాల రద్దీకి తగ్గట్టుగా బస్సులు పెంచాలి

- ఐద్వా సత్తుపల్లి అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ
- ఆర్టీసీ డీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సత్తుపల్లి

మహిళలకు తెలంగాణ ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయడం సంతోషకరమైనప్పటికి తక్కువ సంఖ్యలో బస్సులు నడిపించడం కారణంగా మహిళలు ప్రయాణం చేయడానికి నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తుపల్లి పట్టణ అధ్యక్షురాలు పాకలపాటి ఝాన్సీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సుల్లో ప్రయాణం చేస్తున్న మహిళల సమస్యల పరిష్కారం కోరుతూ ఝాన్సీ ఆధ్వర్యంలో ఐద్వా నాయకురాళ్లు గురువారం సత్తుపల్లి డిపో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ ఉచితం ఇచ్చినట్లే ఇచ్చి మహిళలను అవమానపర్చేలా ఉచిత ప్రయాణ పథకం ఉందన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణాలకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచాలని ఆమె డిమాండ్ చేశారు. అసలే పండుగల సీజన్ కావడంతో ప్రయాణం చేయాలంటేనే మహిళలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఝాన్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు చావ కవిత, ప్రభావతి, సత్యవతి, కళావతి, సీత పాల్గొన్నారు.






డివిజన్ కమిటీలోకి ఐదుగురు

నవతెలంగాణ-కొణిజర్ల

ఈనెల 11వ తేదీన సింగరాయపాలెం గ్రామంలో జరిగిన సీపీఐ(ఎం) వైరా డివిజన్ మహాసభలో వైరా డివిజన్ కమిటీలోకి కొణిజర్ల మండలం నుంచి ఐదుగురుకి చోటుదక్కింది. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ (కొణిజర్ల), మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు (చిన్నమునగాల), దొడ్డపనేని క్రిష్ణార్జున్‌రావు (సింగరాయపాలెం), బోయినపల్లి శ్రీనివాస్‌రావు (చిన్నగోపతి), తాతా పద్మ(కాచారాం)లను డివిజన్ కమిటీ సభ్యులుగా మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహాసభ విజయవంతం...అందరికీ కృతజ్ఞతలు

మహాసభ విజయవంతమైందని పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి క్రిష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, డివిజన్ కమిటీ సభ్యులు దొడ్డపనేని క్రిష్ణార్జున్‌రావు, మండల కమిటీ సభ్యులు వడ్లమూడి నాగేశ్వరరావు, రోషన్ బేగ్, షేక్ అఫ్జల్, కంకణాల వెంకటిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభకు ఆర్థిక సహాయంతో పాటు పరోక్షంగా సహకరించి ఏర్పాట్లలో భాగస్వామ్యమైన నాయకులు, కార్యకర్తలకు సింగరాయపాలెం గ్రామ శాఖ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అఖిలపక్ష సమావేశం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో అ ఖిలపక్ష సమావేశాన్ని మండల అభివృద్ధి అధికారి సురేందర్ బుధవారం ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో గల ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ మండలంలో 31 గ్రామ పంచాయతీలకు గాను 284 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 31 గ్రామపంచాయతీల పరిధిలో 40,243 ఓట్ల తుది జాబితా ఖరారు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పైన ఓటర్ లిస్టుల పైన అఖిలపక్ష నాయకుల నుండి ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో అన్ని పార్టీలు ఆమోదించినట్లు తెలిపారు. సమావేశ అనంతరం ఎంపీవోగా బాధ్యతలు చేపట్టి ఐదు సంవత్సరాల పూర్తి చేసిన సందర్భంగా గంధం శ్రీలక్ష్మిని అఖిలపక్ష నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, నూతక్కి నరసింహారావు, మిరియాల నాగేశ్వరరావు, దేవరకొండ రవి, వేమ కొండలరావు, దేవరకొండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో నిలిచిన విద్యా బోధన

నవతెలంగాణ-ముదిగొండ

సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది సమ్మెతో మండలపరిధిలో న్యూలక్ష్మీపురం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యాబోధన నిలిచిపోయింది. దీంతో బాలికలకు కష్టాలు మొదలయ్యాయి. బాలికల విద్యాలయంలో మొత్తం 16 మంది టీచర్స్ ఉండగా ఒక టీచర్ తప్ప 15 మంది సమ్మె కొనసాగిస్తున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10 నుండి సమ్మె కొనసాగిస్తున్నారు. ఇంటర్ వరకు ఉన్న ఈవిద్యాలయంలో బాలికలకు విద్యాబోధన పదోతరగతి, ఇంటర్, ద్వితీయ సంవత్సరం వారికి ఈనెల వరకు సిలబస్ పూర్తి చేయాల్సి ఉంది.

ఆటో మోటార్ సంఘం ప్రథమ మహాసభలు జయప్రదం చేయండి

నవతెలంగాణ-కల్లూరు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం వెంటనే అమలు చేసి ఆటో మోటార్ వాహనాల కుటుంబాలను ఆదుకోవాలని టియుసిఐ జిల్లా నాయకులు కే పుల్లారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం జిల్లా ఆటో మోటార్ సంఘం ప్రథమ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ టియుసిఐ ఆధ్వర్యంలో కల్లూరు సెంటర్లో ఆటో, ట్రాలీ, జీపు, బస్సు, మినీ గూడ్స్ మొదలైన వాహనాల కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాలీ ఆటో సంఘం నాయకులు ఎస్.నరసింహరావు, ఎస్.వెంకటేశ్వర్లు, వేణు, ఆర్.వాసుదేవరావు, ఆటో సంఘం నాయకులు సురేష్, తిరుపతిరావు, రత్నం శివకృష్ణ, భూషణం తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం రుణమాఫీ నిజం కాదు

రైతు సంఘం సమావేశంలో బాగం హేమంతరావు

నవతెలంగాణ-ఖమ్మం

కార్పొరేట్లకు వత్తాసు పలుకుతున్న మోడీ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగం రోజు రోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మంజిల్లా సమితి సమావేశం గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి సంబంధించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న నూరుశాతం రుణమాఫీ జరగలేదన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న రైతు సంఘం ఆధ్వర్యంలో అన్ని మండల కార్యాలయాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, మందడపు రాణి, పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా వ్యక్తి దుర్మరణం

నవతెలంగాణ-ముదిగొండ

బాణాపురం గ్రామానికి చెందిన కొత్త కల్మషరావు (40) అనే ట్రాక్టర్ ఓనర్ తన ట్రాక్టర్ను నడుపుకుంటూ గ్రామ సమీపానున్న తన మిర్చితోట దగ్గరకు కూలీలను ఎక్కించుకొని రావడానికి గురువారం వెళుతూ చల్లసముద్రం చెరువుకట్ట దిగుతుండగా ట్రాక్టరు ప్రమాదవశాత్తు అదుపు తప్పి, ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడటంతో కల్మషరావు ట్రాక్టర్ టైరు కింద పడటంతో తలకు, శరీర భాగాలలో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు కల్మషరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అంకితభావంతో పనిచేద్దాం.. నాణ్యమైన ఉత్పత్తిని సాధిద్దాం

- కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీ నరసింహారావు
- ఓసీలో మల్టీ డిపార్టుమెంట్ టీం సమావేశం

నవతెలంగాణ-సత్తుపల్లి

అంకితభావంతో పనిచేస్తూ వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందిద్దామని కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ మునగంటి వేదాద్రి నరసింహారావు కోరారు. గురువారం కిష్టారం ఓసీ ఆవరణలో మల్టీ డిపార్టుమెంట్ టీం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీవో నరసింహారావు మాట్లాడారు. ప్రతి ఒక్కరి కృషిద్వారా సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అందుకుందామన్నారు. ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడం ద్వారా సంస్థను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్దామన్నారు. డీజీఎం (ఐఈడీ) యోహాన్ మాట్లాడుతూ మల్టీ డిపార్టుమెంట్ టీం సమావేశం ఉద్దేశం, ఉత్పత్తి, వ్యయం, ఉద్యోగుల సంక్షేమం తదితరాంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు దిశానిర్దేశాలతో మల్టీ డిపార్టుమెంట్ టీం సభ్యుల సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని కిష్టారం ఓసీ పీవో నరసింహారావు తెలిపారు. ఈ సమావేశంలో ఏజీఎం (ఫినాన్స్) కె.హనా సుమలత, డీజీఎం (పర్సనల్) శివ కేశవరావు, ఏరియా జనరల్ ఇంజినీరు సూర్యనారాయణ, ప్రాజెక్టు ఇంజినీరు రమణారావు, మేనేజర్ రామకృష్ణ, సేఫ్టీ ఆఫీసర్ గోపీ కిశోర్, సంక్షేమాధికారి విజయ్ సందీప్ పాల్గొన్నారు.

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానికే ఉంది

- మతం పేరిట అలజడులు సృష్టిస్తున్న బీజేపీ
- గిరిజనుల భూములు ఫార్మసిటికి కేటాయించకుండా అడ్డుకున్న ఘనత కమ్యూనిస్టులదే..!
- ఫార్మా కంపెనీలను జనావాసానికి దూరంగా ఉంచాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి.తమ్మినేని వీరభద్రం
- అట్టహాసంగా పాలేరు డివిజన్ మహాసభ
- పార్టీ డివిజన్ కార్యదర్శిగా బండి రమేష్ ఏకగ్రీవ ఎన్నిక



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ప్రపంచాన్ని మార్చే శక్తి కమ్యూనిజానికి మాత్రమే ఉందని సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని ఏదులాపురం గ్రామంలో పాలేరు డివిజన్ ఎనిమిదవ మహాసభను గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కోలాట బృందంతో, యువతీ యువకుల నృత్యాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు మామిండ్ల సంజీవరెడ్డి పార్టీ పతాకాన్ని ఎగరవేశారు. నండ్ర ప్రసాద్, దొండేటి సుగుణమ్మ కొమ్ము శ్రీను, యడవల్లి రమణారెడ్డి, రచ్చ నర్సింహారావు అధ్యక్ష వర్గంగా ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడుతూ...ప్రపంచంలో కమ్యూనిస్టులకు అనుకూల వాతావరణం ప్రారంభమైందన్నారు. శ్రీలంక, నేపాల్, ఫ్రాన్స్ దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడ్డాయని, భవిష్యత్‌లో మరిన్ని దేశాల్లో ఎర్రజెండా ప్రభుత్వాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సోవియట్ యూనియన్ కూలిపోయిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులకు ఎదురు దెబ్బలు తగిలాయని కానీ, గత కొన్ని సంవత్సరాలుగా మంచి రోజులు ప్రారంభమయ్యాయన్నారు. మంచిపై చెడు గెలిచేది తాత్కాలికమేనని, ఎప్పటికైనా మంచి గెలుస్తుందన్నారు. పెట్టుబడిదారులకు, దోపిడీదారులకు కమ్యూనిస్టులంటే భయమని, అందుకే కమ్యూనిస్టులపై నిత్యం విష ప్రచారం చేస్తూ బురద చల్లుతూ ప్రజల్ని మభ్యపెడుతూ ఉంటారని విమర్శించారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శించారు. కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో దేశంలో అలజడులు సృష్టిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. మోడీ అధికారం చేపట్టిన 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై జరిగిన దాడులు, హత్యలు, అత్యాచారాలను వివరించారు. లగచర్లలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు కాకుండా అడ్డుకున్నది కమ్యూనిస్టులేనని, మూడు వేల ఎకరాల గిరిజన భూములు ఫార్మసిటీకి కేటాయించకుండా అడ్డుకున్న ఘనత వామపక్షాలకే దక్కుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఐదు లక్షల ఎకరాల భూములకు పోడు పట్టాలు ఇవ్వటంలో ప్రధాన పాత్ర కమ్యూనిస్టులదేనని వివరించారు. మూసీ సుందరీకరణ పేరుతో 15 వేల గుడిసెలను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, వందల కొద్ది ఫార్మా కంపెనీల వ్యర్థాలతో మూసీ కలుషితమవుతుందని, ఫార్మా కంపెనీలను నగరం నుంచి ఎత్తివేసి జనావాసానికి దూరంగా ఉంచాలని డిమాండ్ చేశారు.

ప్రజా క్షేత్రంలో నిలదీస్తాం...:
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు



దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి 75 ఏళ్లలో అత్యధిక కాలం ఈ దేశాన్ని కాంగ్రెస్ పరిపాలించిందని, ఈ దేశ అభివృద్ధిని అడ్డుకోవడంలో కాంగ్రెస్‌ది ప్రధాన పాత్ర అని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. కానీ...కాంగ్రెస్ కన్నా పెను భూతమైన మతోన్మాద బిజెపిని ఓడించేందుకే కాంగ్రెస్‌తో జత కట్టామని, కాంగ్రెస్ తప్పులుంటే ఎత్తిచూపకుండా ఉండమని, ప్రజా క్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. మేనిఫెస్టోలో తెలిపిన విధంగా రైతు భరోసా, రుణమాఫీ, నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే ఎర్రజెండా రాజ్యం రావాలని తెలిపారు.

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



రేవంత్ రెడ్డి అమలు కానీ హామీలిచ్చి, అధికారం చేపట్టాడని, ఫ్రీ బస్ తప్ప ఒరిగిందేమీ లేదని, ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రెండు లక్షల లోపు రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రైతు భరోసాను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ దేశంలో పాలకులను,పెట్టుబడిదారులను, దోపిడీదారులను ఎదుర్కొనే శక్తి కేవలం సీపీఎంకు మాత్రమే ఉందన్నారు.

సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శిగా బండి రమేష్



అనంతరం 25 మందితో డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కార్యదర్శిగా బండి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... పాలేరు డివిజన్‌లో సీపీఎంకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఖమ్మం జిల్లాలోనే పాలేరుకు ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదని, అటువంటి నియోజకవర్గంలో అనేక సమస్యలు తాండవిస్తున్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి త్వరలో ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ మహాసభలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, భూక్య వీరభద్రం, బొంతు రాంబాబు, మాచర్ల భారతి, కల్యాణం వెంకటేశ్వరరావు, సీపీఎం సీనియర్ నాయకులు బత్తినేని వెంకటేశ్వరరావు, సిద్ధినేని కోటయ్య, జియావుద్దీన్, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉరడీ సుదర్శన్‌రెడ్డి, నండ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, బండారు రమేష్, కొమ్ము శ్రీను, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, గుడవర్తి నాగేశ్వరరావు, మడుపల్లి గోపాల్ రావు, వాసిరెడ్డి వరప్రసాద్, ఎస్.నవీన్ రెడ్డి, యడవల్లి రమణారెడ్డి, కె.వి.రెడ్డి, భట్టు పురుషోత్తం, భూక్య శ్రీను, మీరా, తోటకూరి రాజు, ముదాం శ్రీను, డి.లక్ష్మయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, తుడుం ప్రవీణ్, సీఐటీయూ నాయకురాలు రమ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వేముల సదానంద్, మండల నాయకులు పి.మోహన్‌రావు, నందిగామ కృష్ణ, పి.సంగయ్య, పెండ్యాల సుమతి, నాగుల్ మీరా, మద్దాల ప్రభాకర్, మందా సైదులు, చెరుకుమల్లి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.






భూ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



భూమాత చట్టాన్ని ఆమోదించి, ప్రజాపాలనలో వచ్చిన భూ దరఖాస్తులను విచారించి వాస్తవ సాగు దారులందరికీ పాసు పుస్తకాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఖమ్మంఅర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే లక్షలాది మంది ఏడాది కాలంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యాలయాలు, సివిల్ కోర్టుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని అన్నారు. కౌలుదారులకు హక్కులు కల్పించాలన్నారు. ప్రస్తుత శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నందున ఈ పథకాల్ని ఆమోదించేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్రానికి వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని, భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. పంటల విధానాన్ని రూపొందించి రాష్ట్రాన్ని దిగుమతుల నుండి రక్షించాలన్నారు. నకిలీ విత్తన వ్యాపారంపై ఉక్కుపాదం మోపుతామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. నకిలీ విత్తన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుందని, రైతులు నష్టపోతూనే ఉన్నారన్నారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పనతో పాటు చట్టాల్లో మార్పు చేయాలన్నారు. 65 ఏండ్లు దాటిన రైతులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలో అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబోయిన గోవిందరావు, కూచిపూడి మధు, కళ్యాణ వెంకటేశ్వరరావు, మీరా, పి.నాగేశ్వరరావు, కే.గౌస్మియా, తాటికొండ శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, ముదాం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులు ఇంటి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-రఘునాథపాలెం



ఖమ్మం రైల్వే మూడవ లైన్ క్రింద ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులు, వారికి కేటాయించిన ఇండ్ల స్థలాలలో ఇంటి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని, వారికి అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించుటకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైల్వే మూడవ లైన్ ఏర్పాటుతో భూములు కోల్పోయిన వారికి గురువారం మంత్రి, రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెంలో ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైల్వే 3వ లైన్ కింద పూర్తిగా ఇండ్లను కోల్పోయిన 58 మందికి వెంకటాయపాలెంలో 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, వీరికి పట్టాలతో పాటు ఇంటి విలువ పరిహారం కూడా అందించామని అన్నారు. నిర్వాసితులు ప్రభుత్వం అందించిన ఇంటి పట్టాలతో ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని, వీరికి అవసరమైన తాగునీటి సరఫరా, డ్రైనేజ్, విద్యుత్తు మొదలగు మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. అమరావతి వెళ్ళే జాతీయ రోడ్డు, సర్వీస్ రోడ్డు ఈ ప్రాంతంలో వస్తాయని, ఇక్కడ భూములకు మంచి ధరలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ కార్పొరేటర్లు తోట రాములు, కమర్తపు మురళీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మానుకొండ రాధా కిషోర్ పాల్గొన్నారు.



దరఖాస్తులన్నింటినీ శాస్త్రీయ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికిస్తాం

- రాష్ట్ర ఎస్సీ ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్

నవతెలంగాణ- ఖమ్మం

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై స్వీకరించిన దరఖాస్తులన్నింటిని క్రోడీకరించి దానిపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని రాష్ట్ర ఎస్సి ఏక సభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం నిమిత్తం ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్సి కులాలు, కుల సంఘాలు, వ్యక్తులతో బహిరంగ విచారణ నిర్వహించారు. పలువురు షెడ్యూల్ కులాల సంఘాలు, వ్యక్తులు షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై దరఖాస్తులను కమిషన్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రంగారెడ్డి, నల్గొండ తదితర జిల్లాలలో బహిరంగ విచారణ నిర్వహించడం జరిగిందని, జిల్లాల సందర్శన సందర్భంగా దరఖాస్తు సమర్పించలేకపోయిన వారు హైదరాబాద్‌లో నేరుగా కమిషన్‌కు వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చుని అన్నారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై నిర్వహించిన బహిరంగ విచారణలో 450 మంది వ్యక్తిగతంగా, కుల సంఘాల పరంగా దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ అదనపు డైరెక్టర్ శ్రీధర్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి సంక్షేమ అధికారులు కె. సత్యనారాయణ, అనసూయ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎస్సి కార్పొరేషన్ ఇడిలు నవీన్ బాబు, ఉపేందర్‌రావు, రాష్ట్ర కార్యాలయం సూపరింటిండెంట్ సజ్జన్ కుమార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నామ తక్షణ స్పందన

- యేరుగట్ల రైతుల కోసం జిల్లా కలెక్టర్‌కు లేఖ
- సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం యేరుగట్ల గ్రామ రైతుల ధాన్యం తక్షణం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు డిసెంబర్ 9న లేఖ రాశారు. ధాన్యం కొనుగోలుకు మూడు వారాలుగా రైతులు అధికారులను సంప్రదించినా.. ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని సూచించారు. గతంలో గ్రామంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రం ఉండగా ఈ సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో మరోచోట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం రైతులకు ఆర్థిక భారంగా మారిందని వివరించారు. రైతులందరి ధాన్యాన్ని తరలించడానికి రూ. 2 లక్షల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిచి పాడైపోయే అవకాశం ఉందని మాజీ ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలగకుండా యేరుగట్ల గ్రామంలోనే ధాన్యం నిల్వ ఉన్న ప్రదేశం వద్ద నుంచే కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. మాజీ ఎంపీ నామ రాసిన లేఖకు స్పందించిన జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి (రెవెన్యూ) రైతుల నుండి ధాన్యం కొనుగులు చేస్తామని హామీ ఇచ్చారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..

- చర్చలు జరిపి సమ్మె విరమింపజేయాలి..
- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. రెగ్యులరైజేషన్, ఉద్యోగభద్రత, కేర్ టేకర్ల నియామకం, తదితర సమస్యల పరిష్కారం కోసం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో రవి మాట్లాడారు. సంఘాలతో చర్చించి పోరాటాలను విరమింపజేయాలని కోరారు. కేజీబీవీ, యూఆర్ఎస్, ఎంఆర్సీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ సమ్మెలో ఉన్నారని చెప్పారు. తద్వారా బాలికల విద్య, ఎంఆర్సీ కార్యాలయంలో పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. సమ్మె పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ సంఘాలతో చర్చలు జరిపి డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల చెల్లింపు తదితర సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి..

ఈనెల 14,15 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే ఖమ్మం జిల్లా టీఎస్ యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పాటు యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని వివరించారు.

ఎన్నికల ముసాయిదా పోలింగ్‌పై సమావేశం



నవతెలంగాణ-బోనకల్

మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పచాయతీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా పోలింగ్ చేసిన ఏర్పాటుపై అఖిలపక్ష నాయకుల సమావేశాన్ని ఎంపీడీఓ రురావత్ రమాదేవి గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ బోనకల్ మండల వ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు ప్రారంభించినట్లు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు అందజేయవచ్చును అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రావినూతల గ్రామపంచాయతీ పరిధిలో బోనకల్ స్టేషన్ వార్డు ప్రజలు మూడు కిలోమీటర్ల దూరంలో గల రావినూతల ఉన్నత పాఠశాలకు వెళ్లి ఓట్లు వేయవలసి వస్తుందని, బోనకల్ స్టేషన్‌లోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో ఎంపీడీవో స్పందించి జిల్లా కలెక్టర్‌కు సమస్యను నివేదిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, సిపిఐ(ఎం) నాయకుడు మచ్చ గురవయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు, కాంగ్రెస్ నాయకుడు బుక్య బద్రు నాయక్, టిడిపి నాయకుడు మైనేని రవికుమార్, వైఎస్ఆర్సిపి నాయకుడు షేక్ మౌలాలి, మండల పరిషత్ కార్యాలయ యుడిసి శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను వేగవంతం చేయాలి

- తాహసీల్దార్ పులి సాంబశివుడు



నవతెలంగాణ-కల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహాల సర్వేను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని తహసిల్దార్ పులి సాంబశివుడు కోరారు. గురువారం కల్లూరు పట్టణాల్లో జరుగుతున్న ఇందిరమ్మ గృహాల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో నందిశెట్టి నాగేశ్వరరావును తాహసీల్దార్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న లబ్ధిదారులను యాప్‌లో పొందుపరిచిన లెక్క ప్రకారం 3755 మంది గృహాలు కావాలని ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అర్హులా కాదా అని సర్వేలో నిర్ధారించనున్నారు. ఇప్పటి వరకు 120 గృహాలు సర్వే పూర్తయిందని తహసీల్దార్‌కు ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని పోస్ట్ కార్డు ఉద్యమం



నవతెలంగాణ-తల్లాడ

తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని రుణమాఫీ కానీ రైతులు గురువారం పోస్ట్ కార్డు ఉద్యమం నిర్వహించారు. తహ సీల్దార్ కార్యాల యంలో వినతి పత్రం అందించిన అనంతరం ర్యాలీగా పోస్ట్ ఆఫీస్‌కు చేరుకొని, రైతులు రేవంత్‌రెడ్డి, సీఎంఓ కార్యాలయం హైదరాబాద్ అడ్రస్‌కు, తమ రుణం మాఫీ కాలేదని, తమకు రుణమాఫీ చేయాలని, ఖాతాలలో వెంటనే రుణమాఫీ నగదును జమ చేయాలని కోరుతూ పోస్ట్ బాక్స్‌లో పోస్ట్ కార్డులను వేశారు. పోస్ట్ కార్డుల ఉద్యమంతో రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ రైతుల ఖాతాలో జమ చేస్తుందని ఆశిస్తున్నామని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మాదినేని రమేష్, తాతా భాస్కరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వర రావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సాయినేని ప్రకాష్‌రావు, మన్నేపల్లి అర్జున్‌రావు, శీలం పకీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయిలో బయాలజి టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-మధిర

మధిర టివిఎం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశ్నాపత్రాన్ని మండల విద్యాశాఖాధికారి వై.ప్రభాకర్‌రావు ఆవిష్కరించారు. పర్యవేక్షకునిగా పోలె సుధాకర్ బాధ్యతను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో బయాలజి ఫోరం సభ్యులు జ్ఞానేశ్వరరావు, భట్టాచారి, శోభామాలిని, కృష్ణప్రియ, ఏసుపాదం, నాగేశ్వరరావు, ఆర్‌బి.శ్రీను పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌కు వినతి

నవతెలంగాణ-ఖమ్మం

సుప్రీం కోర్ట్ తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ బహిరంగ విచారణ ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ని బైండ్ల కులాన్ని సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయంగా వెనుకబడిన కులంగా గుర్తించాలని రాష్ట్ర కార్యదర్శి సోడెపొంగు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులు కందుకూరి మహేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషన్‌కు వారి సమస్యలను వివరించారు. ఏకసారుప్యత కలిగిన సమూహాలైన గ్రామదేవతల పూజారులు బైండ్ల, పంబాల, కొలుపుల, ద్యావతి, అసాదుల, పోతారాజులను ఎస్సీ-ఏ జాబితాలో చేర్చి 7 శాతం తగ్గకుండా రిజర్వేషన్ కల్పించాలని కమిషన్‌ని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కందుకూరి మహేష్, ప్రధానకార్యదర్శి చిన్నపొంగు ప్రభాకర్, ఉపాధ్యక్షులు అనిల్, మధు, కోశాధికారి బంగారు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు నవీన్, మహేష్, రమేష్, రామారావు చందు, వీరస్వామి, లక్ష్మీ నరసయ్య పాల్గొన్నారు.



పర్పుల్ డిఎన్ఏ సొసైటీ ఆధ్వర్యం తోపుడు బండి బహూకరణ

నవతెలంగాణ-వైరా

పర్పుల్ డిఎన్ఏ వ్యవస్థాపక అధ్యక్షులు చిత్తలూరు శ్రీనివాసరావు, డాక్టర్ నాగ సుధ సహకారంతో పర్పుల్ డిఎన్ఏ సొసైటీ కోఆర్డినేటర్ పెనుగొండ ఉపేంద్రరావు తాటిపూడిలో నివాసం ఉంటూ అనారోగ్యం చేత పనులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న ఇలారపు శారదకు కూరగాయలు అమ్ముకునే నిమిత్తం 10 వేల రూపాయలు విలువచేసే తోపుడు బండిని బహుకరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉపేందర్ రావు మాట్లాడుతూ తోపుడు బండి ద్వారా కూరగాయలు అమ్ముకుంటూ తమ జీవనోపాధికి కావాల్సిన సంపాదన సమకూర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మిట్టపల్లి భాస్కర్, చౌడవరపు బద్రి నారాయణ, మిత్రులు కట్ల సురేష్, శబరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-వేంసూరు

ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య గురువారం పరామర్శించారు. లింగపాలెంలో సీపీఐ(ఎం) నాయకులు కొత్త సత్యనారాయణ కుమారుడు వెంకటేశ్వరరావు అనారోగ్యంతో మృతి చెందారు. అదే గ్రామంలో సొసైటీ డైరెక్టర్ నున్న మల్లికార్జునరావు తండ్రి విజయరామారావు దశ దిశ కర్మలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబాన్ని ఓదార్చారు. రోడ్డు ప్రమాదానికి గురైన ఉడత లేని కృష్ణారావును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముందుగా మోరంపూడి భాస్కరరావు నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పగుట్ల వెంకటేశ్వరరావు, దొడ్డ వెంకట కృష్ణారెడ్డి, మారోజు సురేష్, ఎర్ర రమేష్ మందపాటి మహేశ్వర్‌రెడ్డి, రాంబాబు, కంటే వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఉగాది నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ఉగాది నాటికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నర్తకి థియేటర్ రోడ్డులోని డివిజన్ 32, 36 లో రైల్వే నిధులు 3 కోట్ల 3 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, కాలువలు, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణ పనులలో నాణ్యమైన సామాగ్రి వినియోగించాలని అన్నారు. డ్రెయిన్ లైన్ నేరుగా ఉండాలని, ఇక్కడ వేసే సిసి రోడ్లు పది కాలాల పాటు ఉండాలని మంత్రి ఆదేశించారు. పోల్ షిఫ్టింగ్, లైటింగ్ పూర్తయిన తరువాత సిసి రోడ్లు, డ్రెయిన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పనులను 3 నెలలో పూర్తి చేయడమే లక్ష్యంగా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని, ఉగాది నాటికి వచ్చి చూస్తే పనులు పూర్తయి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

- 14, 15న మహాసభలు సత్తుపల్లిలో నిర్వహణ
- రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ఆరో విద్యా మహాసభలను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో దుర్గ భవాని మాట్లాడారు. ఈనెల 14, 15 తేదీలలో సత్తుపల్లిలో జిల్లా ఆరో విద్యా మహాసభలు ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, స్థానిక శాసనసభ సభ్యులు మట్టా రాగమయి దయానంద్, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి.మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ.రవి, తదితరులు హాజరవుతారని వివరించారు. ఈ సందర్భంగా 'ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి-ఉపాధ్యాయుల కర్తవ్యాలు' అనే అంశంపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. 'ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు- ఉద్యమాలు' అనే అంశంపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రసంగిస్తారని అన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై మహాసభలు, సెమినార్ లను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి వెంకన్న, షమీ, జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు, జిల్లా కార్యదర్శులు షేక్ రంజాన్, బి రాందాస్, ఏ. సుధాకర్, వి వి రామారావు, పి.సురేష్, కె గీత, డి.నాగేశ్వరరావు, ఎం. నరసయ్య, షేక్ నాగుర్ వలి, ఉద్దండు షరీఫ్ తదితరులు ఉన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి, గర్భస్థ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం అమలుపై జిల్లా మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అబార్షన్లు ఎక్కడ జరుగుచున్నాయో చూసి, ఫిర్యాదులు నమోదు చేసుకొని అన్ని శాఖల సహకారంతో చర్యలు తీసుకోవాలని అన్నారు. నెలకొకసారి తనిఖీలకు తగిన ప్రణాళిక తయారు చేసి కార్యాచరణ చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు జరిపి, అబార్షన్ జరిపితే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ లీగల్ సెల్ కెవి.చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ లీగల్ సర్వీస్ సెల్ ద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ కళావతి బాయి, డిసి హెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ చందునాయక్, డాక్టర్. వెంకటరమణ, జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిపివో విష్ణువందన, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ నారాయణరావు, ఫోగ్సిసి డాక్టర్. రహేనా బేగం, డెమో సాంబశివరెడ్డి, జాగృతి ఎన్జిఓ కుముదిని తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలు

- పోలీస్ కమిషనర్ సునీల్ దత్



నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఈనెల 15 నుండి 16 వరకు జరిగే టిజిపిఎస్సీ గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ యాక్ట్-2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుండి 16 వరకు 85 పరీక్షా కేంద్రాలలో నిర్వహించే గ్రూప్-2 పరీక్షల సందర్భంగా ఈనెల 15 ఉదయం 6 గంటల నుంచి 16 సాయంత్రం 6 వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని, ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఇంటి పన్ను కడితేనే ఇందిరమ్మ సర్వే

నవతెలంగాణ-వేంసూరు

రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు లబ్ధిదారులను మొబైల్ యాప్ ద్వారా వివరాలు సేకరించి ప్రక్రియ నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ తరుణంలో వేంసూరు మండలంలో ఇంటి పన్ను కడితేనే సర్వే చేస్తామని లబ్ధిదారుల నుండి బలవంతంగా వసూళ్లుచేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు ఇంటి పన్ను వసూళ్లకు ఏంటి సంబంధం అని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఓ మాజీ ప్రజా ప్రతినిధి తమ ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారి ఆదేశాల మేరకే సర్వే పేరుతో ఇంటి పనులు వసూళ్లుచేస్తున్నారని ప్రచారం జరుగుతుంది. గత పది సంవత్సరాలుగా ఇల్లు లేక నానా ఇబ్బందులు పడుతున్న బీద ప్రజలను ఇదే అదునుగా చూసి ఇంటి పన్ను కడితేనే ఇందిరమ్మ ఇళ్లకు సర్వే జరుగుతుందని చెప్పటంతో కోటి ఆశలతో సొంత ఇంటి కల నెరవేరుతుందని ఆశతో అప్పు సప్పు చేసి ఇంటి పనులు కడుతున్నారు. జిల్లా అధికారులు గత రెండు రోజులుగా మండలంలో ఇంటి పన్నుల వసూలు చేసిన బిల్లు బుక్కులను పరిశీలించి విచారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీవో సిహెచ్.నాగేశ్వరావును వివరణ కోరగా ఇంటి పన్ను చెల్లిస్తేనే సర్వే చేస్తామని అనటం సరైనది కాదని వెంటనే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇస్తానని అన్నారు.

అమరావతి హైవే రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

- హైడ్రాలిక్ టిప్పర్లు తగిలి కూలిపోతున్న విద్యుత్ స్తంభాలు
- పంటలు దెబ్బ తింటున్నాయంటున్న అన్నదాతలు



నవతెలంగాణ-బోనకల్

అమరావతి హైవే రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఫలితంగా పంటలో దెబ్బతింటున్నాయని అన్నదాతలో లబోదిబోమంటున్నారు. హైవే రోడ్డుకు రాత్రి సమయంలో హైడ్రాలిక్ టిప్పర్ల ద్వారా మట్టి తోలకాలు చేస్తున్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపము నుంచి అమరావతి హైవే రోడ్డు వెళుతుంది. ఈ హైవే రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ గత కొన్ని రోజులుగా చేస్తున్నాడు. ఇందులో భాగంగా రోడ్డుకు మట్టి తోలకాలను రాత్రి సమయంలో తోలు తున్నారు. హైడ్రాలిక్ టిప్పర్లు మట్టిని అన్ లోడ్ చేసే సమయంలో పైకి లేపుతున్నారు. ఈ సమయంలో విద్యుత్తు వైర్లు ఉన్న విషయాన్ని గమనించకుండా య దేచ్ఛగా డ్రైవర్లు వ్యవహరిస్తుండటంతో విద్యుత్తు వైర్లకు తగిలి విద్యుత్ స్తంభాలు సైతం కూలిపోతున్నాయి. కూలిన విద్యుత్ స్తంభాలు మిర్చి తోటలలో పడిపోతుండటంతో మిర్చి పంటలు దెబ్బతింటున్నాయని అన్నదాతలు తెలుపుతున్నారు. బుధవారం రాత్రి మట్టి తోలకాలు చేస్తుండటంతో హైడ్రాలిక్ టిప్పర్లు తగిలి రెండు విద్యుత్తు స్తంభాలు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మడుపల్లి వెంకటకృష్ణ మిర్చి తోటలో ఇరిగి పడిపోయాయి. దీంతో మిర్చి పంట దెబ్బతిన్నదని వెంకటకృష్ణ తెలిపాడు. రాత్రి సమయంలో మట్టితోలకాలు చేస్తున్నారని, హైడ్రాలిక్ టిప్పర్ల డ్రైవర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు తెలిపారు. తమ పొలంలో ఇరిగి పడిపోయిన విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని విద్యుత్ అధికారులను కోరారు. పంట పొలాలు దెబ్బ తినకుండా అమరావతి హైవే కాంట్రాక్టర్ వ్యవహరించాలని రైతులు కోరారు.

రైతులకు అవగాహన కార్యక్రమం

నవతెలంగాణ-కూసుమంచి

వరి కొయ్యలను తగలబెట్టడం వల్ల కలిగే అనార్థలపై మండల వ్యవసాయ అధికారి ఆర్.వాణి రైతులకు అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో వరి కొయ్యలను తగలబెడుతున్న రైతులను కలిసి అవగాహన కల్పించారు. ఇప్పటి నుండి పంట కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చటం జరగదని రైతులు తెలియజేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-కామేపల్లి

మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15 16 తేదీల్లో జరిగే ధర్నాకు అనుమతి ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికులు ఎంఈఓ వెంకట్‌కు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిలో పోటీ పరీక్షలు కీలకం

- తహసీల్దార్ రాళ్ళబండి రాంబాబు



నవతెలంగాణ-మధిర

విద్యాభివృద్ధిలో పోటీ పరీక్షలు కీలకం అని తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు అన్నారు. గురువారం బయాలజీ ఫోరం ఆధ్వర్యంలో మధిర మండల స్థాయిలో టీవీఎం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదివే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో తహసీల్దార్, మండల విద్యాశాఖ అధికారి వై.ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచి పోటీ పరీక్షల పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పోటీ పరీక్షల విజేతలకు వారు బహుమతులు అందజేశారు. సమన్వయకర్తలుగా బి. జ్ఞానేశ్వరాచారి, భట్టాచారి వ్యవహరించిన ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మట్టా పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని యర్రబోయినపల్లి గ్రామానికి చెందిన తాళ్ళ అప్పయ్య, తాళ్ల చిన్న రామకోటయ్య ఇటీవల మృతి చెందగా గురువారం వారి వారి గృహాలకు వెళ్లి చిత్రపటానికి పూలు మాలలు వేసి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బాగం నీరజ ప్రభాకర్‌చౌదరి, కాంగ్రెస్ మండల నాయకులు ఏనుగు సత్యంబాబు, బత్తుల రాము, పోట్రూ శ్రీనివాసరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గణిత టాలెంట్ టెస్టు'లో ఒరుగు సంధ్యారాణికి మొదటి బహుమతి

నవతెలంగాణ-మధిర

తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన ఖమ్మం జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఒరుగు సంధ్యారాణి ప్రథమ బహుమతిని సాధించి డిసెంబర్ నెల 18న, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైంది. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని సాధించిన విద్యార్థిని గణిత ఉపాధ్యాయులు పోలె సుధాకర్‌లకు గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.సాధు సమాధానం, ఉపాధ్యాయులు డి.వెంకటేశ్వరరావు, టి.సుబ్బారావు, పోలె సుధాకర్, ఎం.కృష్ణవేణి, వివిఎల్‌పి.కుమారి, ఏ.వినోద్‌రావు, కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-కూసుమంచి

నేడు (శుక్రవారం) ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇల్లు నమూనా బిల్డింగ్‌కు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారని కూసుమంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇంచార్జీ శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

బ్రహ్మంకు కలయిక వాకర్స్ నివాళి

నవతెలంగాణ-మధిర

కలయిక వాకర్స్ క్లబ్, మధిర సాంస్కృతిక విభాగం ఇన్చార్జ్, నాట్యాచార్యుడు కలవారి బ్రహ్మం దశదిన కార్యక్రమం మధిరలోని వారి నివాసగృహంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలయిక వర్కర్స్ హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబానికి ప్రగాఢ సానుభూతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు వేమూరి సునీల్, కోశాధికారి కాజా శ్రీనివాసరావు, వాకర్స్ సభ్యులు మామిడిశెట్టి రమేష్, రవి కిరణ్, కేశవరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పోటీలలో భరత్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-మధిర

పట్టణంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన భగవద్గీత పోటీలలో భరత్ టెక్నో స్కూల్ విద్యార్థులు క్విజ్ పోటీలలో అత్యుత్తమ పరాతిభను కనబరిచారని ఆ విద్యాసంస్థల అధినేతలు శీలం విద్యాలత, వెంకటరెడ్డి తెలిపారు. గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో వారు మాట్లాడారు. చిన్మయి ప్రథమ బహుమతి, భగవద్గీత శ్లోక పఠన పోటీలలో తృతీయ బహుమతి అన్విత సాధించారు. వారు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన తెలుగు ఉపాధ్యాయులు నాగరాజు, పద్మావతిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, పాషా, అజీమ్, భవాని, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
7
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | డిసెంబర్ 13, 2024 | www.navatelangana.com

మంత్రి ఇలాకాలో ధాన్యం దందా..!

అధికారులు సీజ్ చేసిన ధాన్యం...విడిపించిన ఎమ్మెల్యే జారే..?

- ఆశ్చర్యానికి గురౌతున్న సివిల్ సప్లై అధికారులు
- కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు క్వింటాకు రూ.100 కమీషన్





నవతెలంగాణ-దమ్మపేట

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నధాన్యం కొనుగోలుపై ఇచ్చే సబ్సిడీ పక్కదారి పట్టి ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కమీషన్‌లకు కక్కుర్తి పడి సన్నధాన్యం కొనుగోళ్ళను తమ అక్రమ ఆర్జనకు మార్గంగా ఎన్నుకొని యధేశ్ఛగా రాత్రి సమయాలలో లారీలకు లారీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మండపేట, నూజివీడు, ఏలూరు, కృష్ణాజిల్లా జగ్గయ్యపేట తదితర ప్రాంతాలకు లెవి పేరుతో ధాన్యాన్ని తరలిస్తున్నట్టు రైతులు పెద్ద ఎత్తున ఆరోపణలు చేస్తున్నారు. మండలానికి చెందిన లెవి అర్హత పొందిన రెండు రైస్ మిల్లులలో ఒక రైస్ మిల్ యజమాని ధాన్యాన్ని అధికారులకు కనీసం కూపన్‌లు కూడా చూపకుండా ఎటువంటి ట్యాగింగ్‌లు లేకుండా చట్టవిరుద్ధంగా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన ఒక మిల్లు యజమానితో ఒప్పందం చేసుకొని సివిల్ సప్లై ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా ఒప్పందాలు చేసుకొని ధాన్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో జీసీసీ ఆధ్వర్యంలో ఎనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు, దమ్మపేట సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయి. తొలుత రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణ ఇరువురి స్వగ్రామం గండుగులపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు తూర్పార పట్టినా.. తూర్పార పట్టక పోయినా నికరంగా 85 కేజీల ధాన్యాన్ని రైతుల వద్ద తీసుకొని వివిధ సాకులు చూపి 80 కేజీలకే లెక్క కట్టడంతో రైతులు 5 కేజీలు అదనంగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించడంతో వివిధ కారణాలు చెప్పి రైతుల వద్ద అదనంగా 5 కేజీల ధాన్యం లాక్కొంటున్నారని గండుగులపల్లి రైతులు తెలియజేస్తున్నారు. ఇది ఇలా ఉండగా మండల కేంద్రంలో జీసీసీ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు భారీ స్థాయిలో ఉన్నాయని అక్కడ రైతులు తెలుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక వ్యక్తి తనకు ఆంధ్రాలో ఉన్న పరిచయాలను ఆసరాగా చేసుకొని అక్కడ సన్నధాన్యాన్ని తక్కువ ధరకు కొని దమ్మపేట మార్కెట్‌యార్డులో గల కొనుగోలు కేంద్రంలో వరి సాగు చేయని వివిధ పంటలు వేసిన రైతుల వద్ద పట్టాదార్ పాస్ పుస్తకాలు సుమారు 50 మంది రైతుల వద్ద సేకరించి వారి పేర్లతో కూపన్‌లు తీసుకొని ఆ ధాన్యాన్ని దమ్మపేట కొనుగోలు కేంద్రంలో అమ్ముతున్నట్టు తెలిసింది. ఇప్పటికి 6వేల బస్తాలకు పైగా అమ్మి ఆ సొమ్మును తమకు అనుకూలంగా ఉన్న వారి అకౌంట్‌లలో వేయించుకొని కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించే అధికారికి బస్తాకు రూ.100ల చొప్పున ఇస్తున్నట్లు వీరందరికి మధ్యవర్తిగా ధాన్యాన్ని స్మగ్లింగ్ చేసే ఒక పుష్పరాజ్ ఉన్నట్లు రైతులు బహిరంగంగా తెలియజేస్తున్నారు.

ఆ లారీని విడుదల చేయించింది ఎమ్మెల్యే జారే.?

గత 15 రోజుల క్రితం గణేష్‌పాడు ధాన్యం కేంద్రానికి వెళ్ళాల్సినటువంటి ఒక లారీ ధాన్యం బస్తాలను నింపుకొని అశ్వారావుపేట మండల నుండి ఒక మిల్లర్ ఆంధ్రా ప్రాంతానికి తరలించే ప్రయత్నంలో అర్ధరాత్రి సమయంలో రైతులు ఈ విషయాన్ని పసిగట్టి సివిల్ సప్లై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన సివిల్ సప్లై అధికారులు లారీని వెంబడించి పట్టుకొని సీజ్ చేసి ఒక రహస్య ప్రదేశంలో విషయం బయటకు రాకుండా ఉంచారు. దీంతో మిల్లర్‌లు అవ్వచ్చు.. అక్రమ వ్యాపారం నిర్వహించే కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యాపారస్తుడు అవ్వచ్చు... లేదా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే అధికారులు అవ్వచ్చు.. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణ దృష్టికి తీసుకువెళ్ళడంతో నాలుగు రోజులు గడచిన అనంతరం సివిల్ సప్లై ఉన్నతాధికారులతో మాట్లాడి సీజ్ అయిన లారీని ఎమ్మెల్యే విడుదల చేయించారని రైతులకు అండగా ఉండాల్సినటువంటి ఎమ్మెల్యే రైతుల సమాచారంతో అధికారులు పట్టుకున్న లారీని విడిపించడం ఏమిటని మండలంలోని రైతులు, రైతు సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు కొంతమంది వ్యక్తులకు ఎటువంటి వరిసాగు చేయక పోయినా వారికి కావల్సిన కూపన్‌లు ఇవ్వాల్సిందిగా వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే జారె ఆదేశించినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది.

ఈ విషయాలపై 'నవతెలంగాణ' సివిల్ సప్లై డీటీ ప్రభాకర్‌రావును వివరణ కోరగా తమకు సమాచారం ఇవ్వకుండా ధాన్యం లోడులకు ట్యాగింగ్ లేకుండా రవాణాకు అనుమతి ఇవ్వడం చట్టవిరుద్ధమని తెలిపారు. తమకు జీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేయాలని జీసీసీ మేనేజర్‌కు ఎప్పటికప్పుడు కోరుతున్నా తమకు సమాచారం ఇవ్వట్లేదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై లెవి అనుమతి పొందిన దమ్మపేట మండలానికి చెందిన ఒక మిల్లుపై తమకు కొన్ని ఆధారాలు దొరికాయని, వాటిని పూర్తిస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే హైదరాబాద్ సివిల్‌సప్లై టాస్క్‌ఫోర్స్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించారని తెలియజేశారు. సీజ్ అయిన లారీని ఎందుకు విడుదల చేయాల్సి వచ్చిందో నవతెలంగాణ ప్రశ్నించగా ఈ ఒక్క విషయంపై నో కామెంట్ అని సమాధానం ఇచ్చారు. దమ్మపేటలో జరుగుతున్న సన్నధాన్యం కొనుగోలు విషయంలో ఎప్పుడూ చూడని వింతలు చూస్తున్నామని తాము తమపై అధికారులు ఆశ్చర్యానికి గురౌతున్నారని పేర్కొన్నారు.

నూతన అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోండి

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



నవతెలంగాణ-చర్ల

మండల పరిధిలో గల సత్యనారాయణ పురం పీహెచ్‌సీకి ప్రభుత్వం కేటాయించిన 108 అంబులెన్స్ సేవలు సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కోరారు. గురువారం నూతన అంబులెన్స్ సేవలను ఐటీడీఏ పీవో బి.రాహుల్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండలంలోని అటవీ ప్రాంతంలో ఉన్న రోగులు అరగంటలో ఆసుపత్రికి చేరే విధంగా ఈ అంబులెన్స్ ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. సత్యనారాయణ పురం పీహెచ్‌సీ మైనర్ మరమ్మతులకు రూ.2 లక్షల చెక్కును డాక్టర్ దివ్యనైనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మురళీకృష్ణ, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి కే.ఈదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల సేవలకు గుర్తింపే జాతీయ స్థాయి అవార్డు

- రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల



నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది రోగులకు సకాలంలో సేవలు అందిస్తున్నారని, వారి సేవలను గుర్తించిన ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఎన్ క్యూ ఏఎస్ సర్టిఫికెట్‌తో ప్రశంసించిందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మెన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో, కొత్వాల నాయకత్వంలో వైద్యులను ఘనంగా సన్మానించారు. గురువారం కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి వెళ్ళి ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ సోమరాజు దొర, సూపరింటెండెంట్ మెడికల్ ఆఫీసర్ రాంప్రసాద్‌లతో పాటు పలువురు డాక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ వైద్యులు దేవుళ్లతో సమానమని, రోగుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత డాక్టర్లదేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న, యూత్ కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు పైడిపల్లి మహేష్, మెలిగ మహేష్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటాచారి, నర్సింహారావు, శ్రీనివాస్, శాంతివర్ధన్, ప్రసాద్, మల్లేష్, దేవా, రాము తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎంపీడీవోకి రాజకీయ పార్టీలు వినతి



నవతెలంగాణ-మణుగూరు

గ్రామపంచాయతీ సమితి సింగారం 16 వార్డులు పరిధిలో ఉన్నటువంటి ఓటర్స్‌కి ఎటువంటి ఇబ్బంది లేకుండా వార్డు వెరిఫికేషన్ జరగాలని రాజకీయ పార్టీలు స్థానిక ఎంపీడీవో టి.శ్రీనివాసరావుకి లేకను సమర్పించారు. శ్రీనివాసరావు అనంతరం డీపీఓకి తెలియపరచి పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజకీయ పార్టీలకు తెలియపరిచారు. రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ పిరినాకి నవీన్, బీఆర్ఎస్ నుంచి పోశం నరసరావు, సీపీఐ నుంచి సా రెడ్డి పుల్లారెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు సత్రపల్లి సాంబశివరావు, కొడిశాల రాములు దుగ్యాల సుధాకర్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరాయంగా పనిచేస్తున్న కేపీయూజీ కార్మికులు

- నీటి ఉధృతిని తగ్గించుటకు అధికారుల నిరంతర శ్రమ
- కార్మికులకు టీబీజీకేఎస్ చేయూత

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు సింగరేణి ఏరియా కొండాపురం భూగర్భ గని లోపలి భాగం నందు ఈ నెల 06న ఉత్పత్తి పనులు చేపడుతున్న సమయంలో 42 లెవెల్ వద్ద భూ ప్రకృతి వైపరీత్యాలు సంభవించి దురదృష్టవశాత్తు గని నందు ఏర్పడిన నీటిఊట పెరుగుతుండడం దానిని నియంత్రించి పెరుగుతున్న నీటిని బయటకు పంపించడానికి గని కార్మికులు, అధికారులు, ఏరియా అధికారులతో పాటు మైన్స్ రెస్క్యూ సర్వీస్ బృందాలు సమష్టి కృషితో రేయంభవళ్ళు శక్తికి మించి కష్టించి పని చేస్తున్నారు. కొండాపురం గని కష్ట కాలం నుంచి గట్టెకించడానికి నిద్రాహారాలు మాని అంకితభావంతో గని లోపల పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ కొంత మేరకు శక్తిని అందించడానికి తోడ్పాటుగా మణుగూరు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో గురువారం అరటిపండ్లు, మ్యాంగో రసం ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి కొండాపురం భూగర్భ గనికి లక్ష టన్నుల బొగ్గు లక్ష్యం కాగా గని ప్రాజెక్ట్ అధికారి వీరభద్రరావు, గని మేనేజర్ వెంకటేశ్వర్లు అంకుటిత దీక్ష పట్టుదలతో కార్మికుల సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. నీటి ఉపద్రవం నుంచి గని త్వరితగతిన కోలుకొని ఉత్పత్తి ఉత్పాదకత ప్రక్రియ చేపట్టాలని, గని మైసమ్మను అయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గని టీబీజీకేఎస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు కుర్చీల అందజేత

నవతెలంగాణ-బూర్గంపాడు

బూర్గంపాడు మండలం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న సారపాక గ్రామపంచాయతీ శ్రీరామపురం, భాస్కర్ నగర్, తాళ్లగోమ్మూరు అంగన్వాడీ కేంద్రలకు కొల్లి ఫౌండేషన్ సహకారంతో 30 కుర్చీలను అందజేశారు. ప్రాజెక్టు సీడీపీఓ రేవతి చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డి నేటర్ రూప్లా నాయక్, సెక్టార్ సూపర్వైజర్ సక్కు బాయి, అంగన్వాడి టీచర్లు సులోచన, భారతి, కృష్ణవేణి, ఏఎల్ఎంఎస్‌సీ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మండలంలో ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి పర్యటన

- గతంలో పనిచేసిన ఎంఈఓపై వచ్చిన ఆరోపణలపై విచారణ

నవతెలంగాణ-దమ్మపేట

మండలంలో ఆర్జేడీ పి.సత్యనారాయణ రెడ్డి గురువారం పర్యటించారు. గతంలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన వనమా వెంకటేశ్వరరావుపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో విచారణ నిమిత్తం ఫజర్యాదు చేసిన పలు ఉపాధ్యాయులను మండల కేంద్రానికి పిలిపించుకున్న ఆర్‌జెడీ విచారణ చేశారు. అనంతరం దమ్మపేట ఉన్నత పాఠశాలలను సందర్శించి పదవ తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి 10వ తరగతి విద్యార్థులకు విద్యాబోధనకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రకాష్ నగర్ కాలనీ పాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. వెనకబడిన విద్యార్థులు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మధ్యాహ్న బోజనంను పరిశీలించి క్రమంతప్పకుండా మెను ప్రకారం ఉండేలా చూడాలని పేర్కోన్నారు. ఈ పర్యటనలో సీసీ మాధవరావు, మండల విద్యాశాఖ అధికారిణి కీసరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి...

- కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు

నవతెలంగాణ-అశ్వారావుపేట

మద్యం మత్తులో భార్యపై భర్త దాడి చేసాడు. ఈ ఘటనలో భార్యకు తీవ్రగాయాలయ్యాయి. కుమారుడు ఫిర్యాదు మేరకు తండ్రి పై కేసు నమోదు అయింది. ఫిర్యాదు దారు రాతపూర్వక కథనం మేరకు... ఎస్‌హెచ్‌ఓ ఎస్సై టి.యయాతి రాజు ప్రకారం వివరాలు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా గోపాలపురంకు చెందిన పెంద్ర రవి, భార్య దుర్గ స్వగ్రామమైన అశ్వారావుపేట మండలం ఆసుపాకకు వచ్చి నివాసం ఉంటున్నారు. వీరికి ఇరువురు సంతానం ఉన్నారు. అయితే భార్యపై అనుమానంతో పాటు కుటుంబ కలహాల నేపథ్యంలో కొంతకాలంగా భర్త రవి వేరుగా ఉంటున్నాడు. అప్పుడప్పుడు వచ్చి మద్యం మత్తులో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి భార్య దగ్గరకు వచ్చిన రవి నిద్రిస్తున్న భార్యను అందుబాటులో ఉన్న పాత మంచం పట్టెతో తల నుదుటి పై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలైయ్యాయి. దీంతో బాధితురాలు గట్టిగా కేకలు పెట్టడంతో కుటుంబీకులు మేల్కొని వచ్చేసరికి అక్కడి నుంచి పారిపోయాడు. రక్తపు గాయంతో ఉన్న ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ ఘటనపై బాధితురాలి పెద్ద కుమారుడు అశోక్ బుధవారం చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మల్టీ పర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి

- 17న చలో హైదరాబాద్
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్



నవతెలంగాణ-ములకలపల్లి

మల్టీ పర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో నెంబర్ 51ని తీసుకొచ్చి గ్రామపంచాయతీ కార్మికులతో చేయలేని పనులు చేస్తూ కార్మికులు పిట్టల్లా రాలిపోతుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో కార్మికులు పాలకులకు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 17న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎడల భవిష్యత్ కార్యక్రమం రూపొందించి ఉద్యమ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శివర్గ సభ్యులు దొడ్డ రవి, మండల కన్వీనర్ నిమ్మల మధు, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు చిక్కుల శ్రీను, కారుమంచి సాయిరత్న, వర్క్ రుక్మధరావు, ధారయ్య, గుగులోతు శంకర్, శనగాని శంకర్, వెలకం రాఘవులు, వెంకన్న, కోంద్రు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు సమన్వయంతో పని చేయాలి

- అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్



నవతెలంగాణ పాల్వంచ

గ్రూప్-2పరీక్షలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ గ్రూప్ 2 పరీక్ష నిర్వహణ, బయోమెట్రిక్ విధానం పై చీఫ్ సూపర్డెంట్లు, ఐడెంటిఫికేషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డిపార్ట్మెంటల్ అధికారులు, లోకల్, జాయింట్ రూట్ అధికారులు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15, 16 తేదీలలో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 38 పరీక్షా కేంద్రాల్లో 13465 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్షకు హాజరుకానున్నారు అని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల 100శాతం బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష హాల్లో ప్రారంభానికి ముందే ఓఎంఆర్ షీట్ పై ఇన్విజిలేటర్లు అభ్యర్థులకు అవగాహన కల్పించాలన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9392919706 తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటుచేసిన 040-23542185, 040-23542187 టోల్ ఫ్రీ నెంబర్లకు ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ అవగాహనా సదస్సులో గ్రూప్-2 పరీక్షల కన్వీనర్ హరికృష్ణ, డీఎస్పీ ఏఆర్ సత్యనారాయణ (గ్రూప్ 2 పరీక్షల పోలీస్ నోడల్ అధికారి) సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టం పట్ల అవగాహన కల్పించాలి

విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, స్ట్రెస్ మేనేజ్మెంట్ అధికారి ఆదిశేషు, అన్ని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేస్తం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



నవతెలంగాణ-బూర్గంపాడు

మోరంపల్లి బంజర్ గ్రామానికి చెందిన నేస్తం వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముసలి మడుగు గ్రామానికి చెందిన పెరుమాళ్ళ ముత్తయ్యకు రూ.8000 ఆర్థిక సహాయం అందజేశారు. ఐటీసీ నందు క్యాజు వల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సునీత, ఒక పాప అక్షర, తల్లిదండ్రులు నర్సయ్య-లక్ష్మి ఉన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ బత్తుల రామ కొండా రెడ్డి మాట్లాడుతూ బూర్గంపాడు మండల పరిధిలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా నేస్తం ట్రస్ట్ సేవలు గుర్తించిన ఎంతో మంది మిత్రులు నేస్తం ట్రస్ట్‌ను సంప్రదిస్తే ఆపదలో వున్నా పేదవారికి సహాయం చేస్తారని చెప్పడం వలన వారు నేరుగా సహాయం కోరుతున్నారని ఆయన అన్నారు. అలాగే ముత్తయ్య భార్య వారి దయనీయ పరిస్థితి తెలపడంతో వెంటనే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.8,000 ఆర్థిక సహాయం అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఇండ్ల రాజేష్, కోశాధికారి కైపు రాజేందర్ రెడ్డి, సభ్యులు బత్తుల రామకొండా రెడ్డి (సొసైటీ డైరెక్టర్) సంకా సురేష్, కైపు రమేష్ రెడ్డి, అవుల నాగార్జున, డి.బాల నారాయణరెడ్డి, గ్రామస్తులు జి.రవి పాల్గొన్నారు.

నిరుపేదల కుట్టు మిషన్లు పంపిణీ చేయాలి

- బీఆర్ఎస్ మండల నాయకులు మహమ్మద్ ఖయ్యూం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లా కేంద్రంతో పాటు అశ్వారావుపేట, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గాల్లో నిరుపేదల కుట్టు మిషన్లు తక్షణమే పంపిణీ చేయాలని స్థానిక బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ ఖయ్యూం గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిపోయిందని, కేవలం కేసీఆర్ ఫోటో ఉండడం మూలాన నిరుపేద లబ్ధిదారులకు కుట్టు మిషన్లు పంపిణీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు విరివిగా చేపడతామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో కేసీఆర్ పోరాటం తెలంగాణ రాష్ట్రానికే కాదు భారతదేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు ఎంపిక సర్వే పరిశీలన



నవతెలంగాణ-టేకులపల్లి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు సర్వే ఎంపిక సర్వే పరిశీలన మండలంలోని మూడ్ తండా, గోలియాతండాలలో తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీవో రవీంద్రావులు గురువారం పరిశీలించినట్టు తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లకు, అర్హులు ఇచ్చిన దరఖాస్తులు, గ్రామ పంచాయతీ కార్యదర్శిలచే సర్వే చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని దరఖాస్తుదారులందరు అందుబాటులో ఉండి, సర్వే టీంకు సహకరించవలసిందిగా కోరారు.

సామాజిక తనిఖీలో అక్రమాలు

- రికవరీ రూ.1 లక్షా 16 వేల 543లు
- పెనాల్టీ రూ.39 వేలు
- ఆధారాలతో నిరూపించిన తనిఖీ బృందం



నవతెలంగాణ-అశ్వారావుపేట

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనుల్లో పొరపాట్లు, అవకతవకలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ పథకం ప్రారంభం నాటి నుండి ప్రతీ ఏడాది జరిగిన పనులపై వార్షిక సామాజిక తనిఖీలు జరుగుతూనే ఉన్నా బుధవారం నిర్వహించిన 15 దఫా సామాజిక తనిఖీ లోనూ అనేక వైఫల్యాలు బహిర్గతం అయ్యాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్డీఏ, ఏపీడీ రవి నేతృత్వంలో ఉపాధి పనుల సామాజిక తనిఖీలు రాత్రివరకు నిర్వహించారు. గడిచిన ఏడాది కాలంలో జరిగిన ఉపాధి పనులపై (24 నవంబర్ 2023 నుండి 10 డిసెంబర్ 2023) గత నెల రోజులు పాటు మండలంలోని 30 పంచాయతీలలో 10 బృందాలు తనిఖీ నిర్వహించాయి. వీటిపై మండల స్థాయిలో తనిఖీ ఆధారాలతో నిరూపించారు. మొత్తం రూ.1 లక్షా 55 వేల 543లు మేర అక్రమాలు జరిగినట్లు నార్ధారించారు. పెనాల్టీ రూపంలో రూ.39 వేలు, రికవరీ రూపంలో రూ.1 లక్షా 16 వేల 543లుగా తేల్చారు. ఈ వివరాలను గురువారం స్థానిక ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావు ప్రకటించారు. మండలంలో గత ఏడాది 01 ఏప్రిల్ 2023 నుండి 31 మార్చి 2024 వరకు ఈజీఎస్‌లో 460 పనులకు గాను రూ.4 కోట్ల 26 లక్షల 03 వేల 745లు, పంచాయతీరాజ్ శాఖలో 64 పనులకు గాను రూ.3 కోట్ల 02 లక్షల 12 వేల 934లు, మన ఊరు మన బడిలో 8 పనులకు గానూ రూ.11 లక్షల 13 వేల 278లు, అటవీశాఖలో 02 పనులకు గానూ రూ.1 లక్ష 58 వేల 218లు కూలీలకు వేతనం, వస్తు రూపేణా మొత్తం రూ.7 కోట్ల 40 లక్షల 88 వేల 175లు వ్యయం చేసారు. ఈ అక్రమాల్లో 30 పంచాయతీల్లో నందిపాడు పంచాయతీ రూ.18 వేల 335లు, బచ్చువారిగూడెం రూ.12 వేల 381లు, గుర్రాల చెరువు రూ.9 వేల 99లతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. రికవరీ లోనూ రూ.18 వేల 335లతో నందిపాడు, పెనాల్టీలో రూ.5 వేలతో కన్నాయిగూడెం ఒకటో స్థానాల్లో నిలిచాయి. ఇంకా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.

ప్రజా ఉద్యమాల్లో ముందుండి పనిచేసిన మహా నాయకులు ఎర్ర బుచ్చమ్మ, చిన్న గోపయ్యలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య



నవతెలంగాణ-దుమ్ముగూడెం

నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రజా ఉద్యమాలు ముందుండి పని చేసిన మహా నాయకులు కొర్స ఎర్ర బుచ్చమ్మ కుమ్మరి కుంట చిన్న గోపయ్యలు అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు కొర్స చిలకమ్మ మాతృమూర్తి కొర్స ఎర్ర బుచ్చమ్మ తూరుబాక గ్రామానికి చెందిన పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ కుమ్మరి కుంట సాంబశివరావు తండ్రి కుమ్మరి కుంట చిన్న గోపయ్య దశదినకర్మల్లో పాల్గొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అమరుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ యలమంచి రవికుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి, మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, గడ్డం స్వామి, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, సున్నం గంగ, కొడాలి లోకేష్ బాబు, బండారు శరత్, బొల్లి సూర్యచంద్రరావు, సత్యనారాయణ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలి


- మట్టి నమూనా పై అవగాహన పెంచుకోవాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-టేకులపల్లి

విద్యార్థులు మట్టి నమూనా పై అవగాహన పెంచుకొని, వ్యవసాయ శాస్త్రవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ విద్యార్థులకు సూచించారు. గురువారం మండలంలోని బద్ధతండ గ్రామంలో ఉన్న ఏకలవ్య పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏకలవ్య పాఠశాల విద్యార్థులు నిర్వహించే మట్టి నమూనాల, పరీక్షల విధానం, పరీక్షలను పరిశీలించారు. నేలలో వుండే ఎన్పికె, ఎంపీఓల స్థాయిలను ఎప్పటికప్పుడు మట్టి నమూనా పరీక్షల ద్వారా తెలుసుకుని, అందుకు తగ్గట్లుగా రైతులు పంటలు సాగు చేయాలని, రైతుల్లో అవగాహన కొరవడిందన్నారు. విద్యార్థులు మట్టి నమూనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల ల్యాబ్‌లో విద్యార్థులతో, తమ సామర్థ్యం ఎలా ఉందో పరీక్షించి తెలుసుకున్నారు. ఇక్కడి విద్యార్థులు ఇతర ఏకలవ్య పాఠశాలల విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులు సైంటిస్టుగా ఎదగాలని సూచించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సైన్స్ ప్రోగ్రాంకు, విద్యార్థులను తీసుకొచ్చేందుకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముందుగా పాఠశాలలో తాగు నీటి సౌకర్యం లేక, ఇతర ప్రాంతాలనుంచి శుద్ధిచేసిన నీటిని కొని తెచ్చుకొని వాడుతున్నామని తెలపగా, ఆలా చేయొద్దని, నీటిలో మినరల్స్ లేకుండా పోతున్నాయని, తాగు నీటి ట్యాంకుకు ఫిల్టర్ ఏర్పాటు చేసుకోవాలని, వాటిని కూడా పంపించే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బాబురావు, ఏడీఏ లాల్ చంద్, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీంద్రరావు, ఏవో అన్నపూర్ణ, ఎంపీఓ గణేష్ గాంధీ, ప్రిన్సిపల్ నిశాంత్ కృష్ణ, ఏఈఓ రమేష్, ఈజీఎస్ ఈపీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపులితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రేగళ్ల రేంజర్ వి.జశ్వంత్



నవతెలంగాణ-ఆళ్ళపల్లి

పెద్దపులి ములుగు జిల్లా నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో జిల్లాలోని రేగళ్ల, ఆళ్ళపల్లి రేంజీల పరిధిలో ఉండే ప్రజలు, ముఖ్యంగా పొలం పనులకు వెళ్లే రైతులు, పశువుల, మేకల కాపరులు, అటవీ ఉత్పత్తులు సేకరించేవారు అప్రమత్తంగా ఉండాలని రేగళ్ల రేంజర్ వి.జశ్వంత్ సూచించారు. ఈ మేరకు గురువారం రేగళ్ల రేంజ్ పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన డప్పు చాటింపు ద్వారా ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పులి సంచరించే ఆనవాళ్ళు ఉండటంతో రేగళ్ల రేంజి అడవుల్లో తన సిబ్బందితో కలిసి గతంలో పులి సంచరించిన ప్రాంతాలను పరిశీలించామన్నారు. గ్రామాల పొలిమేరలు దాటేవారు, అడవుల్లోకి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పులి వేటాడే విధానం, దాని స్వభావం, దాడి చేసే పద్ధతి గురించి తెలిపారు. పెద్ద పులి ఎదురైతే ఎలా అప్రమత్తంగా ఉండాలో గ్రామస్తులకు అవగాహణ కల్పించమని చెప్పారు.

ముగిసిన సీఎం కప్-2024 క్రీడలు

నవతెలంగాణ-అశ్వారావుపేట



గత రెండురోజులు నిర్వహించిన సీఎం కప్-2024 మండల స్థాయి క్రీడలు గురువారం విజయవంతంగా ముగిసాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు మాట్లాడారు. చదువుతో పాటు ఆట పాటలకు ప్రాధాన్యతనివ్వాలని మండల ప్రత్యేకాధికారి ప్రదీప్ అన్నారు. క్రీడల్లో పాల్గొనడంతో సమయస్ఫూర్తి అలవడుతుందని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. క్రీడల్లో పాల్గొనే వారికి నైపుణ్యాభివృద్ధి మెరుగు అవుతుందని తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ సూచించారు. మనో ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంఈఓ పొన్నగంటి ప్రసాదరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ముగిశాయి. గెలుపొందిన విజేతలకు వారు అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రతిభాపాటవాలు కనబరిచిన క్రీడాకారులకు జ్ఞాపికలు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో సోయం ప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి కోటమర్తి శ్రీరామ మూర్తి, పీడీలు సున్నం రామారావు, ప్రమీల, వసంత, పీఈటీలు పద్మజ, సీతా కళ్యాణి, రమేష్, షకీలాలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నిరవధిక సమ్మె

- మూడవ రోజు చేస్తున్న సమ్మెకు పీఆర్‌టీయూ పూర్తి మద్దతు

నవతెలంగాణ-పాల్వంచ

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున కలెక్టరేట్ వద్ద చేస్తున్న సమ్మె గురువారం నాటికి మూడవ రోజుకుచేరింది. మూడవ రోజు చేస్తున్న సమ్మెకు పిఆర్టియు టీఎస్ పూర్తి మద్దతు తెలిపింది. రాష్ట్రంలో 33 జిల్లాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులు 19600 మంది గౌరవ ముఖ్యమంత్రి నాటి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అధికారంలోకి రాకముందు సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏదైతే హామీ ఇచ్చి ఉన్నారో అట్టి హామీని నిలబెట్టుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన దీక్షలు చేసి సమ్మెకు దిగడం జరిగింది. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి.నరసింహారెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులను పిలిపించి అసంపూర్తి చర్చలు జరపడం వల్ల కోపోద్రిక్తులైన సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెను మరింత ఉధృతం చేస్తూ ముందుకు వెళుతున్నారు. పీఆర్టి యు జిల్లా శాఖను ఉద్దేశించి సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మోహన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బట్టు చందర్‌లాల్, పి. సిద్దయ్య, వనమా సురేష్, గోడ కిషన్, ఎం.రామారావు, కిషన్, అర్జున్, ఎం.తులసి, కవిత సంతు మిగిలిన సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

యూనియన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-టేకులపల్లి

భద్రాద్రి కొత్తగూడెంలో జరిగే జిల్లా ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని, ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, టీయూసీఐ జిల్లా నాయకులు సుందర్ పిలుపు నిచ్చారు. గురువారం మండలంలోని టిప్పర్ అసోసియేషన్ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో రవాణా రంగంలో, 15 లక్షల మంది ఆటో మోటారు కార్మికుల సంక్షేమ బోర్డును ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న మాయ మాటలు చెబుతూ దాటేస్తున్నారే తప్ప సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఎన్నికలలో చేసిన వాగ్దానాలను ఇప్పటివరకు అమలు చేయకుండా సంవత్సరం పూర్తి చేసుకొని ప్రజా పాలన విజయోత్సవాలు జరుపుకోవడం దుర్మార్గమన్నారు. ఆటో నిర్వహణ కోసం సంవత్సరానికి రూ.12 వేలు ఇచ్చి ఆదుకుంటానని చెప్పిన ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు.

నాగులగుంపులో సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-అశ్వారావుపేట

సెమీ క్రిస్మస్ వేడుకలు మండలంలో ప్రారంభం అయ్యాయి. వందకు పైగా పలు సంస్థలకు చెందిన చర్చిలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ప్రతీ డిసెంబర్ లోనూ క్రిస్మస్ వేడుకలు ఆహ్లాదం భరితంగా నిర్వహించుకుంటారు. మండలంలోని మల్లాయిగూడెం పంచాయతీ పరిధిలోని నాగుల గుంపులో గల "సీయోను" ప్రార్ధనా మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ జన్మదిన డిసెంబర్ 35 పర్వదినం పురష్కరించుకొని ప్రార్ధనా మందిరాన్ని రంగులతో సుందరంగా అలంకరించారు. ముందస్తుగా నిర్వహించిన సెమీ క్రిస్ మస్ వేడుకల్లో పండువారిగూడెం, నాగులగుంపు, దిబ్బగూడెం, రామన్నగూడెం, అల్లిగూడెంలకు చెందిన సంఘస్తులు పాల్గొన్నారు. మందిరంలో కొవ్వొత్తుల వెలుగులో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ సీయోను కుమార్, అశ్వారావుపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు కాక చంద్రం, జాన్సన్, నెహ్రూ, దేవదాసు, ప్రకాష్ రావు, భాస్కర రావు, సుధాకర్, ఎల్.రాజు, దిలీప్, కే.సీయోను కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలి

- డాక్టర్ జస్టిస్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌కు మాల మహానాడు వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం

ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డాక్టర్ జస్టిస్ అక్తర్ ఏక సభ్య కమిషన్‌ని గురువారం ఖమ్మం కలెక్టరేట్‌లో కలుసుకొని ఎస్సీ వర్గీకరణ అక్రమమని, 341 ఆర్టికల్ క్రింద వర్గీకరించడం అన్యాయమని, పార్లమెంట్‌లో బిల్ పెట్టకుండా, పార్లమెంట్ ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని, అందువలన ఎస్సీ వర్గీకరణను నిలుపుదల చేయాలని, పెరిగిన ఎస్సీ జనాభాను దృష్టిలో ఉంచుకుని ఎస్సీ రిజర్వేషన్లను 15శాతం నుండి 25 శాతంకు పెంచాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాల మహానాడు నాయకులు కోరారు. కమిషన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర సెక్రటరీ జనరల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ ఎస్.మధుసూదన్ రావు (చిన్ని), మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ముడుసు జాకబ్రా, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్ కూరపాటి రవీందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షురాలు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కో-కన్వీనర్ నక్కా సృజన పాల్గొన్నారు.

నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వే పూర్తి చేయాలి

- గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు
- విద్యార్థులకు డైట్ చార్జీలను 40 శాతం పెంపు
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్



నవతెలంగాణ-పాల్వంచ

ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే, గ్రూప్-2 పరీక్షల నిర్వహణ నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాల పై అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనలతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తు నమోదు చేపట్టాలని, నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తులు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. భద్రాచలం, కొత్తగూడెం ఆర్డీవోలు ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలం గుర్తించి త్వరితగతిన మోడల్ హౌస్ నిర్మించాలని ఆదేశించారు. గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 15, 16 తేదీలలో గ్రూప్2 పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 40% డైట్ చార్జీలు పెంచినందున పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతి విద్యా సంస్థలు మెన్యుకు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని అన్నారు.

స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి

- సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా, వినతి

నవతెలంగాణ-కొత్తగూడెం



సివిల్ డిపార్ట్‌మెంట్ కాంట్రాక్టు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం జనరల్ మేనేజర్ (పర్సనల్)కి వినతి పత్రం అందజేశారు. భూక్యా రమేష్ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమంలో సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా గత 20 సంవత్సరాల పైచిలుకు నుండి సివిల్ డిపార్ట్‌మెంట్‌లో వాటర్ సప్లై డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న కార్మికులకు అన్ స్కిల్ వేతనాలు, కొన్ని ప్రాంతాల్లో (కొత్తగూడెం, రుద్రాంపూర్) సెమీ స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారనీ కార్పెంటర్ వర్క్, మేషన్ వర్క్, ప్లంబింగ్ వర్క్, వెల్డింగ్ వర్క్ పనులలో నైపుణ్యం గల వారిగా స్కిల్డ్ వేతనాలు ఇవ్వకుండా అన్ స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నారని చెప్పారు. అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి వీరన్న మాట్లాడుతూ..నైపుణ్యం గల పని చేస్తున్న కార్మికులకు కోల్ ఇండియాలో ఇస్తున్న మాదిరిగానే స్కిల్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సింగరేణి జీఎం పర్సనల్‌కి సిఐటియు నేతలు సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంటాక్ట్ సంఘం కోశాధికారి సూరం ఐలయ్య, బ్రాంచ్ నాయకులు భూక్య రమేష్, భాస్కర్ మాలత్, వీరయ్య, బి.కృష్ణ, రమేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచేందుకు కృషి

- సింగరేణి విద్యా సంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్
- సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ జీఎం శ్రీనివాస్

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి వ్యక్తంగా ఉన్న విద్య సంస్థల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నామని, రానున్న విద్యా సంవత్సరం నుంచి సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అమల్లోకి తీసుకువచ్చేందుకు కార్యచరణ రూపొందించినట్లు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ గుండా శ్రీనివాస్ తెలిపారు. గురువారం కొత్తగూడెం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఎంగా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకున్న అనంతరం సింగరేణి వ్యాప్తంగా ఉన్న పాఠశాల, కళాశాల, పాలిటెక్ని కళాశాలలో పరిశీలించడం జరిగిందన్నారు. అన్ని పాఠశాలలు విద్యా సంస్థల్లో పూర్తిస్థాయి మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు సింగరేణి పాఠశాలలో స్టేట్ సిలబస్ అమలులో ఉందని, రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రయోగాత్మకంగా సెంట్రల్ సిలబస్ ఏర్పాటు చేయడానికి పూర్తిస్థాయిలో కార్యచరణ పూర్తి చేసినట్లు తెలిపారు. త్వరలో సీబీఎస్ఈ అధ్యయన బృందం సింగరేణి సంస్థలలో పర్యటించడం జరుగుతుందని వివరించారు. సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి 50 వసంతాలు కావస్తున్న సందర్భంగా ఈ ఏడాది ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అనేక కార్యక్రమాలు చేపడుతున్న తరుణంలో కొంత మంది తన మీద విమర్శలకు పూనుకున్నారని, ఇది సరైంది కాదని సూచించారు. నిజనిజాలు గమనించాలని కోరారు.

23న సింగరేణి డే ఉత్సవాల సందర్భంగా నిరసన

- కాంటాక్ట్ కార్మికులకు ఎస్సీకేఎస్ పిలుపు

నవతెలంగాణ-కొత్తగూడెం



ఒకే కుటుంబం-ఒకే గమ్యం-ఒకే లక్ష్యం ఇది సింగరేణి నినాదం. కానీ, ఆచరణలో సింగరేణిలో ఒకే కుటుంబం లేదు. అధికారుల కుటుంబం వేరు. పర్మినెంట్ కార్మికుల కుటుంబం వేరు. కాంట్రాక్టు కార్మికుల కుటుంబం వేరులాగా సింగరేణి యాజమాన్యం వ్యవహరిస్తున్నది. సింగరేణి యాజమాన్యం సింగరేణి కాంటాక్ట్ కార్మికులను బానిసలుగా, రెండవ తరగతి పౌరులుగా చూస్తూ అడుగడుగునా వివక్షత పాటిస్తున్నది.

కోల్ ఇండియా వేతనాలు అమలులో, కార్మికులకు వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయం కల్పనలో, క్యాంటీన్ సౌకర్యం, పండగ, జాతీయ సెలవులు అమలుల, వృత్తి పన్ను మినహాయింపు, ఖాళీ క్వర్టర్స్ కేటాయింపులో, కేటగిరి ఆధారంగా సెమిస్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ వేతనాలు చెల్లించడంలో, మైన్స్ చట్టం, కాంట్రాక్టు లేబర్ చట్టం, ఇతర చట్టాలను అమలు చేయడంలో, వేతనాలను సకాలంలో చెల్లించడంలో, పెయిడ్ హాలిడే వేతనం చెల్లంపులో, స్వీట్ పంపిణీలో, చివరికి ప్రమాదంలో మరణిస్తే రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వడంలో, సమస్యలకు ప్రధాన్యత ఇవ్వడంలో ఇలా అడుగడుగునా కాంటాక్ట్ కార్మికుల పట్ల సింగరేణి యాజమాన్యం వివక్షత పాటిస్తుంది. చట్టాలను, చట్టబద్ధ సౌకర్యాలను సైతం అమలు చేయకుండా కాంట్రాక్టు కార్మికులను శ్రమదోపిడి చేస్తున్నది. ఈ వివక్షతను విడనాడాలని కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు, చట్టబద్ధ సౌకర్యాల అమలుకై గత అనేక సంవత్సరాలుగా కాంట్రాక్ట్ కార్మికులు వినతి పత్రాలు ఇస్తున్నారు. అనేక రూపాలలో ఆందోళన, పోరాటాలు చేస్తున్నారు. కానీ సింగరేణి యాజమాన్యం కనీస స్పందన కూడా కనబరచడం లేదు. జీఓ-22 అమలుకు అనుమతి ఇవ్వాలని 26 సెప్టెంబర్ 2022న సింగరేణి యాజమాన్యం ఇంధన శాఖకు రాసిన లేఖకు ఇప్పటి వరకు ఇంధన శాఖ నుంచి కాని, రాష్ట్ర ప్రభుత్వం నుండి సమాధానం ఇవ్వలేదు. సింగరేణి యాజమాన్యంతో జరుగుతున్న స్ట్రక్చరల్ సమావేశాలలో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెరుగుదల గురించి కాని సమస్యల గురించి కానీ, యాజమాన్యం ఇచ్చిన హామీల అమలు గురించి కాని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఒక్క మాట కూడా మాట్లాడకపోగా యాజమాన్యం, ప్రభుత్వ అడుగులకుమడుగులొత్తుతున్నాయి.

ఈ నెల 23న సింగరేణి యాజమాన్యం సింగరేణి ఆవిర్భావ (పుట్టినరోజు) వేడుకలకు సిద్ధమవుతుంది. ఘనంగా జరపాలని భారీగా నిధులను కూడా కేటాయించింది. పుట్టిన రోజు వేడుకలు అంటే కుటుంబంలోని సభ్యులందరూ ఆనందంగా హాజరుపుకోవాలి. కానీ కాంట్రాక్టు కార్మికులను పస్తులు వుంచి, వాళ్ల సమస్యలు పరిష్కరించకుండా వాటిపై ప్రకటన చేయకుండా సింగరేణి యాజమాన్యం ఉత్సవాలకు సిద్ధమవుతుంది. ఈ నేపద్యంలో సింగరేణి డే సందర్భంగా నిరసనలు తెలపడం బాధాకరమైనప్పటికీ నిరసనలు పిలుపు ఇవ్వాల్సిన పరిస్థితిని సింగరేణి యాజమాన్యమే సృష్టించింది. ఇతర సమస్యల పరిష్కారంకై డిశంబర్ 23లోపు చోరవ చేసి కాంట్రాక్టు కార్మిక సంఘాలతోటి చర్చలు జరపాలి. సింగరేణి పుట్టినరోజు వేడుకలవేదిక నుండి జీఓ-22 అమలు, ఇతర సమస్యల పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన చేయాలి. సింగరేణి కుటుంబంలోని కాంటాక్ట్ కార్మికులతో సహా అందరూ సంతోషంగా వేడుకలు జరుపుకునేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

లేనియెడల 23వ తేదిన సింగరేణి వ్యాప్తంగా జరగనున్న సింగరేణి నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలతో నిరసనలు తెలియజేయాలని సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం (ఎస్సీకేఎస్) అధ్యక్షులు దూలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.మధులు కార్మికులకు పిలుపు నిచ్చారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులందరూ తమ సమస్యల పరిష్కారం కోసం రాజకీయాలు, సంఘాలకు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ గొంతును విప్పాలని తమ నిరసన యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభత్వానికి తెలియజేయాలని కోరారు.

ఉద్యోగుల 54 డిమాండ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలి

- విలేకర్ల సమావేశంలో టీజీఈ జేఏసీ చైర్మెన్ అమరానేని రామారావు



నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్‌లో ఉన్న సమస్యల వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ రెవిన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ (టిజిఇ జేఏసీ) చైర్మెన్ అమరానేని రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సూర్య ప్యాలెస్ నందు ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసి 54 డిమాండ్లతో కూడిన సమస్యలను చర్చించడం జరిగిందని చెప్పారు. వీటిపై వారు స్పందిస్తూ విడుతల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. దానిపై రాష్ట్ర జేఏసీ పత్రికా సమావేశం ఏర్పాటు చేసి యావత్ రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగులందరికి ఆ సమావేశం వివారాలను ఇదివరకే తెలియజేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగ జేఏసీని నిర్వీర్యం చేస్తూ ఉంటే ఆనాడు ప్రభుత్వంతో పోరాడాల్సింది పోయి భయపడి ఉద్యోగాన్నే వద్దనుకుని రాజీనామా చేసిన వెళ్ళిపోయిన వ్యక్తి ఈరోజు ప్రభుత్వం మారగానే ప్రభుత్వంలో పెద్దలందరూ నా సహోదరులే అని చెప్పి భయభ్రాంతులకు గురిచేసి కొంత మంది ఉద్యోగస్తులను జేఏసీ పేరుతో, స్వయం ప్రకటిత సంఘాల పేరుతొ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్న లచ్చిరెడ్డి గతాన్ని గుర్తేరిగి ప్రవర్తిస్తే బాగుంటుందన్నారు.

ఈ సందర్భంగా కన్వీనర్ సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్దకు సమస్యలను తీసుకెళ్ళేది నిబద్ధత కలిగిన నాయకులు మారం జగదేశ్వర్, ఏలూరి శ్రీనివాస్‌లతో ఏర్పడిన టిజిఇ జేఏసీ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (టిఆర్ఇఎస్ఏ) కార్యదర్శి దొడ్డా పుల్లయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగినదే ముల్కి నినాదం నుంచి అటువంటిది చోళ్లల కాలం నుంచి ఉన్న రెవెన్యూ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేయడం మూలంగా గ్రామాలలో విజిలెన్స్ వ్యవస్థ లేకుండా పోయింది అందువళ్లనే వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై జరిగిన దాడే నిదర్శనం. అలా కాకుండా ఉండటానికి ప్రస్తుత ప్రభుత్వం చేపట్టబోయే నూతన రెవిన్యూ సంస్కారణాలను స్వాగతిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఓ జిల్లా కార్యదర్శి కంచర్ల సాయి భార్గవ్ చైతన్య, టిజిఓ జిల్లా కార్యదర్శి మహేష్, యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి వెంకటేశ్వర్లు, టిఆర్ఇఎస్ఏ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ఎస్‌టియూ జిల్లా బాధ్యులు జహంగీర్, షరీఫ్, ఎస్‌టియూ బాధ్యులు మంగీలాల్, జిటిఏ బాధ్యులు లాల్సింగ్, ఎంపిఓల సంఘం బాధ్యులు శ్రీనివాస్, మునిసిపల్ సంఘ బాధ్యులు అశోక్ చౌహాన్, సీపీఎస్ యూనియన్ సంఘ బాధ్యులు తుక్కాని శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం బాధ్యులు వంశీకృష్ణ, జూనియర్ అధ్యాపకుల సంఘం బాధ్యులు బండి వెంకటేశ్వర్లు, పంచాయత్ రాజ్ యూనియన్ బాధ్యులు నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు. నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పాషా, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు వనమా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదుపులో కొండాపురం భూగర్భ గని నీటి ప్రవాహం

- కేపీయూజీ మైన్‌ను సందర్శించిన ప్రాతినిధ్య సంఘ నాయకులు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు కొండాపురం భూగర్భ గనిలో ఉబికి వస్తున్న నీటి ప్రవాహం అదుపులోనే ఉన్నదని ప్రాతినిధ్య సంఘ నాయకులు తెలిపారు. ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షులు కృష్ణంరాజు నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేపీయూజీ భూగర్భ గనిలోకి వస్తున్న నీటిని పరిశీలించారు. అధికారులు నీటిని బయటికి పంపేందుకు వినియోగిస్తున్న పంపులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మరో రెండు రోజుల్లో బొగ్గు ఉత్పత్తి పునరుద్ధరించే అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం కార్మికులనుద్దేశించి కృష్ణం రాజు మాట్లాడుతూ భూ గర్భం నుంచి బొగ్గు వెలికితీసే కార్మికులకు రిఫ్రెష్ మెంట్ కోసం ఐఎన్‌టీయూసీ అధికారులకు చేసిన విజ్ఞప్తి మేరకు కార్మికులకు టీ, స్నాక్స్‌లు అందించేందుకు శ్రీకారం చుట్టిందని అన్నారు. అధికారులు గని నుంచి వేగంగా బొగ్గు ఉత్పత్తి చేసేందుకు వేగంగా చర్యలు చేపట్టారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాంతీయత సంఘం ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాణోత్ కృష్ణ, పిట్ సెక్రటరీ రామకృష్ణ పాల్గొన్నారు.

కేసీఆర్ ఫొటోతో ఉన్న కుట్టు మిషన్లు పంపిణీ చేయకపోవడం బాధాకరం

- ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల నిర్లక్ష్యంపై పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ మండల నాయకులు లావుడియా పూర్ణ నాయక్

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



మాజీ సీఎం కేసీఆర్ ఫొటోతో ఉన్న కుట్టు మిషన్లు పంపిణీ చేయాకపోవడం బాధాకరమని, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల నిర్లక్ష్యంపై పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు లావుడియా పూర్ణ నాయక్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, అశ్వరావుపేట, ఇల్లందు, భద్రాచలం నియోజకవర్గలలో నిరుపేదలకు పంపిణీ చేయాల్సిన కుట్టు మిషన్లు కేసీఆర్ ఫొటో ఉన్న సాకుతో పంపిణీ చేయకపోవడం హాస్యాస్పదమన్నారు. తక్షణమే వాటిని పంపిణీ చేయాలన్నారు. కాంగ్రెస్ అహంకారపూరిత పాలనకు ఇది నిదర్శనమని ఆయన ఆరోపించారు. లక్ష్మీదేవి పల్లి మండలంలో సైతం లబ్దిదారుల పేర్లు ఎంపిక చేయబడి ఉన్నాయని, తక్షణమే పంపిణీ కోసం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వీడకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని ఆయన హెచ్చరించారు. కేసీఆర్ పేరును ఎవరు చెరిపి వేయలేరని కేసీఆర్ అంటే తెలంగాణ అని తెలంగాణ అంటే కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలకు తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు.

మణుగూరు కొండాపురం భూగర్భ గని మూసివేత

- గనిలోకి ఉధృతంగా చేరుతున్న వేడి నీరు
- 4న వచ్చిన భూకంపమే కారణమా...

నవతెలంగాణ-మణుగూరు



కొండాపురం భూగర్భ గనిలోకి పెద్ద శబ్దంతో ఒక్కసారిగా నీరు చేరడంతో కార్మికులు, అధికారులు క్షేమంగా గని బయటికి వచ్చారు. దీని కారణంగా డిసెంబర్ 6న గనిని మూసివేశారు. డిసెంబర్4న ములుగు కేంద్రంగా 5.3 రిక్టర్ స్కేల్ పై నమోదైన భూకంపం కారణంగానే భూ ప్రకంపనలు ద్వారా భూమి పొరలలో వచ్చిన కదలికల ద్వారా ఈ సంఘటన సంభవించిందని నిపుణులు అంటున్నారు. అందులో భాగంగానే వేడితో కూడిన నీరు భూగర్భ గనిలోకి చేరి ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. సుమారు కూతవేటు దూరంలో ఉన్న పగిడేరు పరిసర ప్రాంతాలలో అధికంగా ఉన్న వేడి నీటి ప్రవాహం గనిలోకి చేరి ఉంటుందని శాస్త్రవేత్తలు, నిపుణులు చెబుతున్నారు. దీనిని సింగరేణి యాజమాన్యం కారణం కాదని చెబుతున్నది. కానీ మణుగూరు మండలంలో అతిపెద్ద వాగు గొర్రెపెట్టవాగు పక్కనే కొండాపురం భూగర్భగని ఉన్నది. మూడు కిలోమీటర్ల దూరంలో పగిడేరు పంచాయతీలో సుమారు 5 వేడి నీటి బుంగలు పైకి ఉబికి వస్తూ ఉంటున్నాయి. గత 20 సంవత్సరాల నుండి ఈ నీరు నిరంతరాయంగా భూ అంతర్భాగాల నుంచి పైకి వస్తున్నాయి. బొగ్గు అన్వేషణలో భాగంగా సింగరేణి యాజమాన్యం బోర్ వెల్ ద్వారా బొగ్గు అన్వేషణలో భాగంగా నిర్వహించిన బోర్వెల్ ద్వారా వేడి నీరు పైకి ఉబికి వస్తున్నాయి. అందులో భాగంగానే దేశంలోనే మొదటిదైన జియో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. గత ఆరు రోజుల నుండి భూగర్భ గాని మూసివేయడంతో రోజుకు 5 వేలటన్నుల బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. గత ఆరు రోజులుగా 40 వేల టన్నుల బొగ్గు స్తంభించింది. నీరుని తోడేందుకు మొదట రబ్బరు పైపులు ఉప యోగించారు. వేడి నీటి ద్వారా అవి కుచించుకు పోయే అవకాశం ఉందని సింగరేణి యాజమాన్యం ఇనుప పైపులను ఏర్పాటు చేసింది. ఉబికి వస్తున్న నీటిని ఆపేందుకు ప్రయత్నాలు జరగడం లేదు. ప్రస్తుతం వేడి నీటిని తోడేందుకు సింగరేణి యాజమాన్యం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నది.



షార్ట్ సర్క్యూట్ టిప్పర్ దగ్ధం

- రూ.10లక్షలు నష్టం

నవతెలంగాణ-సత్తుపల్లి



అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఒకటి షార్ట్ సర్క్యూట్ జరిగి దగ్ధమైన ఘటన సత్తుపల్లి శివారు వెంగళరావునగర్ సమీపంలో గురువారం ఉదయం జరిగింది. మండలంలోని జగన్నాధపురం నుంచి సత్తుపల్లికి మట్టిని అక్రమంగా టిప్పర్ ద్వారా తీసుకొస్తున్న క్రమంలో పట్టణ శివారుకు రాగానే టిప్పర్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడి షార్ట్ సర్క్యూట్ అవడంతో మంటలు చెలరేగి ఇంజిన్‌తో పాటు క్యాబిన్ మొత్తానికి మంటలు వ్యాపించడంతో అప్రమత్తమైన డ్రైవర్ బాబూరావు వెంటనే సత్తుపల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాడు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఇంజిన్ దగ్ధమవడంతో టిప్పర్ యజమానికి సుమారుగా రూ. 10లక్షల వరకు నష్టం జరిగి ఉంటుందని అంచనా. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల వివరాలు సేకరించనున్న సర్వేయర్లు

- మున్సిపల్ చైర్మెన్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ఇల్లందు

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇళ్ల యాప్ అందుబాటులోకి వచ్చేసింది. సర్కార్ అందించే ఇళ్ల కోసం లబ్ధిదారులను ఈ యాప్ ద్వారా ఎంపిక చేస్తారు. ప్రజా పాలన కార్యక్రమంలో ఇల్లు లేవని అప్లై చేసిన ప్రతి ఇంటికి సర్వేయర్లు వస్తారని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపులో భాగంగా ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుదారుల ఇంటికి సర్వేయర్ వెళ్లి, అందులో ఆయా వివరాలు నమోదు చేస్తారు. సర్వేను గెజిటెట్ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారని తెలిపారు. వార్డుల్లో వార్డు అధికారి ద్వారా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. యాప్‌లో లబ్ధిదారుడి ముఖాన్ని గుర్తిస్తారు. ఇంటిని నిర్మించే స్థలానికి భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలను కూడా అందులో నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని ఏఐ ఆధారిత ఫొటోలు తీస్తారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, మున్సిపల్ కౌన్సిలర్లు నాగలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజనులకు రగ్గులు పంపిణీ

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని లార్డ్ జీసస్ గాస్పల్ మినిస్ట్రీస్ రిజిస్టర్డ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం బొజ్జి గుప్ప గ్రామానికి చెందిన పేద గిరిజనులకు గురువారం రగ్గులు పంపిణీ చేశారు. సుమారు 50 రగ్గులను మినిస్ట్రీ నిర్వాహకులు మాధవి లత, ముఖర్జీల చేతుల మీదుగా పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని డిసెంబర్ నెలలో గిరిజన ప్రాంతాల్లోని నిరుపేద కుటుంబాలకు సహాయం చేయటం అలవాటుగా లార్డ్ జీసస్ గాస్పెల్ మినిస్ట్రీస్ నిర్వాహకులు జడ మాధవి లత, జే విజి ముఖర్జీ దంపతులు దుమ్ముగూడెం మండలంలోని గిరిజన ప్రాంతమైన బొజ్జిగుప్ప గ్రామంలో సుమారు 50 మందికి శీతాకాలంలో చలి నుంచి కాపాడుకోవడానికి వారికి ఉచితముగా ఉలన్ రగ్గులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో వృద్ధురాలికి గాయాలు

నవతెలంగాణ-పినపాక

కందిరీగల దాడిలో వృద్ధురాలికి గాయాలైన ఘటన మండలంలోని జగ్గారం గ్రామంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. లక్ష్మీ అనే వృద్ధురాలు ఇంటి ముందు ఉండగా ఆకస్మాత్తుగా కందిరిగలు వచ్చి ముఖము శరీర భాగాల పైన దాడి చేశాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆ వృద్ధురాలిని పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వెంటనే స్పందించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు దుర్గా భవాని మెరుగైన వైద్యం అందించారు. వందలాది కందిరీగలు వృద్ధురాలి పై దాడి చేశాయని చికిత్స అందించినట్లుగా తెలిపారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన ఎంఈఓ నాగయ్య

నవతెలంగాణ-పినపాక



ప్రభుత్వ పాఠశాలల్లో హాస్టల్స్ లలో విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ నాగయ్య సూచించారు. గురువారం ఆయన కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఉదయం అందించే టిఫిన్, భోజనము మెనూ రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను అడిగి అందించే భోజన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు సలహాలు చేశారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీఆర్పిలు పాల్గొన్నారు.

విద్యార్థులు మెడిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రతి విద్యార్థి మెడిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని హార్ట్ ఫుల్ హెల్ప్ లైన్ భద్రాచలం డివిజన్ ప్రోగ్రాం ప్రెసిడెంట్ డి.బుజ్జి కృష్ణమ్మ రాజు విద్యార్థులకు సూచించారు. గురువారం హార్ట్ ఫుల్ ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ సెక్రటరీ ఆదేశాలతో విద్యార్థులకు హెల్ప్ ప్రోగ్రాం ఆర్గనైజేషన్ భద్రాచలం ప్రోగ్రామ్ ప్రెసెంట్ డి.బుజ్జి కృష్ణమ్మ రాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీతా మహాలక్ష్మి కళాశాల విద్యార్థులకు మానసిక ధైర్యం, రిలాక్సేషన్ అండ్ మెడిటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మల్లెల శ్రీనివాస్‌రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశపు మందిరంలో నిర్వహించిన సమావేశంలో పోలింగ్ బూత్‌ల ఏర్పాట్లపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఈదయ్య, తహసీల్దార్ మామిడి అశోక్ కుమార్‌తో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని సోంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం కొరకు నూతన భవనం నిర్మాణానికి తహశీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డిలు గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకంలో 20 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని వారు పేర్కొన్నారు. గ్రామంలో దగ్గరలో ప్రభుత్వ భూమి లేకపోవడంతో భవన నిర్మాణం చేపట్టకుండా నిలిచిపోయిందని తెలిపారు. 2018 సంవత్సరంలో సోంపల్లి పాఠశాలకు దగ్గరలో ఉన్న స్థలాన్ని గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులు విరాళాల ద్వారా సేకరించిన నగదుతో 23 కుంటల భూమిని కొనుగోలు గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువ చ్చారని వారు తెలిపారు. ఈభూమిలో కొంత స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి ఇవ్వడానికి గ్రామస్తులు ముందుకు వచ్చారని వారు తెలిపారు. ఈ స్థలానికి రోడ్డు మార్గం లేకపోవడంతో నడిపింటి వెంకటేశ్వర్లు, గోనె జయమ్మను సంప్రదించి ఇరువురు వారి సొంత స్థలాల నుండి రోడ్డు నిర్మాణం చేపట్టేం దుకు ముందుకు రావడంతో వారిని అభినం దించారు. అనంతరం త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలలో భాగంగా సోంపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. అదేవిధంగా గతంలో నిర్వహిం చిన ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్న ఇండ్లను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ నర సింహారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంక టేష్ ,బోరెం సంపత్ కుమార్, పండగ రాములు, ధనుగూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి సీఎం కప్

నవతెలంగాణ-తల్లాడ



డాన్ బోస్కో పాఠశాలలో నిర్వహించిన సీఎం కప్ 2024 మండల స్థాయి క్రీడలు గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రమౌళి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను పంపిణీ చేసి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృఢత్వాన్ని, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో నైపుణ్యం సాధించాలన్నారు. ఎంపీఓ శ్రీదేవి, పిఈటిలు ఏపీవో సిహెచ్ కోటయ్య క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ జితేష్ వీ. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మెనూ ఉత్తర్వులు జారీ చేయడంతో గురువారం పాల్వంచలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని బీసీ వసతి గృహ సంక్షేమ అధికారులు, బీసీ దివశక్తి గృహాల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిసి వసతిగృహంలో ఆహారం కలుషితం కాకుండా ఉండేందుకు పాడించవలసిన నియమాలను, త్రాగునీరు, పరిశుభ్రమైన ఆహారం కిచెన్ గార్డెన్, మునగా, చింత, కరివేపాకు, పనస, వెలగా, ఉసిరి వేయాలని సూచించారు. కిచెన్ పరిశుభ్రత ఆహార ధాన్యాల నిల్వ విద్యార్థులతో ఫుడ్ సేఫ్టీ కమిటీలు పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేకమైన దృష్టి పెట్టారని చెప్పారు. విద్యార్థులకు కౌంట్ డౌన్ చార్ట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సమయ నిర్దేశం చేయాలని గత సంవత్సరం 2023 2024లో 96% ఉత్తీర్ణ సాధించాలని చెప్పారు. 2024-25 విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా ట్యూషన్స్‌తో మెలకువలు కలిగే ఉత్త సాధించుటకు కృషి చేయాలని సూచించారు జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ నిర్వహించామని విద్యార్థులకు కావాల్సిన స్పోర్ట్స్ మెటీరియల్ అందిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఈ ఇందిరా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతుల నిరసన

- సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే జారే ఆదేశం
- కొనుగోలు చేస్తాం అని తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్ హామీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

నారాయణపురం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో పట్టా భూమి కలిగిన రైతులు పండించిన వరి ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తుండటంతో ఆసుపాక రెవిన్యూ గ్రామానికి చెందిన రైతులు పలువురు వినాయకపురం-వేలేరుపాడు రహదారిలో నారాయణపురం సమీపంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 80 శాతం రైతులకు భూములు ఉన్నా 1/70 యాక్ట్ కారణంగా పట్టా పొందలేక పోయామని, దీంతో ఈ కారణం చేత మేము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే మా పరిస్థితి ఏంటని ప్రభుత్వ అధికారులను వేడుకున్నారు. ఏటువంటి షరతులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెంటనే స్పందించి సంబంధించిన అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి శివరాంప్రసాద్ విధినిర్వహణలో భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఉండటంతో తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ నారాయణపురం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వ్యవసాయశాఖ స్థానిక అధికారులు ద్వారా సమాచారం తెలుసుకున్న ఆయన పట్టా పాస్ పుస్తకాలు లేకపోయినా రైతులు ఆందోళన పడవద్దని ఆధార్ కార్డు, వ్యవసాయ భూమికి సంబంధించిన ఏదో ఒక ఆధారం ఉన్న వరి ధాన్యం కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులను తహశీల్దార్ కృష్ణ ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు జక్కుల రాంబాబు, రాయగిరి మల్లేశ్వరరావు, చందా లక్ష్మీ నరసయ్య, మిండ పెద్ద దుర్గారావు, బల్లెం గంగరాజు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

- ముమ్మరంగా వాల్ రైటింగ్
- ప్రజా పోరాటాలకు దిక్సూచి
- జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి

నవతెలంగాణ-ఇల్లందు



ఈనెల 20, 21న ఇల్లందులో నిర్వహించనున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని వివిధ కూడళ్ళలో గురువారం వాల్ రైటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ అనునిత్యం ప్రజా సమస్యలపై ప్రజా ఉద్యమాలను నిర్వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టడంలో సీపీఐ(ఎం) అగ్రభాగాన నిలుస్తోందన్నారు. పెరుగుతున్న ధరలను అరికట్టడంలో, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి, మహిళలకు రక్షణ కల్పించడంలో మోడీ నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే పార్టీ మహాసభల్లో ఈ కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని రాబోయే కాలంలో నిర్వహించాల్సిన ప్రజా పోరాటాలకు రూపకల్పన చేసేందుకు జిల్లా మూడో మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని తెలిపారు.

వసతి గృహంలో పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పన

- ఆహారం నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



వసతి గృహంలో ఉండి చదివే పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నయా బజార్‌లోని వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహానికి ఉన్న అత్యవసర అంశాలపై నివేదిక అందించాలని వసతి గృహ వార్డెన్ సైదులుకు సూచించారు. 10 రోజులలో పూర్తి చేసే మరమ్మత్తులు, దోమల తెర, పెయింటింగ్ మొదలగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన బ్లాంకెట్, ఇతర పరికరాలు వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత లోపాలు ఎవైనా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది ఉండదని, వసతి గృహానికి వస్తున్న బియ్యం నాణ్యత అంశంలోనూ రాజీ పడవద్దని అన్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలి

ఖమ్మంకార్పొరేషన్ : నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు విద్యార్థులు నిర్విరామంగా కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం నయా బజార్ జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లో రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు అందించిన వరద సహాయక కార్యక్రమాల్లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. మున్నేరు వరదల్లో సర్వసం కోల్పోయిన విద్యా సంస్థలకు 3 లక్షలా 87 వేలా 600 రూపాయలతో చేసిన ప్రహరీ గోడల నిర్మాణం, మరుగుదొడ్ల మరమ్మత్తులు, ల్యాబ్ నెలకొల్పుట, కోల్పోయిన ఫర్నిచర్ తిరిగి ఆయా సంస్థలకు అందించుట, వంట సామాన్లు, డ్యూయల్ డెస్క్‌లు అందించుట వంటి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్, రోటరీ క్లబ్ గవర్నర్ కే. శరత్ చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో మల్లాది వాసుదేవ్, పి.సాంబశివరావు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు విసిరెడ్డి బాల కోటిరెడ్డి, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్స్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలి

ఖమ్మం : మన ఆరోగ్యాన్ని మనమే సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయం ఆవరణలో ఆటో డ్రైవర్లకు జరుగుతున్న ప్రత్యేక హెల్త్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ లు ఒత్తిడి తగ్గించుకునేందుకు ఒక బ్యాచ్ యోగా తరగతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, జనవరి లోపు వారానికి 3 యోగా క్లాస్‌లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆటో రిక్షా కార్మికులకు ఖమ్మం జిల్లాలో ప్రత్యేకంగా 2 రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, నగరంలో శ్రీ భక్త రామదాసు కళా క్షేత్రం, నయా బజార్ హై స్కూల్ గ్రౌండ్, స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో వైద్య శిబిరాలు జరుగుతున్నాయని, ఆటో కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఆర్టీఓ నర్సింహారావు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లంపాడులో పర్యటించిన ఎస్సీ వర్గీకరణ కమిషన్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ మండల పరిధిలోని తల్లంపాడులో గురువారం పర్యటించారు.ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు ఖమ్మం వచ్చిన జస్టిస్ షమీమ్ అక్తర్ తిరిగి హైదరాబాద్ వెళ్తూ మార్గమధ్యలో తల్లంపాడులో ఆగి స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు.ఎస్సీ కాలనీల్లో కూడలి ప్రదేశంలో ఆగి స్థానికులతో మాట్లాడారు. వారి ఆర్థికస్థితి, భూములు, విద్య, ఉద్యోగం, పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. మాదిగ, మాల కాలనీల్లోనూ పర్యటించి వివరాలు సేకరించారు. కొంత మంది తమకు ఎటువంటి ఉద్యోగం లేదని, భూములు లేవని కూలీ పనులకు వెళ్తున్నట్లు కమిషన్ ముందు వాపోయారు.తమ పిల్లలు గురుకులాల్లో విద్యను అభ్యసిస్తున్న విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారి సత్యనారాయణ, సాంఘిక సంక్షేమశాఖ ఖమ్మం డివిజన్ సహాయాధికారి ఎంఏ.రవూఫ్, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు రోజువారి రిపోర్ట్స్ వెంటనే పంపించాలి : ఎంఈఓ

నవతెలంగాణ-బోనకల్



ఎంఆర్‌సి సిబ్బంది, సిఆర్‌పిలు సమ్మెలో ఉన్నందువలన మండలం లోని అన్ని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం 11 గంటలకల్లా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు సంబంధించి నేరుగా ప్రధానోపాధ్యాయులే తనకు పంపించాలని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన లింకును గ్రూపులో షేర్ చేసినట్లు ఆయన తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వాటికి సంబంధించిన వివరాలు తనకు పంపించకపోతే మధ్యాహ్న భోజన బిల్లులు గాని, విద్యార్థులకు సంబంధించిన ప్రొవిషన్స్ మంజూరు కావని ఆయన తెలిపారు. దీనికి ప్రధానోపాధ్యాయులు మాత్రమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అదే విధంగా యుడిఐఎస్ఈ, రిపోర్ట్స్ కూడా కొన్ని పాఠశాలలు పంపించలేదని వాటిని కూడా శుక్రవారం మధ్యాహ్నం కల్లా వెంటనే పంపించాలని ఆయన కోరారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నాం

- సత్తుపల్లి మాల మహానాడు సంఘ బాధ్యులు
- ఏకసభ్య కమిషన్ ఛైర్మెన్‌కు సత్తుపల్లి మాలమహానాడు

నవతెలంగాణ-సత్తుపల్లి

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు గురువారం ఖమ్మం వచ్చిన ఏకసభ్య కమిషన్ ఛైర్మెన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు సత్తుపల్లి మాల మహానాడు బృందం తేల్చి చెప్పింది. ఏబీసీడీ వర్గీకరణను శాస్త్రీయ బద్ధంగా చేపట్టాలని కమిషన్ ఛైర్మెన్‌ను కోరారు. అలాగే జనాభా లెక్కలను కూడా తేల్చి వర్గీకరణను ఆమోదమోగ్యంగా చేపట్టాలని కోరారు. ఏకసభ్య కమిషన్ షమీమ్ అక్తర్‌ను కలిసిన వారిలో సత్తుపల్లి మాల మహానాడు నాయకులు పిల్లి మల్లికార్జున్, పిల్లి వెంకటేశ్వరరావు, పప్పుల లక్ష్మీనారాయణ, కనిపెడ సుదర్శన్ (అడ్వకేట్) పాల్గొన్నారు.

సీఎం కప్ విజేతలకు బహుమతులు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. మూడు రోజులుగా కారేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, పరుగు పందెలను నిర్వహించారు. ఈక్రీడలలో విజేతలకు ఎంపీడీవో జీ.సురేందర్, తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్, ఎంఈవో జయరాజు, ఎంపీడీవో సూపర్నిటెండెంట్ రమేష్‌లు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రతిభను వెలికి తీయటానికి ప్రభుత్వం ఈ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. క్రీడలు ద్వారా క్రమశిక్షణ అవర్చుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్.కృష్ణయ్య, సరస్వతి, బాబు, రామారావు, సీతారాం, మోసా తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు ఉపకార వేతనాలు ప్రభుత్వం ప్రకటించాలి

- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దయానంద్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-సత్తుపల్లి

మరికొద్ది రోజుల్లో క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే క్రిస్మస్ రోజున చర్చి పాస్టర్లకు ప్రభుత్వం ఉపకార వేతనాలను ప్రకటిస్తూ తీపి కబురును అందించాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) పొలిటికల్ వింగ్ జాతీయ అధ్యక్షుడు అలవాల కరుణాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పాస్టర్లకు ఉపకార వేతనాలను ప్రకటించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా కృషి చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌కు కరుణాకర్ నేతృత్వంలో ఎన్‌సీసీ రాష్ట్ర, జిల్లా నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర కార్యదర్శి గుర్రాల సత్యానందం, జిల్లా అధ్యక్షుడు సంగసాని శ్రీనివాస్, నియోజకవర్గ అధ్యక్షుడు జాన్‌మార్క్, ప్రేయర్ వింగ్ అధ్యక్షుడు ఎబినేజర్‌తో పాటు ఐదు మండలాల ఎన్‌సీసీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో అన్ని కులాలకు న్యాయం జరగాలి

నవతెలంగాణ- ఖమ్మం

వర్గీకరణతో ఎస్సీలోని అన్ని కులాలకు న్యాయం జరగాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ అన్నారు. గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ప్రతిష్టంగా అమలు పరిచేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసి జిల్లాల వారీగా దళిత సంఘాలు, మేధావుల నుండి సలహాలు, సూచనలు స్వీకరించడం అభినందనీయమన్నారు. ఎస్సీ వర్గీకరణపై అధ్యయన కోసం ఖమ్మంకు వచ్చిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు వివిధ అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. విలేకరుల సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కస్తాల క్రాంతి కుమార్, ఖమ్మం జిల్లా ఎస్సీ సెల్ నాయకులు తోళ్ల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తూతు మంత్రంగా గ్రామీణ క్రీడలు

నవతెలంగాణ-వేంసూరు

తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడలు మండల కేంద్రంలో తూతూ మంత్రంగా నిర్వహించారని ప్రచారం జరుగుతుంది. గ్రామస్థాయిలో గ్రామీణ క్రీడలను గుర్తించి రిజిస్ట్రేషన్ చేయించడంలో పంచాయతీ శాఖ పూర్తిగా విఫలమవడం వలన ప్రచారం లేక క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనే అర్హత కోల్పోయారు. మరి కొంతమంది వచ్చినప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సమాచారం తెలియక వెనుదిరిగి పోయారు. కుంచపర్తి పరిధిలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల భవనం లేక కుప్పెనకుంటలో నిర్వహిస్తున్నారు ఆ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చినప్పటికీ అవకాశం ఇవ్వకపోవడంతో కొంతమంది విద్యార్థులు వెన్ను తిరిగి వెళ్లారు. గురువారం నిర్వహించిన క్రీడలలో 8 పాఠశాలలకు చెందిన ఎనిమిది జట్లు హాజరయ్యారు. వీరిలో కబడ్డీ, కోకో నిర్వహించగా వాలీబాల్‌తో పాటు మరికొన్ని నిర్వహించలేదు అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారనే ప్రచారం జరుగుతుంది.

హైదరాబాద్ వెళ్తున్న అంగన్వాడీలు అరెస్టు

- అరెస్టును ఖండించిన సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-సత్తుపల్లి



సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుతంగా గురువారం హైదరాబాద్ తరలి వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐటీయూ అనుబంధ సంఘంగా ఉన్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ సంఘ నాయకురాళ్లు అయిన సత్తుపల్లి ప్రాజెక్టు అధ్యక్షురాలు పెరిక ఉదయశ్రీ, సంఘ సభ్యులు నాగేంద్ర, రామేశ్వరి, నాగలక్ష్మిలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు కొలికపోగు సర్వేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఐసీడీఎస్ ప్రారంభమై 48 యేండ్లు అవుతున్నా ప్రభుత్వ పరిధిలో ఉన్న సమస్యలను సైతం పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్ వెళ్లి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అంగన్వాడీలు శాంతియుతంగా కార్యక్రమాన్ని చేపట్టినా వారిని నిర్బంధించడం శోచనీయమని సర్వేశ్వరరావు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, ఇతర సమస్యలు పరిష్కరించాలని సర్వేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సీఎం కప్ మండల స్థాయి క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



సీఎం కప్ మండల స్థాయి క్రీడలు మండల పరిధిలో గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథ్ బాబు, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి క్రీడలను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలు, వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కబడ్డీలో ప్రథమ స్థానం గూడురుపాడు, ద్వితీయస్థానం గుదిమళ్ల, వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం ముత్తగూడెం, ద్వితీయ స్థానం గుదిమళ్ల, ఖో ఖో క్రీడల్లో ప్రథమ స్థానం పెద్దవెంకటగిరి, ద్వితీయ స్థానం ముత్తగూడెం దక్కించుకున్నాయి. శుక్రవారం బాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

- యాసంగిలో ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించే బాధ్యత నాదే : ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- లింగాలఘనపురంలో 108 అంబులెన్స్ ప్రారంభం



నవతెలంగాణ-లింగాలఘనపురం

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెలే కడియం శ్రీహరి అన్నారు. యాసంగిలో ప్రతి ఎకరాకి గోదావరి జలాలను అందించే బాధ్యత తనదేనని, దానికి సంబంధించిన పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. గురువారం జనగామ జిల్లా లింగాల ఘనపురంలోని పీహెచ్‌సీకి మంజూరైన నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే కడియం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు అంబులెన్స్ సేవలు వినియోగమవుతాయని తెలిపారు. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిష్ణాతులైన వైద్యులను నియమించారని తెలిపారు. ప్రతి పీహెచ్‌సీలో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ప్రజలకు కావలసిన మందులు ప్రత్యేకించి మెయిల్, ఫిమేల్ వార్డులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడానికి త్వరలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించబోతున్నట్టు చెప్పారు. ఆర్టీసీ ఆధీనంలో ఉన్న నాలుగు ఎకరాల భూమిని ఆస్పత్రికి కేటాయించాలని సీఎంను కోరగా మంజూరు చేసినట్టు తెలిపారు. వంద పడకల ఆస్పత్రి అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలోని పేద ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని త్వరలో మరో మూడు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, మార్కెట్ వైస్ చైర్మెన్ గుడి వంశీధర్ రెడ్డి, జీడికల్ దేవస్థానం చైర్మెన్ మూర్తి, డైరెక్టర్ శ్రీలత రాజారవీందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, జిల్లా వైద్య అధికారులు, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ జలంధర్ రెడ్డి, ఎంపీఓ రాఘురామకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్ చెరువు కబ్జాలపై హైడ్రా ఫోకస్

- చెరువులోని ఫంక్షన్ హాల్‌ను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లాలోని జంట జలాశయమైన హిమాయత్‌సాగర్ చెరువుపై హైడ్రా ఫోకస్ పెట్టింది. గురువారం హిమాయత్‌సాగర్ చెరువు ప్రాంతాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. హిమాయత్ సాగర్ చెరువు స్థలంలో ఓ వ్యక్తి ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేశారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామ పరిధిలోని హిమాయత్‌సాగర్ చెరువు స్థలంలో అక్రమంగా మట్టి పోసి పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయాలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దాంతో హైడ్రా కమిషనర్ కబ్జాకు గురైన స్థలంతోపాటు ఫంక్షన్‌హాల్ నిర్మించిన స్థలాన్ని పరిశీలించారు. వీటిపై పూర్తి నివేదిక అందించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో గండిపేట్, శంషాబాద్ మండలాల రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

22న 'కాకతీ కదన భేరి'

- పోస్టర్ ఆవిష్కరించిన సీపీఎస్ యూనియన్ : రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్



నవతెలంగాణ-వరంగల్

తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 22న వరంగల్‌లో జరగనున్న 'కాకతీ కదన భేరి' కార్యక్రమం పోస్టర్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్.. రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.. 1 ఏప్రిల్ 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ డిసెంబర్ 22న ఉద్యోగ, ఉపాధ్యాయులతో వరంగల్ జిల్లా కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఈ ఏకీకృత పెన్షన్ విధానం.. కార్పొరేట్ల కడుపు నింపడానికి వచ్చిందే తప్ప, ఉద్యోగి కుటుంబానికి సామాజిక భద్రత చేకూర్చే పథకం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జీవన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మల్లికార్జున్, అఫ్జల్, కొండ శ్రీనివాస్, లక్ష్మమ్మూర్తి, రవీందర్ రెడ్డి, దిల్షాన్, శివ కోటి, రాజేందర్, నర్సమ్మ, సరళ రాణి, అశ్విని, రాజు తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులకు బేడీలు దుర్మార్గం

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల దుర్మార్గంగా ప్రవర్తిస్తుందనడానికి ఉదహరణ ఇవాళ రైతుకు బేడీలు వేయడమేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. లగచర్ల రైతులను జైళ్లో పెట్టడమే కాకుండా గుండెనొప్పితో బాధపడుతున్న రైతును ఆస్పత్రికి బేడీలు వేసుకుని తీసుకెళ్లడం అన్యాయమని తెలిపారు. రైతులు ఏమైనా ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రైతు రాజ్యం తెస్తామన్న రేవంత్ రెడ్డి.. ఇవాళ్టి ఘటనతో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు సీఎం రేవంత్ రెడ్డి నాటకం ఆడుతున్నారని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఖమ్మం జిల్లా రైతులకు బేడీలు వేసి జైలులో పెట్టిందనీ, ఆ ప్రభుత్వానికీ, కాంగ్రెస్ సర్కారుకు తేడా లేదని పేర్కొన్నారు. దీనిపై మానవ హక్కుల సంఘాలు స్పందించాలని కోరారు.

వికారాబాద్‌లో మాజీ మహిళా మంత్రుల అరెస్టు

ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినుల పరామర్శకు వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు

- చంగముల్ పీఎస్‌కు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్
- పోలీస్ స్టేషన్‌లోకి మీడియాను అనుమతించని పోలీసులు
- నవాబుపేట పీఎస్‌కు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్
- అవసరమైతే మీడియాను కూడా అరెస్ట్ చేస్తారేమో..? : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- అరెస్టులకు భయపడేది లేదని స్పష్టీకరణ





నవతెలంగాణ-పూడూర్, వికారాబాద్ కలెక్టరేట్, తాండూర్

వికారాబాద్ జిల్లా తాండూరు గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మహిళా మంత్రులు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం గిరిజన హాస్టల్‌లో 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరిని పరామర్శించడానికి గురువారం బీఆర్ఎస్ నేతలు వెళ్లగా.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లిలో (హైదరాబాద్-తాండూర్ రహదారిపై) మర్రి చెన్నారెడ్డి విగ్రహం దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. హాస్టల్ దగ్గరకు వెళ్ళడానికి అనుమతి లేదని నిరాకరించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తమను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైటాయించారు. దాంతో పోలీసులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను అరెస్టు చేసి చంగముల్ పీఎస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్‌తోపాటు మరికొందరిని నవాబుపేట పీఎస్‌కు తరలించారు.

చంగముల్ పీఎస్ వద్ద హైడ్రామా..

అరెస్ట్ చేసిన సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌ను పూడూరు మండలం చంగముల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరిని తీసుకొస్తున్నారన్న విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారందరినీ బయటకు పంపించి, పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి గేట్లు మూసివేశారు. మాజీ మహిళా మంత్రులు పీఎస్‌కు రాగానే అక్కడున్న పత్రికా విలేకరులు ఫొటోలు తీస్తుండగా పోలీసులు మీడియాకు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దాంతో విలేకరులు పోలీసులను నిలదీశారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టును కవర్ చేయాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పడంతో అక్కడే ఉన్న సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ.. 'అవసరమైతే మీడియాను కూడా అరెస్టు చేస్తారేమో.. జాగ్రత్తగా ఉండండి' అని చెప్పి పీఎస్ లోపలికి వెళ్లిపోయారు. కొద్దిసేపు పోలీస్ స్టేషన్‌లో వారిని కూర్చోబెట్టి వదిలేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మాట్లాడుతూ.. తాము హాస్టల్ దగ్గరకు వెళ్తే మీ బండారం బయటపడుతుందని భయపడుతున్నారా.. అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఈమధ్య గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగడం వెనక ప్రభుత్వ వైఫల్యం ఉందన్నారు. విద్యార్థినులకు హాస్టల్‌లోనే వైద్యం చేయడం ఏంటనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. పిల్లల విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం తమకు లేదని తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు బీఆర్ఎస్ పార్టీ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కారణం అంటూ నింద మోపడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న మమ్మల్ని పోలీసులు అనవసరంగా అడ్డుకొని ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

తాండూర్ కోర్టులో బీఆర్ఎస్ లీగల్ సెల్ పిటిషన్

ఫుడ్ పాయిజన్ ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు తాండూరు న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఘటనపై లీగల్ సెల్ నాయకులు కె.గోపాల్, నరుకుల నరేందర్‌గౌడ్ తాండూర్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని బాధలను న్యాయమూర్తికి వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని పిటిషన్‌లో కోరినట్టు న్యాయవాదులు తెలిపారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికే రాష్ట్రం అప్పుల పాలైందని కాంగ్రెస్ ప్రచారం

ఆర్‌బిఐ రిపోర్టు సీఎం రేవంత్‌కు చెంపపెట్టు : మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

నవతెలంగాణ-సిద్దిపేట

తాము ఇచ్చిన హామీలను అమలు చేయలేక, రాష్ట్రం అప్పుల పాలైందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, తెలంగాణ దివాళా తీసిన రాష్ట్రం కాదని, దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రమని ఆర్‌బీఐ రిపోర్టు తేల్చి చెప్పిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్దాల పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలను ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నదన్నారు. నిజాన్ని అబద్దంగా మార్చేందుకు కాంగ్రెస్ గ్లోబల్స్ ప్రచారం చేసిందన్నారు.



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదికతో పదేండ్ల తెలంగాణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై కాంగ్రెస్ మంత్రులు, సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నది దుష్ప్రచారమేనని తేలిపోయిందన్నారు. కేసీఆర్ సంపదను సృష్టించి పేదలకు పంచారన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ ప్రతి రంగాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని ఆర్బీఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024 నివేదికలోని గణాంకాలు కండ్లకు కట్టినట్టు చెప్తున్నాయని తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో జీఎస్డీపీ, తలసరి ఆదాయం, విద్యుత్తు, సాగు విస్తీర్ణం, వ్యవసాయం, అటవీ విస్తీర్ణం, మూలధన వ్యయం, ఉపాధి అవకాశాలు ఇలా అన్నింటా తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ అప్పుల కుప్ప అని రాష్ట్ర పరపతిని, పరువును దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ మొత్తం అప్పులు రూ. 7 లక్షల కోట్లకు చేరాయన్న రేవంత్ ప్రభుత్వ ప్రకటన వాస్తవదూరమని రుజువైందన్నారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ. 72,658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,22,499.20 కోట్లకు చేరినట్టు ఆర్బీఐ వెల్లడించిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిమే ఈ అప్పు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రం పరిస్థితి ఎట్లా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ఆర్బీఐ కళ్ళు తెరిపించేలా చెప్పిందన్నారు.

దేవాలయాలను కట్టడానికి రూ. 2,800 కోట్లు, రైతు బంధుకు రూ. 72,972 కోట్లు, రైతు బీమా రూ. 6,800 కోట్లు, రైతు రుణమాఫీ రూ. 29 వేల కోట్లు, ఉచిత కరెంట్‌కు రూ. 61వేల కోట్లు, గొర్రెల పంపిణీకి రూ. 5 వేల కోట్లు, ఆసరా పింఛన్లకు రూ. 61 వేల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. అలాగే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం, పటిష్టమైన భద్రత కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, వెయ్యికి పైగా గురుకులాలు బీఆర్ఎస్ పాలనలోనే ఏర్పడ్డాయన్నారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్రంపై దుష్ప్రచారాలు మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు రాజనర్సు, సంపత్ రెడ్డి, మోయిజ్, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. గురువారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకూ పేస్కేల్ వర్తింపజేయాలనీ, ఆరోగ్యబీమా రూ.10 లక్షల సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రిటైరైన ఉద్యోగులకు రూ.25 లక్షలు బెనిఫిట్స్ కింద ఇవ్వాలనీ, ప్రభుత్వ విద్యా శాఖ నియామకాల్లో వారికి వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగులతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ వారి సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమస్య జఠిలం కాక ముందే రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెకు రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

కొట్టినందుకు చింతిస్తున్నా..

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు ఆలోచించాలి. నా ఇంట్లోకి దూసుకొచ్చే వారు మీడియా వారా? ఇంకా వేరే ఎవరైనానా అనే విషయం నాకు తెలియదు. మీడియాను అడ్డు పెట్టుకుని నాపై దాడి చేయాలని ఎవరైనా అనుకోవచ్చు. చీకట్లో జరిగిన ఘర్షణ కావడంతో నేను కొట్టిన దెబ్బ అతడికి తగిలింది. ఆ మీడియా ప్రతినిధి తనకు తమ్ముడిలాంటి వాడు. అతని కుటుంబ సభ్యుల గురించి నేను చాలా ఆలోచించాను. కానీ నా బాధ గురించి ఎవరూ ఆలోచించలేదు. నేను సినిమాల్లో నటిస్తాను తప్ప నిజ జీవతంలో నటించను. ఎప్పుడూ నీతిగా, ధర్మంగా, నిజాయితీగా బతకాలి అన్నదే నా ఆలోచన. గేటు బయట నేను మీడియా వారిపై అసభ్యంగా ప్రవర్తించి ఉంటే, కొట్టి ఉంటే కచ్చితంగా నాపై 50 లేదా 100 కేసులు పెట్టుకోవచ్చు. లేకపోతే నేనే వెళ్లి పోలీసులకు లొంగిపోయేవాడిని. కానీ జర్నలిస్టులు నా కాంపౌండ్‌లోకి వచ్చి నా ప్రశాంతతను చెడగొట్టారు. మేము ప్రస్తుతం ఉన్న విషయాల గురించి కుర్చుని మాట్లాడుకుంటాం. ఏదో ఒక రోజు మా మధ్య ఉన్న విభేదాలు అన్నీ తొలగిపోతాయని నమ్మకంగా ఉన్నాను. జర్నలిస్ట్‌ను కొట్టడం తప్పే అయినా నేను ఆ పని ఏ పరిస్థితుల్లో చేశానో కాస్త అర్థం చేసుకోండి. మీడియా ప్రతినిధిని కొట్టినందుకు చింతిస్తున్నాను. నేను కొట్టింది వాస్తవమే, అప్పుడున్న పరిస్థితుల గురించి అంతా ఆలోచించాలి.మీ ఇంట్లో ఎవరైనా దూరితే... మీ ఏకాగ్రతను భగ్నం చేస్తే అంగీకరిస్తారా? న్యాయాధిపతులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, వ్యాపారస్తులు, మీడియా ప్రతినిధులు దీనిపై ఆలోచించాలి. మీకు టీవీలు ఉన్నాయి.. మాకు టీవీలు (చానళ్లు) లేవు.. రేపు నేను కూడా టీవీ పెట్టొచ్చు.. అది కాదు గొప్ప.. కానీ మీడియా ప్రతినిధి మనసును గాయపర్చినందుకు చింతిస్తున్నాను. పోలీసులు అంటే నాకు ఇష్టం. మా విశ్వవిద్యాలయం నుంచి ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు అయ్యారు. వారికి మా విద్యాసంస్థల నుంచి న్యాయం, ధర్మం నేర్పించాను. మా విద్యాసంస్థల నుంచి వెళ్లి ఉద్యోగం చేస్తున్న వారు న్యాయంగా ఉన్నారు కానీ ఇక్కడ మాత్రం పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. నేను చేసింది న్యాయమా? అన్యాయమా? ప్రజలే ఆలోచించాలి. నేను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాను. కానీ అన్నీ మరిచిపోయి నేను కొట్టిన విషయమే మాట్లాడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఇదిలా ఉండగా జర్నలిస్టుపై దాడి ఘటనకు సంబంధించి మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అయనపై తొలుత బీఎన్ఎస్ 118(1) సెక్షన్ కింద కేసు నమోదైంది. తాజాగా లీగల్ ఒపీనియన్ తీసుకున్న పోలీసులు 109 సెక్షన్ కింద హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు బాధాకరం

శిల్పి, చిత్రకారుడు ఎంవీ రమణా రెడ్డి

నవతెలంగాణ-సిద్ధిపేట

నూతన తెలంగాణ తల్లి విగ్రహం నిర్మాణానికి ఈ నాటికీ ఒక్క రూపాయి కూడా అడ్వాన్స్ తీసుకోలేదని, ప్రభుత్వ కాంట్రాక్టు పనులకు అడ్వాన్స్‌లు కూడా ఉండవనే విషయం సిధారెడ్డికి తెలియదా అని, డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు బాధాకరమని శిల్పి, చిత్రకారుడు ఎంవీ రమణా రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ రకమైన ప్రెస్‌మీట్ పెట్టాల్సిరావడం చాలా బాధాకరమని, ఆత్మగౌరవంతో బతికే కళాకారునిగా, కళనే నమ్ముకొని, కళకోసం పరితపించి, ఈ ప్రాంత గౌరవాన్ని, ఖ్యాతిని ప్రపంచానికి చాటి, రాజకీయాలకు అతీతంగా తనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు వెళ్తున్నానన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనవంతు క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ఎన్నో ఆర్ట్ క్యాంపులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నో పోస్టర్లు, డిజైన్లు, లోగోలు వేసానని, తొలి ఆర్ట్ క్యాంపు సిద్దిపేటలోనే మొదలైందని అన్నారు. చిన్ననాటి నుంచి తనను దగ్గరగా చూసి కూడా నందిని సిధారెడ్డి నూతన తెలంగాణ తల్లి రూపశిల్పులపై అభాండాలు మోపడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాను ప్రభుత్వ సంస్థలకు చేసిన నాలుగైదు పనుల్లో నేటికీ బిల్లులు విడుదల కాలేదన్నారు.



ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఈ ప్రాంతానికి చెందిన నాయకులు ఏ ఒక్కరూ సహాయం చేయలేదని, పైగా కోట్లు తిన్నారనడం సిగ్గుచేటన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు తెలంగాణ తొలి శకటాన్ని (బోనాలు) డిజైన్ చేసిన దానికిగాను నేటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని, గ్రామజ్యోతి లోగో డిజైన్‌కు నేటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని, సిధారెడ్డి చైర్మన్‌గా వ్యవహరించిన తెలంగాణ సాహిత్య అకాడమీ లోగోకు కూడా ఒక పెద్దమనిషికి రూ.50వేలు ఇస్తేగాని బిల్లు రాలేదని తెలిపారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మను కాంగ్రెస్ అవహేళన చేస్తోంది

- తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిన బతుకమ్మ పండుగను కాంగ్రెస్ అవహేళన చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ నేతలు సంజీవ్ నాయక్, పల్లయ్య కురువతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బతుకమ్మపై కనీస అవగాహన లేని కాంగ్రెస్ నాయకులు నోరుజారుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరలు అడిగినందుకు పండుగేలేదనే విధంగా ఆ పార్టీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కించపరిచే మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు బతుకమ్మ ఆడుతూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారనీ, నేడు అదే పండుగ పట్ల అనుచితంగా మాట్లాడడం వారికే చెల్లిందని విమర్శించారు. గద్దెనెక్కేందుకు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్, నేడు వాటిని అమలు చేయలేక, సమస్యలు సృష్టిస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తుస్తోందని విమర్శించారు. స్వరాష్ట్ర ఉద్యమ స్ఫూర్తితో ఆవిష్కరించుకున్న తెలంగాణ తల్లిని మార్చి ద్రోహం చేశారని వ్యాఖ్యానించారు. హస్తం గుర్తు చూపెడుతున్న విగ్రహం తెలంగాణ తల్లి ఎలా అవుతుందని ప్రశ్నించారు. బతుకమ్మను కించపర్చిన కాంగ్రెస్ తెలంగాణ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

తెలంగాణ రాష్ట ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

వాతావరణం మార్పులకనుగుణంగా పంటలకు సోకే చీడపీడల నివారణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్‌ప్లాంట్ పాథాలజీ అండ్ ఇన్నోవేటివ్ అప్రో చెస్ ఇన్ ప్లాంట్ డిసీజ్ మేనేజ్‌మెంట్' అంశంపై రెండు రోజులపాటు జరగనున్న జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఇండియన్ ఫైటో పాథలాజికల్ సొసైటీ, దక్కన్ సొసైటీ ఆఫ్ ప్లాంట్ ఫాథాలజీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో



చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన కృత్రిమ మేధ, మిషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలను సస్యరక్షణలో వినియోగించుకోవాలని సూచించారు. ఆహార, పోషణ, భద్రత కల్పించడంలోనూ వ్యవసాయ శాస్త్రవేత్తలు తమ వంతు కృషి చేయాలన్నారు. ప్లాంట్ పాథలజిస్టులే మొక్కల డాక్టర్లని కొనియాడారు.

కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రాజిరెడ్డి మాట్లాడుతూ.. పంటకోత అనంతర నష్టాలను తగ్గించడంపై ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్తలు దృష్టి నిలపాలని సూచించారు. మల్టీ డిసిప్లినరీ అప్రోచ్ ప్రస్తుత అవసరమని చెప్పారు. పర్యావరణ సమతుల్యతలు పాటించాలన్నారు. అలాగే తాడేపల్లిగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ గోపాల్, గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి ప్రసంగించారు. ఈ రెండు రోజుల సదస్సు ముఖ్య ఉద్దేశాలను, చేపట్టనున్న ప్రధాన చర్చల గురించిన నివేదికను ఇండియన్ ఫైటో ప్లాంట్ ఫాథాలాజికల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ విద్యాసాగర్ వివరించారు. డాక్టర్ జి.రాజేష్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 150 మంది ప్లాంట్ పాథాలజీ విభాగం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చకుంట్ల పదాన్ని తొలగించాలి

- బీసీ కమిషన్‌కు వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ సామాజిక తరగతిలో ఉన్న కొన్ని పదాలను తొలగించాలని దొమ్మర, వంశరాజ్, తమ్మలి కుల సంఘాల ప్రతినిధులు రాష్ట్ర బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోఆ చైర్మెన్‌ను ఆయా సంఘాల నేతలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దొమ్మర సామాజిక తరగతికి చెందిన వారు తమ కులం పేరును గడ వంశీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. వంశరాజ్ కులం వారు తమ కులం పేరులో నుంచి పిచ్చగుంట్ల అనే పదాన్ని తొలగించాలని కోరారు.తమ్మలి కులం నుంచి నాన్ బ్రాహ్మిణ్, శూద్రా కుల పదాలను తొలగించాలని కోరారు. ఈ పదాలతో తాము సమాజంలో అనేక అవమానాలను ఎదుర్కొంటున్నామనిఆరే రాములు , మురళి కృష్ణ , వట పత్ర సాయి ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం స్వీకరించిన వారిలో కమిషన్ చైర్మెన్ నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్ , తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి తొలగింపు ఆలోచన విరమించాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లను విధుల నుంచి తొలగించాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవేళ ప్రభుత్వం గనుక ఆశా వర్కర్లను విధుల నుంచి తొలగిస్తే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ, తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశావర్కర్లు కోరుతున్నారని తెలిపారు. అయితే ఆందోళ న చేస్తున్న ఆశా వర్కర్లను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తమ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉందని పేర్కొన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

(మొదటిపేజీ తరువాయి)

దేవాలయం, నల్లగొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వేలను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. గోదావరి, కష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న పది చోట్లా పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్లగొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతుందని కేంద్ర మంత్రికి వివరించారు.

మెట్రో ఫేజ్ 2లో భాగంగా నాగోల్ నుంచి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపొలిస్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట, మియాపూర్-పటాన్‌చెరు, ఎల్బీ నగర్-హయత్ నగర్ మధ్య మొత్తం 76.4 కి.మీ నిర్మించనున్న మెట్రో రైలు నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 50:50 వాటాతో మెట్రో ఫేజ్‌ను 2 చేపట్టేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆ భూముల బదలాయింపుతో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశామని, నిధుల మంజూరుతో పాటు అనుమతులకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు.

మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు, గోదావరి నుంచి నగరానికి 15 టీఎంసీలను హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్టు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. ఆ మొత్తం విడుదలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు సమీప 27 మున్సిపాలిటీల్లో 7,444 కి.మీ.మేర సీవరేజీ నెట్‌వర్క్ పనులకు రూ.17,212.69 కోట్లతో సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అమత్ 2 లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద దానిని చేపట్టేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రయినేజీ ప్లాన్‌ను రూపకల్పన చేశామని, రూ.4,170 కోట్ల వ్యయమయ్యే ఈ ప్లాన్‌ను అమత్ 2 లేదా ప్రత్యేక పథకం కింద చేపట్టాలని సీఎం కోరారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరించండి
సింగరేణికి కోల్ బ్లాక్‌లు కేటాయించండి :
కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి సీఎం వినతి

తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్రం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2తో పాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ప్లాన్, సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. కిషన్‌రెడ్డిని గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావాల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. ట్రిబుల్ ఆర్‌ను నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోడీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్ఏఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సీఎం గుర్తు చేశారు. ఆర్ఆర్ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్క్స్, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివద్ధి అవుతాయని సీఎం అన్నారు. ఆర్ఆర్ఆర్ రెండు వైపులా పూర్తికి ఈ రహదారికి సంబంధించి వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అనుమతులన్నీ ఇప్పించేందుకు కృషి చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.34,367.62 కోట్లు అని కేంద్ర మంత్రికి తెలిపారు. ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని సీఎం తెలిపారు. పది గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఓఆర్ఆర్ అనుసంధానించే మెట్రో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థ అయిన సింగరేణి ప్రత్యక్షంగా 43 వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించడంతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోని థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తోందని కేంద్ర మంత్రికి దష్టికి సీఎం తీసుకెళ్లారు. దీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ మనుగడ కొనసాగించేందుకు గానూ గోదావరి లోయ పరిధిలోని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. సెమీకండక్టర్ల ప్రాజెక్టులకు హైదరాబాద్ అనువుగా ఉందని, నిపుణులైన కార్మికులు, మౌలిక వసతుల అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను పరిగణనలోకి తీసుకొని తెలంగాణను సెమీకండక్టర్ మిషన్‌లో చేర్చాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టులకు అనుమతులు, నిధుల విడుదలతో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు.. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు సురేశ్ షెట్కార్, బలరాం నాయక్, రఘురాంరెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం. అనిల్ కుమార్ యాదవ్, జీ. వంశీకష్ణ, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయాలు కేటాయించండి

- కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు కేటాయించినందుకు కేంద్రమంత్రికి సీఎం కతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రానికి ఒక్క కేంద్రీయ విద్యాలయం కూడా కేటాయించలేదని, కేంద్రీయ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు వాటిని కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు. డీమ్డ్ యూనివర్సిటీల ప్రకటనకు కేంద్ర, రాష్ట్ర



ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి అని, కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే డీమ్డ్ యూనివర్సిటీలను గుర్తిస్తున్నట్లు సీఎం కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లారు. డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌ఓసీ తీసుకునేలా చూడాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

చదరంగ రారాజు గుకేశ్ దొమ్మరాజు

- 18 ఏండ్లకే వరల్డ్ చెస్ కిరీటం సొంతం
- డింగ్ లిరెన్‌పై గుకేశ్ చారిత్రక విజయం

ప్రపంచ చెస్ చాంపియన్ షిప్ 2025

18 ఏండ్ల కుర్రాడు గుకేశ్ దొమ్మరాజు చదరంగంలో చరిత్ర సృష్టించాడు. 11 ఏండ్ల క్రితం భారత్ చేజారిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ కిరీటాన్ని తిరిగి స్వదేశానికి తీసుకొచ్చాడు. చెస్ మాంత్రికుడు, చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్‌పై గుకేశ్ దొమ్మరాజు చారిత్రక విజయం సాధించాడు. 14 గేముల క్లాసికల్ చెస్ పోటీ అనంతరం 7.5-6.5తో డింగ్ లిరెన్‌పై చిరస్మరణీయ విజయం సాధించాడు. ప్రపంచ చెస్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన రికార్డును నెలకొల్పాడు.

సింగపూర్ : దొమ్మరాజు గుకేశ్ చదరంగం చరిత్రలో నిలిచియే విజయాన్ని సాధించాడు. గురువారం సింగపూర్‌లో జరిగిన ఫిడె ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ 14వ గేమ్‌లో డింగ్ లిరెన్‌పై గుకేశ్ దొమ్మరాజు అద్భుత విజయం సాధించాడు. ఆఖరు క్లాసికల్ గేమ్‌లో నల్ల పావులతో ఎత్తులు వేసిన గుకేశ్.. అద్భుత రీతిలో విజయాన్ని అందుకున్నాడు. 58 ఎత్తుల్లో ముగిసిన 14వ గేమ్.. 54వ ఎత్తు వరకు డ్రా దిశగా సాగింది. కానీ 55వ ఎత్తులో డింగ్ లిరెన్ వేసిన ఆర్ఎఫ్2 ఎత్తు గుకేశ్‌ను విజయానికి చేరువ చేసింది. ఆ తర్వాత డింగ్ లిరెన్‌ను కట్టి పడేసిన గుకేశ్.. మరో రెండు ఎత్తుల్లోనే ఆటను ముగించాడు. 14 గేముల్లో గుకేశ్ మూడింట విజయాలు సాధించగా, డింగ్ లిరెన్ రెండింట గెలుపొందాడు. మిగతా 9 గేములు డ్రాగా ముగిశాయి. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత భారత్ నుంచి ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించిన రెండో గ్రాండ్‌మాస్టర్‌గా గుకేశ్ దొమ్మరాజు నిలిచాడు.

గుకేశ్ అద్భుతం

18 ఏండ్ల గుకేశ్ దొమ్మరాజు ఫిడె క్యాండిడేట్స్ 2024 టోర్నమెంట్‌లో సైతం ఫేవరేట్ కాదు. అయినా, ప్రపంచ మేటి గ్రాండ్‌మాస్టర్స్‌ను ఓడించి క్యాండిడేట్స్ విజేతగా నిలిచాడు. ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లోనూ గుకేశ్ ఫేవరేట్ కాదు. డింగ్ లిరెన్ చదరంగంలో తిరుగులేని చక్రవర్తి. మాగ్నస్ కార్ల్‌సన్ తర్వాత



డింగ్ లిరెన్ చెస్‌పై తన ఆధిపత్యాన్ని చెలాయించాడు. దీంతో సహజంగానే సింగపూర్‌లో డింగ్ లిరెన్ టైటిల్ నిలుపుకోవటం లాంఛనమే అనుకున్నారు. అందుకు తగినట్టుగానే తొలి గేమ్‌లోనే లిరెన్ విజయం సాధించాడు. గుకేశ్‌ను తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. కానీ గుకేశ్ వెనక్కి తగ్గలేదు. మానసిక ఒత్తిడి నిపుణుడు ప్యాడీ ఆప్టన్ సహకారంతో గొప్పగా పుంజుకున్నాడు. 11వ గేమ్‌లో తెల్ల పావులతో గుకేశ్ నెగ్గగా.. 12వ గేమ్‌లో లిరెన్ ఎదురులేని విజయంతో పుంజుకున్నాడు. తెల్ల పావులతో 13వ గేమ్‌ను డ్రా చేసుకున్న గుకేశ్‌కు చివరి గేమ్‌లో అవకాశాలు లేవనే అనుకున్నారు. క్లాసికల్ గేమ్‌లో గుకేశ్ దిట్ట. 14వ గేమ్ సైతం డ్రాగా ముగిస్తే రేసు టై బ్రేకర్‌కు వెళ్తుంది. 14వ గేమ్ ఆరంభం నుంచి డ్రా దిశగా సాగింది. కానీ 55వ ఎత్తులో డింగ్ లిరెన్ ఊహించని పొరపాటు చేశాడు. దీంతో అప్పటివరకు నల్ల పావులతో డ్రాతో సరిపెట్టుకునేందుకు సిద్ధమవుతున్న గుకేశ్ అవకాశాన్ని అందిపుచ్చుకున్నాడు. మరో రెండు ఎత్తుల్లోనే ఆటను ముగించాడు. చివరి గేమ్‌లో అనుకోని విజయంతో 7.5-6.5తో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించాడు. ఫిడె ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించాడు.

ఆ రోజే అనుకున్నాను!

'2013లో చెన్నైలో విశ్వనాథన్ ఆనంద్, మాగ్నస్ కార్ల్‌సన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీని ప్రత్యక్షంగా తిలకించాను. భారత్ నుంచి ప్రపంచ చెస్ టైటిల్ చేజారటం చూశాక.. ఎప్పటికైనా ఆ కిరీటాన్ని తిరిగి భారత్‌కు సాధించాలనే స్వప్నం నాలో బలంగా నాటుకుంది. సింగపూర్‌లో తొలి గేమ్‌లో నా పక్కన భారత జాతీయ జెండా ఉండటం గొప్ప గర్వంగా అనిపించింది. నా తల్లిదండ్రులు, నా టీమ్ ఈ విజయానికి బాటలు వేశారు. డింగ్ లిరెన్ గొప్ప చదరంగ మాంత్రికుడు. అతడు ఆ పొరపాటు చేస్తాడని ఊహించలేదు. ఒక్కసారి అతడు చేసిన పొరపాటు అర్థం చేసుకున్నాక నా భావోద్వేగాలు అదుపులో లేవు. ఎంతో సంతోష పడ్డాను. ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలువటం మాటల్లో చెప్పలేని అనుభూతి' అని గుకేశ్ దొమ్మరాజు అన్నాడు.

తెలుగు టైటాన్స్‌కు నిరాశ

27-33తో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓటమి
ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11

పుణె : ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ తొమ్మిదో పరాజయం చవిచూసింది. ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతున్న తరుణంలో తెలుగు టైటాన్స్ వరుస పరాజయాలతో నిరాశపరిచింది. గురువారం పుణెలోని బాలెవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పీకెఎల్ లీగ్ దశ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌పై 33-27తో దబంగ్ ఢిల్లీ మెరుపు విజయం సాధించింది.



ప్రథమార్థంలో 17-13తో నాలుగు పాయింట్ల ముందంజలో నిలిచిన తెలుగు టైటాన్స్ ద్వితీయార్థంలో తేలిపోయింది. స్టార్ రెయిడర్ పవన్ సెహ్రావత్ గాయం నుంచి కోలుకుని రీ ఎంట్రీ ఇచ్చినా తెలుగు టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. విజయ్ మాలిక్ (10) మరో సూపర్ టెన్ ప్రదర్శనతో మెరువగా.. ఆశీష్ నర్వాల్ (8) రాణించాడు. కానీ పవన్ సెహ్రావత్ 3 పాయింట్లు మాత్రమే సాధించాడు. దబంగ్ ఢిల్లీ తరఫున నవీన్ కుమార్ (11 పాయింట్లు), ఆషు మాలిక్ (9 పాయింట్లు) రాణించారు. పీకెఎల్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ 19 మ్యాచుల్లో 10 విజయాలతో పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి పడిపోయింది.

నవచిత్రం

సరికొత్త స్క్రీన్‌ప్లేతో 'ఫియర్'



హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన సినిమా 'ఫియర్'. ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఈ మూవీని రూపొందించారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు. విడుదలకు ముందే ఈ సినిమా వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులను గెల్చుకుని, కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ ఏఆర్ అభి మాట్లాడుతూ, హీరోయిన్ వేదిక మా మూవీకి ఎంతో సపోర్ట్ చేశారు. నాలుగు భాషల్లో హీరోలతో టీజర్ రిలీజ్ చేయించారు. నా వైఫ్ హరిత స్క్రిప్ట్ మీద పూర్తి నమ్మకంతో మూవీ చేసింది. మా సినిమా టీజర్, పాటలు చూడండి. మీకు నచ్చితే థియేటర్స్‌కు వెళ్లి చూడండి. గురువారం నుంచి పెయిడ్ ప్రీమియర్స్ వేస్తున్నాం. మేము అనుకున్న దానికంటే చాలా ఎక్కువగా 70% బుకింగ్స్ ఉన్నాయి. చాలా హ్యాపీగా ఉంది' అని చెప్పారు. డైరెక్టర్ డా. హరిత గోగినేని మాట్లాడుతూ, 'ఇది స్క్రీన్ ప్లే ఓరియెంటెడ్ మూవీ. సరికొత్త స్క్రీన్ ప్లే ఉంది కాబట్టే 70 ఇంటర్నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఫీమేల్ డైరెక్టర్స్ మనకు చాలా తక్కువ. మీ ఇంట్లో అమ్మాయి తీసిన సినిమా అనుకుని ఈ సినిమాని చూసి ఆదరించండి' అని తెలిపారు.

యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ

అనిల్ అర్కా, విహారికా చౌదరి హీరో, హీరోయిన్లుగా శ్రీ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన మూవీ 'వారధి'. రాధాకృష్ణ ఆర్ట్స్ బ్యానర్ పై పెయ్యాల భారతి, ఎం.డి.యూనస్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సెన్సర్ సభ్యులు ఈ సినిమాకు యు/ఎ సర్టిఫికెట్ జారీ చేసి, చిత్ర యూనిట్‌ను అభినందించారు. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీ కృష్ణ మాట్లాడుతూ, 'ఇదొక యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ. ఈ కథలో లవ్, రొమాన్స్, థ్రిల్లర్ ఉండటంతో అందరిని ఆకట్టుకుంటుంది. ప్రేక్షకులందరికీ నచ్చే కథను అందిస్తున్నామనే నమ్మకం ఉంది. సాంకేతిక నిపుణుల కృషి, కథా కథనాల ప్రత్యేకత, నటీనటుల అభినయం చిత్రానికి ప్రధాన బలంగా నిలుస్తాయి. సరికొత్త కథనంతో కొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేశాం. ఈ సినిమా ఈ తరానికి స్పెషల్ ట్రీట్‌గా నిలవడం ఖాయం. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సమర్పణ: వెబ్బీయార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కథ - దర్శకత్వం: శ్రీ కృష్ణ, నిర్మాతలు: పెయ్యాల భారతి, ఎం.డి.యూనస్, రచయిత: నాగేంద్ర పలగాని, సినిమాటోగ్రఫీ: శక్తి .జె కె, సంగీత దర్శకుడు: షారుఖ్ షేక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బి.ఎస్. చందు.


అనిల్ అర్కా, విహారికా చౌదరి


వెంకటేష్

ఫ్యాన్స్‌కి బర్త్‌డే సర్‌ప్రైజ్

వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో రాబోతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇది వారి సక్సెస్ ఫుల్ కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా దీన్ని నిర్మిస్తున్నారు. నేడు (శుక్రవారం) వెంకటేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ మేకర్స్ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. వెంకటేష్ డైనమిక్, స్టైలిష్ అవతార్‌లో కనిపించిన ఈ బ్రాండ్ న్యూ పోస్టర్ అదిరిపోయిందంటూ ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు అని చిత్రయూనిట్ తెలిపింది. వెంకటేష్ బర్త్ డే సందర్భంగా 'సంక్రాంతికి వస్తున్నాం' సెకండ్ సింగిల్ ప్రోమోని అభిమానులకు కానుకగా చిత్ర బృందం ఇవ్వనుంది. ఈ చిత్రం ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇటీవలే రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ 'గోదారి గట్టు..' సాంగ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ ట్రయాంగిల్ క్రైమ్ కథలో వెంకటేష్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. జనవరి 14న సంక్రాంతి కానుకగా ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా విడుదల కానుంది. ఉపేంద్ర లిమాయే, రాజేంద్ర ప్రసాద్, సాయి కుమార్, నరేష్, వీటీ గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్, చైతన్య జొన్నలగడ్డ, మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి, సమర్పణ: దిల్ రాజు, నిర్మాత: శిరీష్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, డీవోపీ: సమీర్ రెడ్డి, ప్రొడక్షన్ డిజైనర్: ఏ.ఎస్.ప్రకాష్, ఎడిటర్: తమ్మిరాజు, కో రైటర్స్: ఎస్ కృష్ణ, జీ. ఆదినారాయణ, యాక్షన్ డైరెక్టర్: వి.వెంకట్.

ఇది నా విక్టరీ కాదు.. ఇండియా విక్టరీ : అల్లు అర్జున్

'నాపై ఇంత ప్రేమ చూపిస్తున్న భారతీయులందరికీ నా కృతజ్ఞతలు. గ్లోబల్‌గా ఉన్న సినీ ప్రేమికులందరూ ఇండియా సినిమాను ఇంతగా ఆదరిస్తున్నందుకు వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు. ఇది నా విక్టరీ కాదు. ఇండియా విక్టరీ' అని అల్లు అర్జున్ అన్నారు. అల్లుఅర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందిన 'పుష్ప2 : ది రూల్' చిత్రం ఈనెల 5వ తేదీ విడుదలైంది. కేవలం 6 రోజుల్లోనే వెయ్యి కోట్ల రూపాయలకు పైగా కలెక్ట్ చేసి, దేశ సినిమా చరిత్రలోనే సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం 'థ్యాంక్యూ ఇండియా'ని ఢిల్లీలో మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లుఅర్జున్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను మరింత ప్రేమతో, అత్యధిక వసూళ్లతో ఆదరిస్తున్న హిందీ సినీ ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఈ సినిమా సక్సెస్‌కు ప్రధాన కారణం.. ఇండియన్ బాక్సాఫీస్‌ను రూల్ చేస్తున్న దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్‌దే. ఆయన విజన్, ఆయన కష్టానికి ప్రతిఫలం ఈ చిత్రం. ఈ చిత్రం రూ.1000 కోట్లు కలెక్ట్ చేయడం, భవిష్యత్‌లో మరింత వసూళ్లు సాధించడం ఒక ఎత్తయితే, నెంబర్స్ అనేవి వాళ్ల ప్రేమకు నిదర్శనం. అయితే ఈ నెంబర్స్ టెంపరరీ. ఎందుకంటే భవిష్యత్‌లో మరో సూపర్‌హిట్ సినిమా ఈ నెంబర్స్‌ను క్రాస్ చేస్తుంది. కానీ ఆడియన్స్ ఇచ్చే లవ్ మాత్రం శాశ్వతం. వాళ్లు నా పై చూపిస్తున్న వైల్డ్ ప్రేమకు జీవితాంతం ఋణపడి ఉంటాను' అన్నారు.


అల్లు అర్జున్

డ్రింక్సు.. డ్రింక్సు.. డ్రింక్సు..


ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటిస్తున్న సినిమా 'డ్రింకర్ సాయి'. బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 27న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఈ సినిమా నుంచి 'డ్రింక్సు, డ్రింక్సు, డ్రింక్సు..' అంటూ సాగే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'లక్ష్మీ వైన్సు, దుర్గ వైన్సు, సాయి బాబ వైన్సు, శ్రీనివాస వైన్సు, బాలాజీ వైన్సు, భార్గవి వైన్సు, శ్రీకృష్ణ వైన్సు, శివగణేశ వైన్సు, దేవుళ్లే చెబుతుంటే వెల్ కమ్ము, మీరెందుకు పెడతారు టోల్ గేట్సు, డ్రింక్సు, డ్రింక్సు, డ్రింక్సు..స్వర్గానికి మనకు లింక్సు..' అంటూ సాగే ఈ సాంగ్‌ను శ్రీ వసంత్ మంచి బీట్‌తో కంపోజ్ చేయగా, చంద్రబోస్ క్యాచీ లిరిక్స్ అందించారు. రాహుల్ సిప్లిగంజ్ ఎనర్జిటిక్‌గా పాడారు.

ఓ అసామాన్యుడి వీర విప్లవ కథ..

విజయ్ సేతుపతి, వెట్రిమారన్ కలయికలో రూపొందిన 'విడుదల -1' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్న నిర్మాత, శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు మాట్లాడుతూ, 'ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రంలోని పాటలకు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. పరిపాలకుల అహంకారానికి అణచివేయబడిన సామాన్యుల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథే ఈ సినిమా. ఇది తమిళ చిత్రం కాదు. తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలు, ఇక్కడ జరిగిన సంఘటనలు ఆధారంగా తీసిన చిత్రమిది. నక్సలైట్ పెరుమాళ్ పాత్రలో విజయ్ సేతుపతి నటన, పాత్రలోని ఎమోషన్, ఆయన పండించిన విధానం అద్భుతం. ఏడు సార్లు నేషనల్ అవార్డు అందుకున్న వెట్రిమారన్ దర్శకత్వ ప్రతిభ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక ఈ చిత్రానికి ఇళయరాజా ప్రళయం లాంటి సంగీతాన్ని అందించారు. ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్‌పై చూడని పోరాటాలు సమకూర్చారు. మంజు వారియర్ సహజ నటన ఈ చిత్రానికి ప్లస్ అవుతుంది. ఈనెల 20న తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.


చింతపల్లి రామారావు

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886